
ఆమె గౌను విలువ రూ.1500 కోట్లు



12

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 15 మే 2026 | సంపుటి: 10 | సంచిక: 129 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

మోడీ పొదుపు పిలుపు.. పోలీసు ఆచరింపు

ఎడ్లబండిపై బారాత్



2

# జూన్ 15 నుంచి సర్

## తెలంగాణతో పాటు 16 రాష్ట్రాల్లో మూడో దశ ఎస్ఐఆర్‌కు నోటిఫికేషన్

హైదరాబాద్, మే 14 : తెలంగాణలో సర్ ప్రక్రియ జూన్ 15 నుంచి ప్రారంభం కానున్నది. ఈ మేరకు మూడో దశ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు కేంద్ర ఎన్నికల సంఘం 'నోటిఫికేషన్' జారీ చేసింది. ఏపీ, తెలంగాణతో పాటు 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ నిర్వహించనుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, ఝార్ఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, సిక్కిం, ఉత్తరాఖండ్, త్రిపుర ఉన్నాయి. ఈ దశలో 3.94 లక్షల మందికిపైగా బూత్ స్థాయి అధికారులు.. 36.73 కోట్ల మంది ఓటర్ల వద్దకు వెళ్లనున్నారు. డిసెంబర్ 23న త్రిపురతో మూడో దశ ఎస్ఐఆర్ ప్రక్రియ ముగుస్తుంది. తెలంగాణలో జూన్ 15 నుంచి

...మిగతా 2లో




## అప్రమత్తమైన అధికార పార్టీ

నేడు ప్రధాన ఎన్నికల అధికారితో పీసీసీ చీఫ్ భేటీ


అందుబాటులో ఉన్న ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీలు రావాలని పిలుపు

2

# ఇంధన పొదుపు దిశగా ప్రభుత్వ అడుగులు

### సీఎం రేవంత్ కాన్వాయ్‌లో వాహనాల కుదింపు

### మంత్రులు, వీఐపీల కాన్వాయ్ కూడా తగ్గించే యోచన



హైదరాబాద్, మే 14 (మనం బ్యూరో) : రాష్ట్రంలో ఇంధనం పొదుపు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో పెట్రోల్, డీజిల్‌కు తీవ్ర కొరత ఏర్పడిన నేపథ్యంలో వీటి వాడకం తగ్గించాలని ఇటీవల హైదరాబాద్ పర్యటకు వచ్చిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి కార్యాలయం సైతం వాహనాల వాడకాన్ని తగ్గించాలని నిర్ణయించింది. ఇప్పటికే

...మిగతా 2లో

## నీట్ రద్దు మోడీ నిరంకుశ నిర్ణయం

విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది

సీఎం రేవంత్ రెడ్డి

2



## కాన్వాయ్‌ను తగ్గించుకున్న గవర్నర్

ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు కూడా పాటించాలి

3

పాఠశాలలు, కాలేజీలలో ఇంప్లిమెంట్ చేయాలి



## కేరళం సీఎంగా వీడీ సతీశన్

బలమైన ప్రజానేతగా గుర్తింపు పొందిన నేత

పరావుర్ నియోజకవర్గం నుంచి ఆరోసారి గెలిచి రికార్డు

2

## మండువేసవిలో వాన బీభత్సం

యూపీలో అకాల వర్షం, గాలి దుమారం వల్ల 89 మంది మృతి

2

## ఫస్టియర్‌లోనూ ప్రాక్టికల్స్

### ఇంటర్ విద్యలో పలు మార్పులు

### యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యత

హైదరాబాద్, మే 14 : ఇంటర్మీడియట్ విద్యలో తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఫస్టియర్లోనూ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీకి ప్రాక్టికల్స్ పెట్టింది.. ఫస్టియర్ ప్రాక్టికల్స్‌కు 15 మార్కులు, సెకండియర్ ప్రాక్టికల్స్‌కు 15 మార్కులు కేటాయించనున్నారు. మ్యాథ్స్‌లోనూ యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ను ఇంటర్ బోర్డు ప్రవేశపెట్టింది. దీనిలో 75కు బదులు 60 మార్కులకు ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్నల్ అసెస్ మెంటు ఒక్కో ఏడాదికి 15 మార్కులు కేటాయించారు. హ్యూమానిటీస్ లో యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్కు 20 మార్కులు కేటాయిస్తారు. ఫైనల్ పరీక్షలు 100 మార్కులకు బదులు 80 మార్కులకే నిర్వహించనున్నారు. భాషా విభాగాల్లోనూ 100 మార్కులకు బదులు 80 మార్కులకు ఫైనల్ పరీక్షలు, 20 మార్కులు ఇంటర్నల్ అసెస్ మెంట్ కు కేటాయించనున్నట్లు ఇంటర్ బోర్డు వర్గాలు తెలిపాయి.

కేటీఆర్‌కు ఏసీబీ

మరోసారి తెరపైకి ఫార్ములా-ఈ రేస్ కేసు

## కోర్టు నోటీసులు

### మాజీ మంత్రి కేటీఆర్ సహా నిందితులకు తాఖీదులు

జూలై 31న హాజరుకావాలని ఆదేశాలు



హైదరాబాద్,మే 14(మనం,ప్రత్యేక ప్రతినిధి) : ఫార్ములా-ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న ఏసీబీ కోర్టు

...మిగతా 2లో

# అక్రమ పార్కింగ్ చేస్తే అంతే సంగతులు

- రూల్స్ పాటించకుంటే ఛార్జీల వాత పెద్దరు
- బ్రేక్‌డౌన్ అయిన వాహనాలను రోడ్లపై వదిలేస్తే కఠిన చర్యలు
- పీపీపీ విధానంలో యార్డుల ఏర్పాటు
- సరికొత్త పాలసీ రూపొందించిన రవాణా శాఖ




హైదరాబాద్,మే14(మనం న్యూస్) : రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాల్ని అడ్డదిడ్డంగా నిలపడం, బ్రేక్ డౌన్ అయిన వాటిని రోజుల తరబడి పట్టించుకోకుండా వదిలేయడంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు పలుచోట్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీనివల్ల ఆయా మార్గాల్లో ప్రయాణం చేసే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా తెలంగాణ రవాణా శాఖ నూతన విధానాన్ని తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఆమోదం కోసం ముసాయిదా పాలసీని సర్కారుకు సమర్పించింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ముసాయిదాను రూపొందించినట్లు రవాణా శాఖ వివరించింది. ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన తర్వాత ముసాయిదా పాలసీపై ప్రజల నుంచి సూచనలు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఆ తర్వాత కొత్త పాలసీ అమల్లోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

రోడ్లపై ఎప్పుడైనా వాహనం వదిలేసి వెళ్లారా? సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకుంటారు. సాధారణంగా ఇప్పుడైతే నోపార్కింగ్ వంటి ఫైన్ చెల్లించి వాహనం అక్కడి నుంచి తెచ్చుకుంటున్నారు. కానీ కొత్త పాలసీలో ఖర్చు, జరిమానాలు తడిసి మోపెడవుతాయి. టోయింగ్ ఛార్జీలను సదరు వాహనదారు కచ్చితంగా కట్టాల్సిందే. ఎన్ని రోజుల తర్వాత వాహనం తెచ్చుకుంటే అన్నిరోజులకు పార్కింగ్ ఫీజును సైతం

...మిగతా 2లో

# అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### బ్రాహ్మణులు సమాజ ఐక్యత, సంప్రదాయ పరిరక్షణకు కృషి చేయాలి

### మంత్రి శ్రీధర్ బాబు పిలుపు

### టీబీఎస్పీ చైర్మన్‌గా బస్వరాజు శ్రీనివాస్ పదవీ స్వీకారం



హైదరాబాద్, మే 15 ( మనం బ్యూరో ) : రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ బ్రాహ్మణుల అభివృద్ధికి ఇతోధిక కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం నాగోల్‌లోని వసంతవిహార్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ (టీబీఎస్పీ)గా బస్వరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బ్రాహ్మణులు కేవలం పూజలకే పరిమితం కాకుండా సమాజ ఐక్యత, సంప్రదాయ పరిరక్షణకు కేంద్ర బిందువులు కావాలని

...మిగతా 2లో

## శ్రీ వైష్ణవులకు శూన్య హస్తం

తెలంగాణ శ్రీవైష్ణవ సేవా సంఘం ప్రధాన కార్యదర్శికందాళ కృష్ణమాచార్యులు

3

## భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

- ఇరు పక్షాల లాయర్ల మధ్య వాగ్వాదం
- అసహనం వ్యక్తం చేసిన జడ్జి
- వేరే బెంచ్‌కు మార్చుకోవచ్చని సూచన
- నేడు మధ్యంతర బెయిల్‌పై తీర్పు



3

## ఎన్నికల కమిషనర్ల నియామకంలో ప్రజాస్వామ్యం ఎక్కడుంది?

### ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

ఢిల్లీ, మే 14 : భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, కమిషనర్ల నియామకంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నియామక ప్రక్రియలో ప్రజాస్వామ్యం ఎక్కడుందని జస్టిస్

...మిగతా 2లో

# నాకేమన్నా ఐతే..!!



### అమెరికాను నువ్వే చూసుకోవాలె

### ఉపాధ్యక్షుడు వాన్స్‌కు ట్రంప్ సీక్రెట్ లెటర్..?

వాషింగ్టన్, మే 14 : అమెరికా అధ్యక్షుడు ట్రంపునకు సంబంధించి ఓ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. విదేశీ పర్యటనలకు వెళ్లే ప్రతిసారీ.. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కోసం ఆయన ఒక సీక్రెట్ లెటర్ రాసి ఉంచుతారట. ఈ విషయాన్ని వైట్ హౌజ్ అధికారి సెబాస్టియన్ గోర్క్ ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

...మిగతా 2లో

## పేరు మార్చుకుని చైనాకు రూబియో

2

తైవాన్ విషయంలో తేడా వస్తే..

# బంధం తెగినట్టే

### అమెరికా- చైనా మధ్య యుద్ధమే

### ట్రంపును హెచ్చరించిన జిన్‌పింగ్

### జిన్‌పింగ్ గొప్ప లీడర్ అని ప్రశంసించిన అమెరికా అధ్యక్షుడు

ఈ ఇరు దేశాధ్యక్షుల మధ్య జరిగిన అంతర్గత భేటీ వివరాలను వెల్లడించిన చైనా అధికారిక మీడియా



బీజింగ్, మే 14 : అమెరికా అధ్యక్షుడు తొమ్మిదేండ్ల తర్వాత చైనాలో పర్యటిస్తున్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ తో ఆయన ద్వైపాక్షిక భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తైవాన్ విషయంపై అమెరికాకు జిన్ పింగ్ కీలక హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. ఇరు దేశాల సంబంధాల్లో తైవాన్

...మిగతా 2లో

## హర్మ్యూజ్‌ను దాటి వస్తున్న భారీ ఎల్పీజీ ట్యాంకర్!




టెహ్రాన్, మే 14 : పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు, గ్యాస్ సరఫరాలో అంతరాయం కొనసాగుతోంది. ఈ క్రమంలో భారత్‌కు రావాల్సిన ఒక ఎల్పీజీ నౌక

...మిగతా 2లో

# నాకేమన్నా ఐతే..!!

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడు ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో గోర్క్ పేర్కొన్న విషయాలు చర్చనీయాంశమైనాయి. ట్రంప్ విదేశీ పర్యటనలకు వెళ్లే ముందు రిజల్యూట్ డెస్క్ లో ఉపాధ్యక్షుడు వాన్స్ కోసం సీక్రెట్ లెటర్ ఉంచుతారని గోర్క్ పేర్కొన్నారు. ఆ పర్యటనలో తనకు ఏదైనా జరిగితే.. దేశాన్ని ముందుకు నడిపించేందుకు అవసరమైన సమగ్ర సూచనలను అందులో వెల్లడిస్తారన్నారు. ట్రంప్ చైనా పర్యటన నేపథ్యంలో విదేశీ శక్తులు ట్రంపును లక్ష్యంగా చేసుకోవచ్చనే ఆందోళనలు నెలకొన్నాయి. అయితే, గోర్క్ వీటిని కొట్టి పడేశారు. వారు ట్రంపును ఏదైనా చేస్తారనే భయం తనకు లేదని, ఆయన చాలా సురక్షితంగా ఉన్నారన్నారు.

ఇదిలాఉండగా.. ట్రంపుపై ఇప్పటికే అనేకసార్లు హత్యాయత్నాలు జరిగిన సంగతి తెలిసిందే. 2024 పెన్సిల్వేనియాలోని ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ ప్రసంగిస్తుండగా.. ఓ యువకుడు ఆయనపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ట్రంప్ కుడి చెవి పైభాగం నుంచి ఓ తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్ లో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా.. ఓ దుండగుడు ఫెన్సింగ్ వద్దకు తుపాకీతో వచ్చాడు. భద్రతా బలగాలు దీన్ని గుర్తించి అతడిపై కాల్పులు జరిపారు. ఇటీవలే వాషింగ్టన్లోని హిల్టన్ హోటల్ లో నిర్వహించిన వైట్ హౌజ్ కరస్పాండెంట్స్ డిన్నర్లో ఓ దుండగుడు కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటన నుంచి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు సహా కీలక నేతలు తృటిలో తప్పించుకున్నాడు.

ఒంటరిని అయిపోయాను: వాన్స్

ట్రంప్ తో సహా కీలక అధికారులంతా ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్నారు. ప్రస్తుతం వైట్ హౌజ్ బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఉపాధ్యక్షుడు వాన్స్ ఒంటరి అయిపోయినట్లు ఫీల్ అవుతున్నారు. సీక్రెట్ సర్వీస్ ప్రొటోకాల్స్ ప్రకారం.. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు కలిసి విదేశాలకు వెళ్లకూడదు. 'ఇప్పుడు నేను వైట్ హౌజ్ కు వెళ్లాలి. అక్కడ ఎవరూ ఉండరు. అంతా నిశ్శబ్దంగా ఉంటుంది. అసలు ఏం జరుగుతుందో గ్రహించడానికే నాకు సమయం పడుతుంది' అని విలేకరులతో అన్నారు. ఆయన మాటలకు వారంతా ఒక్కసారిగా నవ్వేశారు.

# పేరు మార్చుకుని చైనాకు రూబియో

**బీజింగ్, మే 14 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్, ఆయన మంత్రుల బృందం ప్రస్తుతం చైనా పర్యటనలో ఉంది. ఈ సందర్భంగా ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. ఈ పర్యటన కోసం యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో తన పేరు మార్చుకున్నారు. 'మార్కో లూ'గా చైనాలో అడుగుపెట్టారు. కారణం...

అమెరికా-చైనా మధ్య చాలా అంశాల్లో విభేదాలు ఉన్నాయి. డ్రాగన్ ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తోందని ముఖ్యంగా వీగర్ ముస్లింల విషయంలో కఠినవైఖరి అవలంబిస్తోందని అగ్రరాజ్యం ఆరోపిస్తోంది. సెనెటర్గా ఉన్నప్పుడు మార్కో రూబియో చైనాపై ఈ అంశం మీద తీవ్ర విమర్శలు చేశారు. చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీని లక్ష్యంగా చేసుకున్నారు. 'పది లక్షలకు పైగా వీగర్లు, ఇతర ముస్లింలను శిబిరాల్లో నిర్బంధించి, బలవంతపు చాకిరీ చేయిస్తున్నారు. వీగర్ మహిళలు లైంగిక హింసకు బాధితులుగా మారుతున్నారు' అని విమర్శిస్తూ కొన్నేళ్ల క్రితం రూబియో ఒక వీడియో కూడా విడుదల చేశారు.

దీంతో ఆగ్రహం చెందిన చైనా2020 నుంచి మార్కో రూబియో చైనాలో పర్యటించకుండా నిషేధం విధించింది. ఇప్పుడు ఆయన చైనాలో పర్యటించేందుకు మంత్రిగా దౌత్యపరంగా తనకున్న వెసులుబాటును ఉపయోగించుకున్నారు. తన సర్నేమ్ స్థానంలో చైనా పదం 'లూ'ను చేర్చుకున్నారు.

### తైవాన్ విషయంలో తేడా వస్తే..

# బంధం తెగినట్టే

(మొదటి పేజీ తరువాయి)

అంశమే అత్యంత కీలకమైనదని ద్వైపాక్షిక భేటీలో జిన్ పింగ్ స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. ట్రంప్-జిన్ పింగ్ సమావేశం అంతర్గతంగా జరిగినప్పటికీ.. ఆ భేటీ వివరాలను చైనా అధికారిక మీడియా ప్రచురించింది. తైవాన్ సమస్యను సరిగ్గా పరిష్కరించకపోతే.. అమెరికా-చైనా మధ్య ఘర్షణ తలెత్తే ప్రమాదం ఉందని జిన్ పింగ్ హెచ్చరించారు. తైవాన్ జలసంధిలో అంతటా శాంతి, స్థిరత్వాన్ని పరిరక్షించడమే ఇరు దేశాల మధ్య ఉన్న అతిపెద్ద విషయమన్నారు. ఇక, ప్రపంచమంతా తమ సమావేశాన్ని ఆసక్తిగా చూస్తోందన్నారు. అమెరికా-చైనాలు భాగస్వామ్య దేశాలుగా ఉండాలని.. ప్రత్యర్థులుగా కాదని అన్నారు. ఒకరికొకరు సహకరించుకుంటూ మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు ప్రపంచానికి మేలు చేస్తాయన్నారు. తమ మధ్య విభేదాల కంటే ఉమ్మడి ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయని తాను నమ్ముతానన్నారు. ట్రంప్- జిన్ పింగ్ మధ్య దాదాపు రెండు గంటల పాటు సమావేశం జరిగింది. తైవాన్ తో పాటు ఇరు దేశాల మధ్య వాణిజ్యం, ఇతర ద్వైపాక్షిక అంశాల గురించి నేతలు చర్చించినట్లు సమాచారం.

**జిన్ పింగ్ గొప్ప లీడర్...**

ఇక, ఈ సమావేశానికి ముందు ట్రంప్ మాట్లాడుతూ.. జిన్ పింగ్తో తన భేటీని అతిపెద్ద శిఖరాగ్ర సమావేశంగా అభివర్ణించారు. చైనా అధ్యక్షుడితో తనకున్న వ్యక్తిగత బంధం గురించి కూడా ఆయన మాట్లాడారు. ఆయన గొప్ప లీడర్ అని కొనియాడారు. తాను అలా మాట్లాడటం కొందరికి నచ్చకపోయినా.. అదే వాస్తవమని ట్రంప్ పేర్కొన్నారు. జిన్ పింగ్ తో స్నేహం తనకు గర్వకారణమని తెలిపారు. ఈ పర్యటనతో ఇరుదేశాల మధ్య సంబంధాలు గణనీయంగా మెరుగుపడతాయని ట్రంప్ చెప్పుకొచ్చాడు.

# హర్మ్యూజ్‌ను దాటి వస్తున్న భారీ ఎల్పీజీ ట్యాంకర్!

(మొదటి పేజీ తరువాయి)

హర్మ్యూజ్ జలసంధిని దాటినట్లు తెలుస్తోంది. ఈ ఎంవీ సన్ షైన్ అనే నౌక సురక్షితంగా స్వదేశానికి చేరుకునేందుకు భారత నౌకాదళంతో సహా పలు ఏజెన్సీలు సహకారం అందిస్తున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ నుంచి ఈ నౌకతో కలిపి 15 ఎల్పీజీ నౌకలు సురక్షితంగా స్వదేశానికి తరలించినట్లు వెల్లడించాయి. అయితే, ఇది ఎన్ని టన్నుల ఎల్పీజీతో వస్తుంది, భారత్ కు ఎప్పుడు చేరుకుంటుందన్న విషయాలు మాత్రం తెలియరాలేదు.

ఇదిలాఉండగా.. శాంతి నెలకొన్న తర్వాత హర్మ్యూజ్లో పరిస్థితులు గణనీయంగా మెరుగుపడతాయని ఇరాన్ న్యాయ, అంతర్జాతీయ వ్యవహారాల ఉపవిదేశాంగ మంత్రి కాజమ్ ఘరీబబాదీ పేర్కొన్నారు. దౌత్యంపై అమెరికా నిబద్ధతతో లేదని విమర్శించారు. తాము అంతర్జాతీయ చట్టాలను అతిక్రమించడం లేదని, శాంతి నెలకొన్న తర్వాత మునపటి కంటే ఎక్కువ భద్రత ఉంటుందని ఆయన తెలిపారు.

# తెలంగాణలో జూన్ 15 నుంచి సర్

### 16 రాష్ట్రాల్లో మూడో దశ సమగ్ర సవరణకు నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

24 వరకు సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటి సర్వే చేపడతారు. అనంతరం జులై 31న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటించి.. అదే రోజు నుంచి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు.

ఏపీలో జూన్ 5 నుంచి 14 వరకు ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. అదే నెల 15 నుంచి జులై 14 వరకు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించనున్నారు. అనంతరం జులై 21న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటిస్తారు. జులై 21 నుంచి ఆగస్టు 20 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు.

# అప్రమత్తమైన అధికార పార్టీ

**హైదరాబాద్, మే 14 ( మనం బ్యూరో ) :** కేంద్ర ప్రభుత్వం సమగ్ర జన గణన (సర్) షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఈమేరకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో భేటీ కానున్నారు. త్వరలో రాష్ట్రంలో జరుగబోయే 'సర్' ప్రక్రియపై ఆయనతో చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌కు రావాలని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ పిలుపునిచ్చారు.

# సతీశన్‌కు శుభాకాంక్షలు

### ఆయన నేతృత్వంలో కలసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్న రేవంత్

**హైదరాబాద్, మే 14 (మనం బ్యూరో) :** కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన గురువారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గౌరవమని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలో యూడీఎఫ్‌కు ప్రజలు అధికార బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళం దేశానికి ఆదర్శంగా నిలిచిందనీ, సతీశన్ నాయకత్వంలో ఆ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటక రంగాల్లో కేరళం ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సతీశన్ నేతృత్వంలో కేరళం మరింత ప్రగతి, మరింత సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# ఎన్నికల కమిషనర్ల నియామకంలో ప్రజాస్వామ్యం ఎక్కడుంది?

(మొదటి పేజీ తరువాయి)

దీపాంకర్ దత్తా ప్రశ్నించారు. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, క్యాబినెట్ మంత్రితో కూడిన ప్యానెల్ ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్ల నియామకంపై నిర్ణయం తీసుకుంటోంది.



నియామక ప్రక్రియపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ దత్తా పలు ప్రశ్నలు సంధించారు. సీబీఐ డైరెక్టర్ నియామక ప్యానెల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా ఉన్నప్పుడు.. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు సజావుగా సాగేందుకు ఉద్దేశించిన ఎన్నికల సంఘంలో మాత్రం ఎందుకు ఉండకూడదు? అని ప్రశ్నించారు. ప్యానెల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండాలని అనుకోవడం లేదని, అలాగని స్వతంత్ర సభ్యుడు ఎందుకు ఉండకూడదని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రధానమంత్రి ఒక వ్యక్తిని నియమిస్తే.. లోక్సభలో ప్రతిపక్ష నేత మరొకరిని నియమిస్తారు. ఇలా ఏకాభిప్రాయం కుదరనప్పుడు మూడో వ్యక్తిగా ఉన్న క్యాబినెట్ మంత్రి ప్రతిపక్ష నేతకు మద్దతు తెలుపుతారా? అని దీపాంకర్ దత్తా అటార్నీ జనరల్ను ప్రశ్నించారు. ఆచరణలో అన్ని సందర్భాల్లో అలా జరగకపోవచ్చుంటూ అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి సమాధానమిచ్చారు.

ప్రైమ్ మినిస్టర్ నిర్ణయాన్ని క్యాబినెట్ మంత్రి వ్యతిరేకించే అవకాశం లేనందున 2:1 మెజారిటీతో నియామకం జరిగిపోతోందని జస్టిస్ దీపాంకర్ దత్తా అన్నారు. ప్రతిపక్ష నాయకుడి పాత్రని కేవలం 'అలంకారప్రాయం'గా మార్చేశారంటూ వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పనిచేయడమే కాదు, అది స్వతంత్రంగా ఉన్నట్లు ప్రజలకు కనిపించాలి కూడా అని ఈ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది.

# అక్రమ పార్కింగ్ చేస్తే అంతే సంగతులు

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించేలా నిబంధనల కోసం రవాణా శాఖ ప్రతిపాదన చేసింది. వాహనంపై ఇప్పటికే ఉన్న చలాన్లు, రోడ్ ట్యాక్స్, ఫిట్‌నెస్, బీమా, ఇతర జరిమానాలు ఏమైనా ఉంటే అవన్నీ తప్పనిసరిగా చెల్లించేలా రూల్స్‌ను ప్రతిపాదించారు. 30 నుంచి 45 రోజుల్లో మీ వాహనం కావాలని క్లెయిమ్ చేయకపోతే నేరుగా వేలానికి వెళ్లే అవకాశం ఉంటుంది.

**టోయింగ్ ఎప్పుడు చేస్తారంటే :**

ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న, బ్రేక్డౌన్ అయిన వాహనాలను ఫుట్‌పాత్‌లపై, నోపార్కింగ్ జోన్‌లలో నిలిపి ఉంచిన వాహనాలను టోయింగ్ చేయాలని ముసాయిదా పాలసీలో రవాణా శాఖ పేర్కొంది. టోయింగ్‌కు, యార్డుల్లో పార్కింగ్‌కు నగరాలు, గ్రామీణ ప్రాంతాల వారీగా వేర్వేరు ఛార్జీలను వసూలు చేయాలని రవాణా శాఖ ముసాయిదాలో ప్రతిపాదించింది. ప్రస్తుతం స్వాధీనం చేసుకుంటున్న వాహనాల్ని నిలిపేందుకు విస్తీర్ణం సరిపోకపోవడం లేదు. ఈ నేపథ్యంలో ఆ వాహనాలనుపార్కింగ్ చేసేందుకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో మోడ్రన్ పార్కింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని రవాణా శాఖ ప్రతిపాదించింది.

**టోయింగ్ ఛార్జీలు ఇలా :**

రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా పార్క్ చేసే వాహనాల్ని అధికారులు పార్కింగ్ యార్డుకు తరలిస్తారు. వాటిని యాజమానులు తీసుకునేప్పుడు చెల్లించాల్సిన టోయింగ్ ఛార్జీలను భారీ స్థాయిలోనే రవాణా శాఖ ప్రతిపాదించింది. ఈ ఛార్జీలను చూసైనా వాహనదారులు పార్కింగ్ విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తారని అంచనా వేస్తున్నారు. దీని ద్వారా ట్రాఫిక్, ప్రమాదాల నియంత్రణ కొంత వరకు తగ్గే అవకాశం కూడా ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా పార్క్ చేసిన వాహనాల్ని స్వాధీనం చేసుకుని యార్డుకు తరలిస్తారు. తర్వాత వాటిని తీసుకోవాలంటే నగర-పట్టణ, గ్రామీణ ప్రాంతాలను బట్టి రోజుకు పార్కింగ్ ఛార్జీలు విధిస్తారు. ద్విచక్ర వాహనాలకు రూ.20 నుంచి 30, ఆటోలకు రూ.35 నుంచి 50, కార్లకు రూ.60 నుంచి రూ.80, బస్సులకు రూ.200 నుంచి రూ.300 రోజుకు చెల్లించాలని అధికారులు ప్రతిపాదించారు.

# కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు సమన్లు జారీ చేసింది. కారు రేసు కేసులో కేటీఆర్ సహా నిందితులందరూ జూలై 31వ తేదీన విచారణకు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. 2023లో హైదరాబాద్ నగరంలో నిర్వహించిన ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై నమోదైన కేసులో ఇప్పటికే ఏసీబీ అభియోగపత్రం దాఖలు చేసిన విషయం విదితమే. తాజాగా ఆ ఛార్జిషీట్‌ను ఏసీబీ కోర్టు విచారణకు స్వీకరించడం కీలకంగా మారింది. ఈ కేసులో ఏసీబీ ఏ1గా కేటీఆర్, ఏ2గా అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డి, ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫ్ఈఓ సంస్థను చేర్చింది.

**రూ.55 కోట్ల బదిలీపై :**

ఫార్ములా ఈ కార్ రేసు నిర్వహణ కోసం ఎఫ్ఈఓకు నిధులు బదిలీ చేసిన వ్యవహారంపై ఈ కేసు నమోదైంది. హెచ్ఎండీఏ ఖాతా నుంచి సుమారు రూ.55 కోట్లను విదేశీ సంస్థ అయిన ఎఫ్ఈఓ సంస్థకు బదిలీ చేసినట్లు ఏసీబీ గుర్తించింది. ఈ నిధుల బదిలీ ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలతో కేసు నమోదు చేశారు. ప్రభుత్వ అనుమతులు, విధివిధానాలు పాటించకుండా చెల్లింపులు జరిగాయా అనే అంశంపై ఏసీబీ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటికే కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డితో పాటు ఎఫ్ఈఓ సంస్థ ప్రతినిధులను ఏసీబీ అధికారులు ప్రశ్నించి వారి వాంగ్మూలాలు నమోదు చేశారు. వీరితో పాటు పలువురు అధికారుల వాంగ్మూలాలు కూడా నమోదు చేసినట్లు తెలుస్తోంది. దర్యాప్తులో సేకరించిన ఆధారాల ద్వారా అభియోగపత్రం సిద్ధం చేసి కోర్టులో దాఖలు చేసినట్లు సమాచారం.

**కేటీఆర్ కీలకం :**

ఈ కార్ కేసులో దాదాపు దర్యాప్తు పూర్తి చేసిన ఏసీబీ కేటీఆర్‌ను ప్రధాన సూత్రధారిగా పేర్కొంది. గవర్నర్ నుంచి ప్రాసిక్యూషన్ అనుమతులు లభించిన నేపథ్యంలో, కోర్టు ఈ ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకుని విచారణకు వేగవంతం చేసింది. ఫార్ములా-ఈ కారు రేసు కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి, పురపాలక శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ పై రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో అక్రమాలు జరిగినట్లు తేలడంతో, ఆయనను ప్రాసిక్యూట్ చేయడానికి కేంద్ర సిబ్బంది వ్యవహారాలశాఖ అనుమతినిచ్చింది. జులై 31వ తేదీన జరిగే విచారణలో కేటీఆర్, ఇతర అధికారులు కోర్టు ముందు హాజరై తమ వాదనలు వినిపించాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

**రాజకీయాల్లో చర్చ :**

ఫార్ములా ఈ కార్ రేసు కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఈ అంశంపై విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ నేతలు ఈ కేసు రాజకీయ కక్షసాధింపులో భాగమని ఆరోపిస్తుండగా, కాంగ్రెస్ మాత్రం ప్రజాధనం దుర్వినియోగంపై విచారణ జరుగుతోందని చెబుతోంది.మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చమొదలైంది.

# మండువేసవిలో వాన బీభత్సం

### యూపీలో అకాల వర్షం, గాలి దుమారం వల్ల 89 మంది మృతి

**లక్నో, మే 14 :** మండువేసవిలో ఉత్తర ప్రదేశ్ అకాల వర్షాలతో అతలాకుతలమైంది. తీవ్ర గాలి దుమారం, భారీ వర్షం సృష్టించిన పెనుబీభత్సం కారణంగా రాష్ట్రంలో 89 మంది ప్రాణాలు కోల్పోయారు. క్యుములోనింబస్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వడగళ్ల వాన కురిసింది. 'గాలి దుమారం, వడగళ్ల వాన, పిడుగుల కారణంగా మే 13న పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. దీంతో వేర్వేరు వర్ష సంబంధిత ఘటనల్లో 89 మంది మృతి చెందారు. మరో 53 మంది గాయపడ్డారు. 114 జంతువులు మరణించాయి. 87 ఇళ్లు ధ్వంసమయ్యాయి'' అని యూపీ రిలీఫ్ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. ఈ అకాల వర్షాల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణనష్టంపై రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరాతీసినట్లు ఆ సంస్థ తెలిపింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు సీఎం సమీక్షిస్తున్నారని, వర్ష ప్రభావిత జిల్లాల్లో ముమ్మర సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు ఆదేశించినట్లు పేర్కొంది.

ప్రయాగ్ రాజ్, భదోహి, సోన్ భద్ర, ఫతేపుర్ తదితర జిల్లాల్లో బుధవారం గాలివాన బీభత్సం కొనసాగింది. ప్రయాగ్రాజ్లో 21 మంది, భదోహిలో 16, ఫతేపుర్లో 11, సంత్ రవిదాస్ నగర్లో 14, మీర్జాపుర్లో 10 మంది మృతి చెందినట్లు ఆయా జిల్లాల యంత్రాంగం వెల్లడించింది. ఈ జిల్లాల్లో అనేక చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి.

**పెనుగాలి.. పిడుగులు**

సాధారణంగా మే నెలలో ఉత్తర భారతంలోని అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. చాలాచోట్ల సగటు ఉష్ణోగ్రత 40 డిగ్రీల పైనే ఉంటుంది. ఆ సమయంలో భూఉపరితలంపై ఉండే గాలి విపరీతంగా వేడెక్కుతుంది. అది వేగంగా కదులుతూ ఇతర దిశల నుంచి తడిగాలిని లాగేసుకుంటుంది. ఈ రెండు కలిసి ఆకాశంలో చాలా ఎత్తుకు చేరినప్పుడు క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడతాయి. దట్టమైన నల్లటి మబ్బులు ఆకాశమంతా విస్తరిస్తాయి. ఆ తర్వాత తక్కువ సమయంలోనే భారీ వర్షం, వడగళ్లు, పిడుగులు పడుతాయి. ఇప్పుడు యూపీలో ఇలాంటి పరిస్థితే ఏర్పడిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

**40 అడుగుల ఎత్తు ఎగిరిపడ్డాడు..**

బరేలీ జిల్లాలో బలమైన ఈదురు గాలుల కారణంగా ఓ వ్యక్తి దాదాపు 40 అడుగుల ఎత్తున ఎగిరిపడ్డాడు. గాలిదుమారం రావడంతో సదరు వ్యక్తి ఓ షెడ్డును పట్టుకుని నిలబడ్డాడు. అయితే గాలి తీవ్రతకు షెడ్డుతో సహా ఎగిరిపడ్డాడు. ఈ ఘటనలో గాయపడిన అతడికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

# నీట్ రద్దు మోడీ ప్రభుత్వ నిరంకుశ నిర్ణయం

**హైదరాబాద్, మే 14 (మనం బ్యూరో) :** నీట్ యూజీ రద్దు ప్రధాని మోడీ నిరంకుశ నిర్ణయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష రద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ రద్దుపై బుధవారం సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం స్పందిస్తూ గత పదేళ్లలో ప్రధాని మోడీ హయాంలో 93 పేపర్లు లీకయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారనీ, పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. నీట్ రద్దు దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన పెద్దనోట్ల రద్ద వంటిదేనని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ నిరుద్యోగ భవితను ప్రశ్నార్థకం చేసిందన్నారు. సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కల్లలయ్యాయనీ, తల్లిదండ్రులు అప్పులు చేసి తమ పిల్లలను నీట్ ఎగ్జామ్‌కు ప్రిపేర్ చేయించారని వారి ఆశలన్నీ గల్లంతవడం బాధాకరమన్నారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయనీ, ఒక్క గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ కావడం గమనార్హమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా విద్యార్థులు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్ రద్దు నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దనీ, ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

# ఇంధన పొదుపు దిశగా ప్రభుత్వ అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం దూర ప్రాంతాలకు మినహా నగరంలో కేవలం రెండు మూడు వాహనాలతోనే సీఎం కాన్వాయ్ వెళుతున్నది. సీఎం కాన్వాయ్‌లో మాత్రమే కాకుండా మంత్రులు ఇతర వీఐపీల కాన్వాయ్‌లోనూ వాహనాల సంఖ్యను సగానికి సగం కుదించాని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వమే కాకుండా ఇతర రాష్ట్రాల్లో సైతం ముఖ్యమంత్రులు, మంత్రులు తమ కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కాగా, ప్రభుత్వం రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ వాహనాల వినియోగాన్ని తగ్గించడంతో పాటు ఇంధనం పొదుపు దృష్ట్యా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల ఉద్యోగులు సొంత వాహనాలలో కాకుండా ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకునే దిశగా త్వరలోనే కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# మోడీ పొదుపు పిలుపు.. పోలీసు ఆచరింపు

### ఎడ్లబండిపై బారాత్

**నారాయణపూర్, మే 14 :** ఇంధన పొదుపు పాటించాలని ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపునకు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ వస్తోంది. ప్రముఖుల నుంచి సామాన్యుల వరకు ఇంధన ఆదా కోసం తమ వంతు కృషి చేస్తున్నారు. తాజాగా ఛత్తీస్ గఢ్‌కు చెందిన ఓ పోలీసు కానిస్టేబుల్ ఎండ్ల బండ్లపై తన పెళ్లి బారాత్ తీశారు.

నారాయణపూర్ ఎస్పీకి గన్ మెన్ గా విధులు నిర్వర్తిస్తోన్న కుబేర్ దెహారీకి రెండు రోజుల క్రితం పెండ్లయింది. 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న వధువు నివాసానికి కుబేర్ కుటుంబం ఎడ్ల బండ్లపై ఊరేగింపుగా వెళ్లింది. 'ప్రధాని పిలుపుదేశ ప్రయోజనాల కోసం ఇచ్చిన సందేశం. దాన్ని ప్రతి ఒక్కరూ పాటిస్తే ఇంధన ఆదాలో దేశం మరింత బలోపేతమవుతుంది'' అని తెలిపారు. కుబేర్ నిర్ణయాన్ని మెచ్చుకుంటూ రాష్ట్రమంత్రి కేదార్ కశ్యప్ ఎక్స్ లో ఆయన ఫొటోలను షేర్ చేశారు. ''ప్రధాని పిలుపు గ్రామాలకు కూడా చేరింది. ఎడ్లబండిపై కుబేర్ బారాత్ నిర్వహించుకోవడం అనేది కేవలం పర్యావరణ పరిరక్షణలో భాగం మాత్రమే కాదు.. మన సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పడమే'' అని రాశారు.

# కేరళం సీఎంగా వీడీ సతీశన్

**తిరువనంతపురం, మే 14 :** కేరళం ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం పదిరోజుల తరువాత ఫైనలైజ్ చేసింది. ఈ పదవి రేసులో ఉన్న కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితాల నుంచి గట్టి పోటీ ఎదుర్కొన్నా కూడా.. ఫ్రెషర్ అయిన సతీశన్‌కే అవకాశం దక్కడం విశేషం.

గత నెలలో జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయం సాధించింది. మొత్తం 140 స్థానాల్లో పోటీపడిన ఈ కూటమి 102 చోట్ల విజయం సాధించింది. అయితే ముఖ్యమంత్రి పదవికి పోటీ ఎక్కువగా ఉండటంతో సతీశన్ ఎంపికకు అధిష్ఠానం పది రోజుల సమయం తీసుకోవడం గమనార్హం.

**గ్రూపులకు నో చెప్పి..**

కొచ్చికి సమీపంలోని నెట్టూర్లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్ లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. మంచి వక్తగానూ గుర్తింపు వచ్చింది. తర్వాత కాంగ్రెస్ లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, ఎలాంటి గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. పాలనాపరంగా ఎలాంటి అనుభవం లేని సతీశన్ను ప్రతిపక్ష నేతగా నియమిస్తూ తీసుకున్న నిర్ణయంపై అప్పట్లో పలువురు అనుమానం వ్యక్తంచేశారు. కానీ ఎల్డీఎఫ్ను ఎదుర్కొనే నేతగా తనను తాను నిరూపించుకున్నారు. అవినీతి, గోల్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ పరాజయాలతో సతమతమవుతుంటే.. రాష్ట్రంలో మాత్రం హస్తం పార్టీ శ్రేణుల్లో ఆయన ఉత్సాహం నింపారని రాజకీయ విమర్శకులే అంగీకరించిన సందర్భాలున్నాయి.

అందుకే సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో పార్టీ ఎమ్మెల్యేల్లో అత్యధికులు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ నాయకత్వం వైపు మొగ్గు చూపగా, ప్రజల్లో మటుకు సతీశన్ పేరు ఎక్కువగా వినిపించింది. దాంతో ప్రజాభిప్రాయం వైపే మొగ్గు చూపిన అధిష్ఠానం చివరకు ఆయన్నే సీఎం పదవికి ఎంపిక చేసింది.

# అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. బ్రాహ్మణ సామాజిక వర్గం ఆర్థిక అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలనీ, ఇందుకోసం తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. సమాజ సేవను జీవిత ధ్యేయంగా ఎంచుకుని దశాబ్దాలుగా ప్రజలకు అండగా ఉన్న బస్వరాజు శ్రీనివాస్ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్‌గా నియమితులు కావడం జాతి జాగృతికి, అభివృద్ధికి తోడ్పడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బస్వరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తానని స్పష్టం చేశారు. ఈ విషయంలో సంఘాలు కూడా సహకారం అందించాలని కోరారు.

అందరికీ జవాబుదారీగా ఉండి పరిషత్‌కు గుర్తింపు తెస్తూనే బ్రాహ్మణ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా బస్వరాజు శ్రీనివాస్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, వేణుగోపాలా చారి పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారుగా వీహెచ్ బాధ్యతల స్వీకారం

- మంత్రులు, కాంగ్రెస్ సీనియర్ల అభినందన
- బీసీ జన గణన జరిగినప్పుడే బల హీన వర్గాలకు న్యాయం : వీహెచ్

హైదరాబాద్, మే 14(మనం బ్యూరో): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన వి.హను మంతరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. శుక్ర వారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభా కర్, అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు సీనియర్ కాంగ్రెస్ నేత జానారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని వీహెచ్‌ను అభినందించారు. అనంతరం వీహెచ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ బీసీ జన గణన జరిగినప్పుడే బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. సమాజంలో బీసీ వర్గాలు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఇంకా అట్టడుగు స్థానంలోనే ఉన్నాయనీ బీసీ జన గణ నతో వారిని న్యాయం చేయాలన్నారు. ప్రధాని మోడీ స్వయంగా ఓబీసీ వర్గానికి చెందిన వ్యక్తి అయి ఉండి కూడా జన గణన చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశంలో బీసీ గణన చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సూచించారనీ, ఆయన సూచన మేరకు రాష్ట్రంలో జన గణన చేసి వారి లెక్క తేల్చడం జరిగిందన్నారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బీసీ జన గణన చేపట్టని పక్షంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలోకి రాగానే రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తుందని ఈ సందర్భంగా వీహెచ్ స్పష్టం చేశారు.

# భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**ఇరు పక్షాల లాయర్ల మధ్య వాగ్వాదం**
**అసహనం వ్యక్తం చేసిన జడ్జి**
**వేరే బెంచ్‌కు మార్చు కోవచ్చని సూచన**
**నేడు మధ్యంతర బెయిల్‌పై తీర్పు**






హైదరాబాద్,మే 14(మనం,ప్రత్యేక ప్రతినిధి): కేంద్ర మంత్రి కుమారుడు, ఫోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్ పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈక్రమంలో మధ్యంతర బెయిల్‌పై శుక్రవారం తీర్పు వెలువరిస్తామని, ముందస్తు బెయిల్‌పై వచ్చేవారం విచారిస్తామని వెల్లడించింది. అనంతరం విచారణను శుక్రవారం నాటికి వాయిదా వేసింది. తాము కేసు కొట్టివేయాలని కోరడం లేదని, కేవలం ముందస్తు బెయిల్ మాత్రమే ఇవ్వాలని కోరుతున్నట్లు బండి తరపు న్యాయవాది పేర్కొన్నారు. మరోవైపు.. పోక్సో కేసు చాలా తీవ్రమైనదని బెయిల్ ఇవ్వడం సరికాదని పోలీసుల తరపున నాగేశ్వర రావు వాదనలు వినిపించారు. కాగా బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుపై కోర్టులో ఇరుపక్షాల మధ్య వాడీవేడీ వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా బండి భగీరథ్ తరపు న్యాయవాది, బాధితురాలి తరపు న్యాయవాది మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. బండి భగీరథ్‌ను క్రిమినల్ అని బాధితురాలి తరపు న్యాయవాది సంబోధించారు.

దీంతో ఈ వాఖ్యల పట్ల భగీరథ్ తరపు న్యాయవాది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరగడంతో న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నేర నిరూపణ అయ్యే వరకు నేరస్థుడు అనకూడదని, లాయర్లకు సంయమనం లేకపోతే పిటిషన్‌ను మరో బెంచ్‌కు మార్చుకోవచ్చని ఈ సందర్భంగా జడ్జి సూచించారు.

**వాడీ..వేడీగా వాదనలు :**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై హైదరాబాద్‌లోని పేట్ బషీర్‌బాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం భగీరథ్ హైకోర్టును ఆశ్రయించాడు. ఈక్రమంలో గురువారం ఈ పిటిషన్‌పై విచారణ జరగగా.. భగీరథ్ తరుపున ప్రముఖ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. పోక్సో కేసులోనూ పిటిషనర్‌కు కొన్ని హక్కులు ఉంటాయని.. పోక్సో చట్టంలోని సెక్షన్ 11 పరిధిలోకి పిటిషనర్ రారని వాదించారు. బీఎన్ఎస్ సెక్షన్ 74, 75 కింద ఆరోపణలు రుజువు కాలేదని కోర్టుకు వివరించారు. బాధితురాలిగా పేర్కొంటున్న యువతి మైనర్ కాదని.. ఆమె వయసు 19-20 ఏళ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. బాధితురాలి తల్లి తప్పుడు రికార్డులతో వయసు తగ్గించి పోక్సో కేసు పెట్టించారని ఆరోపించారు.

**బర్త్ సర్టిఫికెట్స్ :**

ఈ కేసులో బాధితురాలిగా పేర్కొంటున్న యువతి పలు రకాల తేదీలతో డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్స్ తీసుకుందని భగీరథ్ తరుపున ప్రముఖ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. ముఖ్యంగా ఈ నెల8 న పేట్ బషీరాబాద్ పీఎస్‌లో నమోదైన ఫోక్సో కేసులో భగీరథ్‌పై తప్పుడు ఆరోపణలు చేశారని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. తన క్లయింట్ నుంచి బాలిక ఫ్యామిలీ రూ.5 కోట్లు డిమాండ్ చేశారని పేర్కొన్నారు. బెదిరింపులకు పాల్పడమే కాకుండా, ఆ మొత్తాన్ని చెల్లించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బాధితురాలు బెదిరించారని వాదించారు.

బాధితుల నుంచి వచ్చిన బెదిరింపులకు లొంగకుండా కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రముఖ రాజకీయ వ్యక్తి కుమారుడు కావడంతో ఈ కుట్రకు పాల్పడ్డారన్నారు. ఒకసారి ఎఫ్ఐఆర్ నమోదు చేసాక సెక్షన్లు మార్చడం అనుమానలకు దారి తీస్తుందన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేశాక కావాలనే సెక్షన్లు మార్చారని.. ఇది కుట్రపూరిత చర్యగా భావించాలని వాదించారు. బాధితురాలి స్టేట్మెంట్ రికార్డ్ చేశాక వాస్తవాలు తెలుసుకుని సెక్షన్లు మార్చడం జరిగిందని బాధితురాలి తరుపు లాయర్, పోలీసుల తరపున పీపీ నాగేశ్వర రావు వాదికౌంటర్ ఇచ్చారు.

**హైకోర్టు ఆదేశాలు :**

2021లో డ్రైవింగ్‌లో బాధితురాలు పట్టుబడినప్పుడు పోలీసుల ఛార్జ్‌షీట్‌లో వయస్సు 15 ఏళ్లుగా ఉందని బండ తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. తాజాగా పోక్సో కేసులో బాధితురాలి వయసు విషయంలో స్పష్టత లేదన్నారు. ఒక్కో ధ్రువపత్రంలో ఒక్కో రకమైన జన్మతేదీ ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఛార్జ్‌షీట్, పాన్‌కార్డులో జన్మతేదీలు ఒక్కోలా ఎందుకున్నాయని హైకోర్టు ప్రశ్నించింది. ఈ సందర్భంగా బాధితురాలి బర్త్ సర్టిఫికెట్లను పరిశీలించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. బాధితురాలు పుట్టిన రోజు డేట్స్‌పై, గతంలో రాష్ డ్రైవింగ్ కేసులో అమ్మాయి మేజర్ అని పోలీసులు ఫైల్ చేసిన ఛార్జ్ షీట్ పట్ల పోలీసులు విచారణ జరపాలని హైకోర్టు ఆదేశించింది. వీటి ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. అయితే, ముందస్తు బెయిల్ వచ్చే వరకు అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని భగీరథ్ తరుపు లాయర్ కోరగా.. మధ్యంతర బెయిల్‌పై శుక్రవారం (మే 15) విచారణ చేపడతామని హైకోర్టు స్పష్టం చేసింది.

**తప్పడు ఆరోపణలుః**

ఈ కేసులో పిటిషనర్‌కు అన్ని కేసుల్లా కాకుండా ప్రత్యేకంగా బెయిల్ ఎందుకు అడుగుతున్నారని విచారణ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరపు న్యాయవాది బదులిస్తూ బండి భగీరథ్ ఎలాంటి ప్రత్యేక హోదాలో బెయిల్ పిటిషన్ దాఖలు చేయలేదన్నారు. 15-18 ఏళ్ల బాలిక బాధితురాలుగా ఉంటే బెయిల్ ఇవ్వొచ్చని తీర్పులు ఉన్నాయని వాదనలు వినిపించారు.భగీరథ్‌పై తప్పుడు ఆరోపణలతో కేసులు నమోదు చేశారని పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. బాధితురాలి తల్లి ఫిర్యాదులో 4 సంఘటనలను పేర్కొన్నారని, వాటి కంటే ముందు, తర్వాత కూడా ఫోన్లలో మాట్లాడుకున్నారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. గంటల తరబడి పిటిషనర్, బాధితురాలు ఫోన్లలో మాట్లాడుకున్నారని వివరించారు. మొదట ఎఫ్ఐఆర్లో నిందితుడిపై 7 ఏళ్ల కంటే తక్కువ శిక్ష పడే సెక్షన్లు నమోదు చేశారా? అని హైకోర్టు ప్రశ్నించింది. ఈనెల 8న బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని హైకోర్టుకు పీపీ తెలిపారు.

## కేటీఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషనర్ కీలక భేటీ..

- పెట్టుబడులు..పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక అంశాలపై కీలక చర్చ
- భారత్, ఆస్ట్రేలియా మధ్య దృఢమైన మైత్రిపై ఫోకస్
- ఆస్ట్రేలియా ప్రతినిధులతో భేటీపై కేటీఆర్ హర్షం వ్యక్తం

హైదరాబాద్, మనం ప్రతినిధి : మాజీ మంత్రి కేటీఆర్‌ని భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ కలిశారు. ఈ మేరకు నందినగర్ నివాసంలో జరిగిన ఉన్నత స్థాయి భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీతో సమావేశం అయ్యారు. పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ప్రస్తావించారు. గత సర్కార్ బీఆర్ఎస్ హయంలో పదేళ్లు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న కేటీఆర్‌తో ఆయన అనేక అంశాలపై చర్చించారు.

ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై మాట్లాడారు. తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా తీసుకునే చర్యలపై చర్చించారు. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీపై సంతోషం వ్యక్తం చేశారు కేటీఆర్. ఈ భాగస్వామ్యం ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు, సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

## తెలంగాణ రైజింగ్ పేరిట ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ సర్కార్

- సీఎంకు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ లేఖ

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ వినాశనం.. తెలంగాణ భవిష్యత్తును అప్పుల పాలుజేసింద్రని, రూ. 3 ట్రిలియన్ ఎకానమీ ఉత్త మాటలేనని, 'తెలంగాణ రైజింగ్' గాలి మాటలంటూ... కాంగ్రెస్ సర్కార్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని విమర్శిస్తూ... సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ రాశారు. ఈ ప్రభుత్వం నిత్యం డప్పు కొట్టుకునే 'తెలంగాణ రైజింగ్' రూ. 3 ట్రిలియన్ ఎకానమీ బోగస్ అన్నారు. మీ ఆడంబరపు హామీల అసలు రంగును కాగ్ తన నివేదికతో బయటపెట్టిందని ఆయన దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రజలను ఏ విధంగా వంచిస్తున్నారో, అంకెల గారడీతో ఎలా తప్పుదోవ పట్టిస్తున్నారో? కాగ్ నివేదిక సాక్ష్యాధారాలతో సహా నిలదీస్తోందని గుర్తు చేశారు. ఇది మీరు ముఖ్యమంత్రిగా చేసిన రాజ్యాంగబద్ధమైన ప్రమాణానికి విరుద్ధం అంటూ మండిపడ్డ శ్రవణ్.. మీకు ఓట్లేసిన, మీరిచ్చిన హామీలకు బాగస్వాములైన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయవద్దని ఆయన హితవు పలికారు. ఇక, మీరు ఢిల్లీవోయిన ప్రతిసారి ఫోటోలకు ఫోజులిస్తూ, కేంద్రం చెప్పే రూ. 40 ట్రిలియన్ల లక్ష్యానికి వంత పాడుతూ, 'గుజరాత్ మోడల్'ను పొగడడం మీ ఆర్థిక అజ్ఞానాన్ని చాటుతోందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా ఎలా ఎదిగిందో అర్థం చేసుకునే విజ్ఞత మీకు లేదని అర్థమవుతోందన్నారు. మోడీని ప్రసన్నం చేసుకోవడం కోసమే మీ పొగడ్తలు చూసి జనం సిగ్గుతో తల దించుకుంటున్నారన్నారు. గుజరాత్ మోడల్ కంటే తెలంగాణ అన్ని రంగాల్లోనూ మెరుగ్గా ఉందని తెలిసినా, మీ ఆర్థిక అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే ఈ వేషాలు వేస్తున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఒకప్పుడు చంద్రశేఖర్ రావు నాయకత్వంలో కళకళలాడిన తెలంగాణ ఆర్థిక వ్యవస్థ, నేడు ఆగమైపోతుందన్నారు.

## శ్రీ వైష్ణవులకు శూన్య హస్తం

**తెలంగాణ శ్రీవైష్ణవ సేవా సంఘం,ప్రధాన కార్యదర్శి కందాళ కృష్ణమాచార్యులు**

హైదరాబాద్, మే 14(మనం న్యూస్): బ్రాహ్మణులలో వివిధ వర్గాలున్నాయని, బ్రాహ్మణ పరిషత్తులో శ్రీ వైష్ణవుల పేరు లేకపోవడం ఎంతవరకు సమంజసమో అత్మ పరిశీలన చేసుకోవాలని తెలంగాణ శ్రీవైష్ణవ సేవా సంఘం, ప్రధాన కార్యదర్శి కందాళ కృష్ణమాచార్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటనలో తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రేపో మాపో వివిధ రకాల సదుపాయాలు బ్రాహ్మణ పరషత్తుకు కలిపిస్తుందని,అప్పుడు మాకు ,మా పిల్లలకు తీవ్ర నష్టం కలుగుతుందని,అప్పుడు వర్గ బేధాలు ప్రభుత్వమే సృష్టించినట్లు అవుతుందన్నారు. ఇలాంటి చర్యల వల్ల ప్రభుత్వా నికి చెడ్డపేరు తెచ్చే అవకాశాలు మెండుగా ఉన్నందున అన్ని బ్రాహ్మణ వర్గాలకు న్యాయం చేకూర్చే దిశగా ప్రభుత్వ ఉత్తర్వులను మార్చవలసిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వం నియమించిన బసవరాజు శ్రీనివాస్‌ది శ్రీవైష్ణవ అనే పేరు ప్రభుత్వ ఉత్తర్వులలో లేదుకనుకా ప్రభుత్వ ఉత్తర్వులనకు అనుగుణంగా మరో మెమో నో,జీవో ఏదో ఒకటి ఇస్తూ మా పేరు 'శ్రీ వైష్ణవ సేవా సంఘం, తెలంగాణ-8138/99' ఉత్తర్వులో చేర్చమని, కందాళ కృష్ణమాచార్యులు, ప్రకటణలో పేర్కొన్నారు. అలాగే బ్రాహ్మణ పరిషత్తు ఏర్పాటు చేసినందుకు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## గ్రేహౌండ్స్,అక్టోపస్‌ల ఖ్యాతిని కాపాడుదాం





**ఈ దళాలు రాష్ట్రానికే గర్వకారణం**
**గ్రేహౌండ్స్, అక్టోపస్ పనితీరుపై డీజీపీ సమీక్ష**

హైదరాబాద్, మే 14(మనం,ప్రత్యేక ప్రతినిధి): గ్రేహౌండ్స్, అక్టోపస్ దళాలు తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని, వాటి వృత్తి నైపుణ్యం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రాష్ట్ర పోలీస్ శాఖలో ప్రధానమైన గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌ల కార్యకలాపాలపై గురువారం డీజీపీ సమగ్ర సమీక్ష నిర్వహించారు. తొలుత హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన డిజిపి గ్రేహౌండ్స్ నిర్వహిస్తున్న వివిధ ఆపరేషన్లతో పాటు పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించారు. మావోయిస్టు వ్యతిరేక పోరాటంలో గ్రేహౌండ్స్ ప్రదర్శిస్తున్న తీరును, వారికి అప్పగించిన ఇతర బాధ్యతల నిర్వహణను సంబంధిత అధికారులు డీజీపీకి కి అధికారులు వివరించారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సిబ్బందికి అందిస్తున్న శిక్షణా ప్రమాణాలు, పాఠ్యాంశాలు, మాడ్యూల్స్‌లను నిరంతరం ఆధునీకరించాలని డీజీపీ స్పష్టం చేశారు. కార్యకలాపాల సామర్థ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని, ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా అత్యున్నత స్థాయి పోరాట పటిమను చాటాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి క్రమం తప్పకుండా ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించాలని, కఠినమైన శిక్షణ ద్వారా బలగాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలన్నారు.

**మావోల తగ్గుముఖంతో :**

రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో గ్రేహౌండ్స్ బలాన్ని తగ్గించే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రేహౌండ్స్‌కు సంబంధించి 708 సరెండర్డ్ పోస్టుల ప్రతిపాదన ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని అధికారులకు వివరించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి తగిన ఉత్తర్వులు అందిన తర్వాతే సిబ్బందిని తిరిగి మాతృ విభాగాలకు పంపే ప్రక్రియను చేపడతామని ఆయన స్పష్టం చేశారు. గ్రేహౌండ్స్ సిబ్బంది కనబరుస్తున్న అంకితభావం, వృత్తి నైపుణ్యాన్ని ఈ సందర్భంగా డిజిపి ప్రత్యేకంగా అభినందించారు. దేశంలోనే అత్యుత్తమ మావోయిస్టు వ్యతిరేక దళాల్లో ఒకటిగా గ్రేహౌండ్స్‌కు ఉన్న పేరును కాపాడాలని, క్రమశిక్షణ, ముందస్తు సన్నద్ధతతో తమ ప్రత్యేకతను చాటుకోవాలని సూచించారు. సమావేశంలో డిజి, ఆపరేషన్స్ (గ్రేహౌండ్స్ ఆక్టోపస్) డాక్టర్,అనిల్ కుమార్, గ్రూప్ కమాండర్ రాఘవేందర్ రెడ్డి, గ్రేహౌండ్స్ అధికారులు పాల్గొన్నారు.

**అక్టోపస్ పనితీరుపై :**

రాష్ట్రంలోని కౌంటర్ టెర్రర్ ఫోర్స్ 'అక్టోపస్' పనితీరు, శిక్షణ కార్యకలాపాలు, ఆపరేషనల్ సన్నద్ధతపై డీజీపీ సమీక్షించారు. ఇబ్రహీంపట్నంలోని అక్టోపస్ కమాండో శిక్షణ కేంద్రాన్ని గురువారం సందర్శించిన డిజిపి క్యాంపస్‌లోని శిక్షణ విభాగం, ఆపరేషనల్ సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమాండోలు, అధికారులతో ముఖాముఖి మాట్లాడి, ఏవైనా అవాంఛనీయ ఉగ్రవాద సంఘటనలు ఎదురైతే వాటిని తిప్పికొట్టేందుకు సన్నద్ధత గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ (స్వాట్) బృందాల పనితీరును, శిక్షణ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆపరేషన్స్ (అక్టోపస్ గ్రేహౌండ్స్) డిజి డాక్టర్ అనిల్ కుమార్ ఈ సందర్భంగా డిజిపి కి పలు అంశాలపై వివరణ ఇచ్చారు. ఆపరేషనల్ టీమ్స్ నిర్వహిస్తున్న రెగ్యులర్ కార్యకలాపాలు, ఉగ్రవాద వ్యతిరేక పోరాట విన్యాసాలు, అత్యాధునిక ఆయుధాల వినియోగంలో కమాండోలకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణ గురించి వివరించారు.

**మాక్ ఆపరేషన్స్ :**

కౌంటర్ టెర్రర్ ఫోర్స్ తన కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి వివిధ రకాల భవన సముదాయాలు, వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే రీతిలో మాక్ ఆపరేషన్లు నిర్వహించడం అత్యంత కీలకమని డీజీపీ స్పష్టం చేశారు. కమాండోలు శారీరక దృఢత్వంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని, ఎల్లప్పుడూ నిశితమైన అప్రమత్తతతో ఉంటూ 24 గంటలూ విధులకు సిద్ధంగా ఉండాలని సూచించారు.ప్రస్తుతం ఉన్న విమానాశ్రయాలతో పాటు భవిష్యత్తులో రాబోయే విమానాశ్రయాల భద్రతను దృష్టిలో ఉంచుకుని కార్యకలాపాల వ్యూహాలను పటిష్టం చేయాలని ఆదేశించారు. గ్రేహౌండ్స్, అక్టోపస్ దళాలు తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని, వాటి వృత్తి నైపుణ్యం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన కొనియాడారు. సమీక్షా సమావేశంలో ఎస్పీ (అడ్మిన్) ఎం. వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) సి.హెచ్. రఘునందన్, అక్టోపస్ అధికారులు పాల్గొన్నారు.

## జన గణకులకు జగమంత కష్టాలు

- కీలక దశకు చేరుకున్న గృహ గణన ప్రక్రియ
- ఇంటినెంబర్లు ఉండవు, పంచాయతీ సిబ్బంది సహకరించరు
- జనాభా, గృహాలు, సామాజిక-ఆర్థిక పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరణ



హైదరాబాద్,మే14(మనం న్యూస్)ః దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. జనాభా, గృహాలు, సామాజిక-ఆర్థిక పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంలో గణకులు, పర్యవేక్షకులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పని చేస్తున్న గణకులు ప్రస్తుతం అనేక సమస్యలను ఎదుర్కొంటూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. మొదటి మూడు రోజుల్లో గృహాల మ్యాపింగ్ పూర్తి చేసి, ఇంటి నంబర్లు వేయాలని అధికారులు సూచించినప్పటికీ, అనేక గ్రామాల్లో ఆ ప్రక్రియ పూర్తి కాకపోవడం గణకులను ఆందోళనకు గురి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో గృహాల సంఖ్య ఎక్కువగా ఉండటం, మ్యాపింగ్ ప్రక్రియ క్లిష్టంగా మారడం వల్ల కేవలం మూడు రోజుల్లో పని పూర్తి చేయడం సాధ్యం కావడం లేదని గణకులు చెబుతున్నారు. మూడు రోజులుగా నిరంతరం క్షేత్రస్థాయిలో తిరుగుతున్నప్పటికీ పని పూర్తి కావడం లేదని వారు పేర్కొంటున్నారు. అయినప్పటికీ అధికారులు గృహాల వివరాల నివేదికలను కోరుతుండటంతో మరింత ఒత్తిడి పెరుగుతోందని వాపోతున్నారు. కనీసం మరో ఒకటి లేదా రెండు రోజుల గడువు ఇస్తే పని నాణ్యతగా పూర్తి చేసే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

**సమయం వృథాః**

చాలా గ్రామాల్లో ఇళ్లకు సరైన నంబర్లు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. గణకులు ఇంటి నంబర్లతో పాటు గృహ గణన నంబర్లను కూడా రాయాల్సి వస్తోంది. దీంతో ఒక్కో ఇంటి వద్ద ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోంది. కొందరు ఇంటి యజమానులు ఇంటి నంబర్లు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నిస్తూ సహకరించకపోవడం కూడా సమస్యగా మారింది. ఫలితంగా గణకుల పని భారం మరింత పెరగడంతో పాటు సమయం వృదా అవుతోందని గణకులు విస్తుపోతున్నారు.

**మండుతున్నఎండల బాధలు..**

వేసవికాలం కావడంతో ఉదయం 11 గంటల తర్వాత ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. మండే ఎండల్లో గ్రామాల్లో తిరుగుతూ పని చేయడం గణకులకు శారీరకంగా ఇబ్బందికరంగా మారుతోంది. కొందరు గణకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పల్లెల్లోనే తిరుగుతూ పని చేస్తున్నారు. ఎండ ప్రభావం కారణంగా పనుల వేగం కూడా తగ్గుతోంది. ప్రస్తుతం గూగుల్ మ్యాప్ ఆధారంగా గృహాల మ్యాపింగ్ జరుగుతోంది. అయితే అందరికీ సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన లేకపోవడం సమస్యగా మారింది. ముఖ్యంగా కొందరు గణకులు గూగుల్ మ్యాప్ వినియోగంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిజిటల్ పద్ధతుల్లో అనుభవం తక్కువగా ఉండటంతో పనిలో ఆలస్యం జరుగుతోందని చెబుతున్నారు.

**స్థానిక సిబ్బంది సహకారం లేకః**

గణకులు మరో ముఖ్యమైన సమస్యగా పంచాయతీ సిబ్బంది సహకారం లేకపోవడాన్ని చెబుతున్నారు. గత జనగణనల్లో గ్రామ సేవకులు వెంట ఉండి ఇళ్ల వివరాలు చూపించేవారని, ప్రస్తుతం అలాంటి సహకారం కనిపించడం లేదని అంటున్నారు. దీంతో కొత్త ప్రాంతాల్లో ఇళ్ల గుర్తింపు కూడా కష్టమవుతోందని పేర్కొంటున్నారు. గూగుల్ మ్యాప్ ఆధారంగా ఇళ్లను విభజించడం వల్ల కొందరు గణకులకు తక్కువ ఇళ్లు, మరికొందరికి ఎక్కువ ఇళ్లు కేటాయించబడ్డాయని సమాచారం. తక్కువ ఇళ్లు ఉన్నవారు పని త్వరగా పూర్తి చేస్తుండగా, ఎక్కువ బాధ్యతలు ఉన్నవారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. జనగణన వంటి కీలక కార్యక్రమం విజయవంతం కావాలంటే గణకులకు సరైన సమయం, శిక్షణ, స్థానిక సిబ్బంది సహకారం అందించడం అవసరం. లేకపోతే క్షేత్రస్థాయిలో ఇలాంటి సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉంది.

## కాన్వాయ్‌ను తగ్గించుకున్న గవర్నర్

**సీఎం రేవంత్ సహ.. మంత్రులు, అధికారులు..**
**ప్రధాని సందేశాన్ని అమలుజేయాలి**
**ప్రజలు సైతం ఇంధన పొదుపు పాటించాలె**
**రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కాలేజీలలో ఇంప్లిమెంట్ చేయాలి?: గవర్నర్ శుక్లా**



హైదరాబాద్, మనం ప్రతినిధి : ఒకే ఒక్కడు.. ఆయన ఇచ్చిన ఒక్క పిలుపుతో విఐపి, వివిఐపిలంతా ఎవరికి వారు కొత్త ఆలోచనకు జై అన్నారు. ప్రధాని మోడీ పిలుపుతో సై అన్నరు?.. ముందుగా ప్రధాని నుంచే మొదలైన ఈ మార్పు క్రమక్రమంగా అందరిలో వచ్చింది. తాజాగా తన కాన్వాయ్‌ను కూడా తగ్గించుకోవాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా నిర్ణయం తీసుకున్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ సందేశానికి తాము మద్దతు ఇస్తున్నామని గవర్నర్ ఈ సందర్భంగా వెల్లడించారు.

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన పొదుపు చర్యలు పాటించాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపును ఆచరిస్తున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా.. లోక్ భవన్‌లో ఇప్పటికే సగం వాహనాలను తగ్గించామన్నారు. వాహనాలను తగ్గించడం వల్ల ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, అధికారులు.. ప్రధాని సందేశాన్ని అమలు చేయాలని గవర్నర్ కోరారు. తెలంగాణ ప్రజలు కూడా ప్రధాని విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, కాలేజీలలో ప్రధాని మోడీ సందేశాన్ని లైన్ ఇంప్లిమెంట్ చేయాలని కోరుతున్నట్లు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు.

## వేసవి వేధింపులు!

ఆకాశం
నీళ్లనే కాదు నిప్పులను కురిపిస్తది
పైన ఎవరో మంట పెట్టినట్లు!

అవసరం కొద్దీ పగలు
గడప దాటాలంటేనే
సీతమ్మ అగ్ని ప్రవేశం
యాదికొస్తున్నది!

ఎన్ని నీళ్లు తాగినా
కడుపుబ్బరమే కానీ
ఈ దేహానికి తాపం తీరదు!
కాస్త మనసు కుదుటపడటానికి
ప్రియురాలి కొరకు నిరీక్షించినట్లు
సాయంకాలం కోసం ఎదురుచూపు!

ఇక రాత్రా
నల్లని గొడుగు పట్టినట్లున్నా
అది నివురు గప్పిన నిప్పే!

పానీయాలొక్కటే
ఈ వేసవిని ధిక్కరించే
ప్రాణదాతలు!
వేకువ జామున
కిటికీలోంచి తొంగి చూసే పిల్ల తెమ్మెర
జీవనకాంక్షలకు ఊపిరి పోస్తున్నది!

ఈ రాత్రి కాస్త నేను
అదమరచి నిద్రపోవడానికి
నీళ్లు కొన్ని ఐసు ముక్కల్ని వేడుకుంటున్న!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
94402 33261

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి - ఎడిటర్**

# నేరం చేయకుండానే.. జైలుకెళ్లొచ్చు?



నిజమే కదా.. ఏదో నేరాలు ఘోరాలు చేసినవారు తప్పకుండా జైలు పాల వుతారు. కొన్నాళ్ల తర్వాత సత్ప్రవర్తన కారణంగా ఏ ఆగస్టు 15 నాడో, జనవరి 26 నాడో మధ్యలో టైం బాగుంటే గాంధీ జయంతికో శిక్షాకాలం తగ్గి.. జైలు నుంచి విడుదల అవుతారు. అయితే హైదరాబాద్ చంచల్‌గూడ జైలులో 'ఫీల్ ది జైల్' కార్యక్రమం ప్రారంభించారు. ఫీజు చెల్లించి 12 లేదా 24 గంటలు జైలులో గడిపే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా మీకు లభిస్తుంది. ఖైదీల జీవనశైలి, స్వేచ్ఛ విలువపై అవగాహన కల్పించడమే లక్ష్యం అని ప్రభుత్వం చెబుతోంది. జైలు పరిణామ క్రమాన్ని తెలిపేలా కొత్తగా జైల్ మ్యూజియం ఏర్పాటు చేశారు పోలీసులు. ఈ కార్యక్రమాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. ఫీల్ ది జైల్ కార్యక్రమం ద్వారా ఖైదీల జీవనశైలి, వారు ఎదుర్కొనే పరిస్థితులు, స్వేచ్ఛ విలువ గురించి ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశం అంటున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 24 గంటల పాటు జైలులో గడపాలనుకునే వారు రూ. 2,000 చెల్లించాల్సి ఉంటుంది. 12 గంటల అనుభవం కోసం రూ. 1,000 ఫీజుగా నిర్ణయించారు. ఇందులో పాల్గొన్న వారికి ప్రత్యేకంగా రూపొందించిన జైలు గదులలో బస కల్పిస్తారు. ఖైదీలకు ఇచ్చే భోజనం అందించి, జైలు నిబంధనలు, ఖైదీల దినచర్యను పాటింపజేస్తారు.అంటే మీరు ఒక రోజు ఖైదీ అవుతారన్నమాట. చంచల్గూడలోని స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ ప్రాంగణంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. దీంతో పాటే కొత్తగా ఏర్పాటు చేసిన జైల్ మ్యూజియంను కూడా ఆయన ప్రారంభించడం విశేషం. ఈ మ్యూజియంలో నిజాం కాలం నాటి జైళ్ల నుంచి ఆధునిక సంస్కరణ కేంద్రాల వరకు జరిగిన మార్పులను ప్రదర్శనకు ఉంచారు. పాతకాలపు సంకెళ్లు, జైలు గదులతో పాటు భక్త రామదాసు, దాశరథి కృష్ణమాచార్యులు వంటి ప్రముఖులు జైలు జీవితం గడిపిన వివరాలను పొందుపరిచారు. అంతేగాక నాగార్జున సాగర్ డ్యామ్ నిర్మాణంలో ఖైదీల పాత్ర వంటి ఆసక్తికరమైన అంశాలను ఈ మ్యూజియంలో చూడవచ్చు.

జైళ్లను కేవలం శిక్షా కేంద్రాలుగా కాకుండా, సంస్కరణ, పరివర్తన కేంద్రాలుగా చూడాలి. నేరస్థులకు శిక్షతో పాటు పునరావాసం, రెండో అవకాశం కల్పించడంపై ఒక ప్రగతిశీల సమాజం దృష్టి సారించాలి అంటూ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ ఫీల్ ది జైల్ ప్రారంభం సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం రాష్ట్ర సంస్కరణ చర్యలలో ఒక కొత్త అధ్యాయమని, దీనివల్ల జైళ్ల పరిపాలన, ఖైదీల పునరావాసంపై ప్రజలకు మెరుగైన అవగాహన కలుగుతుందని జైళ్ల శాఖ డీజీపీ సౌమ్య మిశ్రా అంటున్నారు. గతంలో సంగారెడ్డి హెరిటేజ్ జైలు మ్యూజియంలో ప్రారంభించారు. ఒక రోజు జైలు అనుభవం' కార్యక్రమం నుంచి స్ఫూర్తి పొంది, మరింత వ్యవస్థీకృతంగా చంచల్గూడలో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు అంటున్నారు. ఈ కార్యక్రమం ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా, డబ్బులు చెల్లించి ఖైదీగా ఒక్కరోజు గడపాలన్న ఆలోచనపై నెటిజన్లు ఆసక్తిగా స్పందిస్తున్నారు.సంగారెడ్డి జైలు నిజాం కాలం నాడు నిర్మించారు. దీనికి 220 ఏళ్ళ చరిత్ర ఉంది. ఇక్కడ ఒకరోజు జైలులో గడపాలంటే 500 వసూలు చేస్తారు. ఇంతకీ ఈ జైలులో ఎలా ఉంటుందని చాలామందికి అనుమానం ఉంటుంది. జైలులోకి వెళ్లే ముందే మీ మొబైల్ ఫోన్లు, వ్యక్తిగత వస్తువులను లాకర్లో భద్రపరుస్తారు. మీకు ఖైదీల యూనిఫాం, ఒక స్టీల్ ప్లేట్, గ్లాసు మరియు ఒక దుప్పటి ఇస్తారు.ప్రత్యేకంగా కేటాయించిన అసలైన జైలు గదులలోరాత్రి పడుకోవాలి. ఖైదీలకు రోజువారీ మెనూ ప్రకారం అందించే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం మరియు రాత్రి భోజనాన్ని మాత్రమే తినాలి. జైలు నిబంధనల ప్రకారం ఉదయాన్నే నిద్రలేవడం, తోటపని లేదా జైలును శుభ్రం చేయడం వంటి పనులు చేయాలి. మనకు కేటాయించిన టైం కంటే ఎక్కువ సేపు జైలులో ఉండడానికి వీల్లేదు. ఒకవేళ జైలు నియమాలను తట్టుకోలేక నిర్ణీత సమయం కంటే ముందే బయటకు వచ్చేయాలనుకుంటే జరిమానా చెల్లించాలి. మీకు కూడా జైలులో ఒక రోజు ఉండాలని అనిపిస్తే...ఈ వినూత్న అనుభవాన్ని పొందడానికి ఎలాంటి ఆన్లైన్ వెబ్సైట్ లేదు. చంచల్గూడ లేదా సంగారెడ్డి జైలు అధికారులను ఒక రోజు ముందుగా నేరుగా సంప్రదించవచ్చు. అవసరమైన గుర్తింపు కార్డులు సమర్పించి ఈ ప్రోగ్రామ్కు నమోదు చేసుకోవచ్చు. ఈ తరహా ఫీల్ ది జైల్ కార్యక్రమాలు దేశంలో ఎక్కడా అమలులో లేవు. సెల్యులార్ జైల్ గా పిలవబడే అండమాన్ నికోబార్ దీవుల్లోని జైలుని 'కాలా పానీ' అని పిలుస్తారు. స్వాతంత్ర్య సమరయోధులను బంధించిన ఈ చారిత్రాత్మక జైలును మ్యూజియంగా మార్చారు. ఇక్కడ 'లైట్ అండ్ సౌండ్ షో' నిర్వహిస్తారు, కానీ పర్యాటకులు ఇక్కడ బస చేయడానికి అనుమతి ఉండదు.ఇక దేశంలో పెద్ద పెద్ద నిందితులను, నేరస్థులను ఉంచే తీహార్ జైలు భారతదేశంలోనే అతిపెద్ద జైలు కాంప్లెక్స్. ఇక్కడ ఖైదీలు తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేయడానికి మరియు వారి వృత్తి విద్యా పనులను చూడటానికి పర్యాటకులను అనుమతిస్తారు. గతంలో ఇక్కడ కూడా 'ఫీల్ ది జైల్' లాంటి ప్రాజెక్ట్ ప్రారంభించాలని ప్రతిపాదించారు. కానీ అమలుకి నోచుకోలేదు. కోల్ కతా లోని అలిపూర్ జైల్ మ్యూజియం కూడా ఉంది. ఇక్కడ బ్రిటీష్ కాలం నాటి ఈ జైలును ఇటీవల ఒక అద్భుతమైన మ్యూజియం మరియు పర్యాటక కేంద్రంగా మార్చారు.అయితే ఫీల్ ది జైల్ లాంటి కార్యక్రమం లేదు. గోవాలో అగ్వాడా జైల్ ఒకటుంది. సముద్ర తీరాన ఉండే ఈ పాత పోర్చుగీస్ జైలును కూడా ఒక చారిత్రక సందర్శన స్థలంగా మార్చారు.కర్నాటకలోని బెంగళూరు సెంట్రల్ జైల్ మ్యూజియం గురించి కూడా మనం తెలుసుకోవాలి. పాత జైలును ఫ్రీడమ్ పార్కు మరియు మ్యూజియంగా మార్చి ప్రజల సందర్శనార్థం ఉంచారు. అయితే ఒకరోజంతా బస చేసే సదుపాయం అయితే లేదు.




**'ఫీల్ ది జైల్' కార్యక్రమం ... ఖైదీల జీవనశైలి, వారు ఎదుర్కొనే పరిస్థితులు, స్వేచ్ఛ విలువ గురించి ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశం అంటున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 24 గంటల పాటు జైలులో గడపాలనుకునే వారు రూ. 2,000 చెల్లించాల్సి ఉంటుంది. 12 గంటల అనుభవం కోసం రూ. 1,000 ఫీజుగా నిర్ణయించారు. ఇందులో పాల్గొన్న వారికి ప్రత్యేకంగా రూపొందించిన జైలు గదులలో బస కల్పిస్తారు. ఖైదీలకు ఇచ్చే భోజనం అందించి, జైలు నిబంధనలు, ఖైదీల దినచర్యను పాటింపజేస్తారు. అంటే మీరు ఒక రోజు ఖైదీ అవుతారన్నమాట.**

**- జి. సత్యనారాయణరాజు**
9030880709

# 'సన్ను స్ట్రోకు'





మొన్నా మాయింటి కాడున్న మూడు పానాదులు కల్సే మూడు బజార్ల కాడ సింత సెట్టు కింద నల్గురైదుగురు కూకుండి ముచ్చట వెడు తాండ్లు. మాఊల్లె పండుగచ్చిందంటే సాలు యేశాలు గట్టి యేదోఒక ఆటాడుడే. గదాంట్ల పండుగల ప్పుడు యేసె బాల్నాగమ్మ, అర్సెంద్ర, దరుపతి వస్త్రాపహారంల మీనవడి,సివరాకరికి సిర్తల రావన్దెము కాడి కచ్చింది. గండ్ల జరంత కంఠం మంచిగున్నోడు మేటేశగాడు, యెర్రగా బుర్రగా,బుత్తాంత కుర్సగా ఉంటె ఆడేశం గట్టేటోల్లు. ఇగ గాముచ్చట్ల నడిమిట్లగా ఈరన్న దసరథుని పాటందుకున్నడు. కొంరయ్య మామ రాములోరి రాకడ పాటేసుకునే. ఎంటనే ఈర సామ్మామ సీతమ్మ కట్టాల మీన ఇరాం లేకుంట నరుకుతండు. ఈరసామ్మామను పంతులని సుత పిలుత్తరు. యే ఇగగా కతలాపి పాపంగా దస్రత్ మారాజు రాములోర్నిసూడకుండ కలువరిచ్చి కలువరిచ్చి సచ్చిండు గదా! గట్లెందుకైంది?అని రాజయ్య సిన్నాయిన సన్నగా గునిగిండు. గా సంగతి సెప్పరాదన్నట్లు. గది మనందరి కెరికే నాయే. గావురాల పెండ్లం మాటిని, పావురాల కొడుకును అడవులకు బొమ్మన్నడు. రాములోరు గట్లబోయిండో లేదో కొడుకును దల్సుకుంట మనాదితోని మర్నమైండు. ఇగ గదాన్కి యేరే కతుందిలే! అన్నడు ఈరసామ్మామ. ఇంకా గిసొంటి కతలు గిప్పుడు సుత జరుగుతున్నయ్ కాపోతే మర్నాలు కాకుండ అల్లజీవి కంటె ఎక్కు వైన అల్ల పజీత,పరపతిని ఊడగొట్టే కొడుకుల తోని నల్లమొకమై,తల్కాయ నాలకేసుకోని,మనసు కలికలై ఇండ్లల్లకెల్లి బయటికెల్తలేరన్నడు.

గిదేదో మస్త్ మజాగుండేట్టుగ ఉంది. పానం లేసచ్చినట్టుంది అనుకుంట రాజయ్య సిన్నాయిన రుమాల్లకెల్లి మోదుగాకుల సుట్టదీసి,బొడ్లెకెల్లి జెకుముకి రాయి,దూది దీసి నాలుగైదుమాట్ల గొట్టి సుట్ట యెలిగించి, గప్పుగప్పు రైల్ పొగ ఊదుకుంట గీ రోజుల్ల పజీత పట్టింపు లెవనికున్నయ్ జరంత జెప్పరాదా! అనగానే ఈరసామ్మామ యెన్నని జెప్పాలే 'ఇంటింటికి మంటిపొయ్యన్నట్టు' దేస మంతట గట్లనే ఉన్నది. ఇగ ఇనుమునుపు గప్పుడెప్పుడో మన పతాని ఇందిరా గాంధీ సిన్న కొడుకు సిన్న కతల్జేసిండా? గదాన్తోని జనాలు గామె పతాని గద్దెనుంచి నూకేసిండ్లు. మరాట మాజీ ముకమంతిరి సివాజిరావ్ నీలంగేకర్ పాటిల్ గయిన బిడ్డకు గామె సోపతిగాల్లకు పేద్ద డాక్టరు (ఎమ్డీ) పరీచ్చలో దగా జేసిండ్లని ముకమంతిరి సీట్లుకెల్లి దొబ్బేసిల్లు. యెడ్డియూరప్ప కొడుకు నియ్యతిదప్పి పైసల్ సంపాయించిండని అయ్యను ఊడబీకిండ్లు. హెచ్.డి.రేవణ్ణ జేయ వట్కే అల్ల అయ్య కుమారసామిని దొబ్బేసిండ్లు. మన తాన గవర్నర్గిరి యెల్గవెట్టిన ఉత్తరపర్దేస్, ఉత్తరాఖండ్ ముకమంతిరి యెన్డి తివారికి సుత సన్నుస్ట్రోకే. గంతెందుకు కొడుకు రెహల్ మూల కంగా సెకీల్ అమ్మదు ఎమ్మెల్యే గిరితోటి పజీత గుడుక పోయింది. అని కూసింత దువ్ముు దీసుకునె. గప్పటియెప్పటియో యెన్కటియన్ని జెప్తన్నవు గాని మల్ల అస్సలు ముచ్చట జెప్తలేవు అని రాజయ్య సిన్నాయిన అననే అన్నడు. గ 'సన్నుస్ట్రోకు'పాతోల్లకేనాల లేకపోతే.... అనగానే నాకు మా సమఝైందిలే. నిత్తెం రాములోర్ని దల్సు కునే రామ్ బత్తుడు, దర్మసతురుడు, సా'మో'డీల ఈర బత్తుడు సెంటరు మంతిరి మీదనేగద నీ గురి. గాయినకు సుత'సన్నుస్ట్రోకు' తగిలేతట్టుంది. పోర గాండ్లను యేడజదివిత్తేముంది! దిమాక్ల పురుగు లు మెసుతాంటే ఇకారం పనులే జేత్తరు. బేకార్స నుల్జేత్తే అయ్యవ్వల పజీతవోతదనే సోయుండాలే గదా! గడెత్తుకొడుకైండు. ఇంకెప్పుడు తెల్విఁకత్తలు. పైసలక్కొదువలేదు. గమండి తక్వలేదు. ఇగ రాజ కీయముండనేఉన్నది. సిటికేత్తే అనుకున్నయన్ని అత్తన్నయి. ఆడింది ఆట,పాడింది పాట.

లగ్గంగాని ల్యాత పోర్నివట్టుకొని జాత్రలు దిరుగుడేంది? పోట్వలు దిగుడేంది? గాఈడియో లేంది? ఆ పొల్ల అయ్యవ్వల్ సుత పురాగ బరి దెగించినట్లున్నరు. లేపోతె నడింట్ల కండ్లముంగట లగ్గంగాని పోరగండ్లు అండ్ల ఆడమొగ పొలగాల్లు యికయికలు, పకపకలు, యింట్లనే మందు గొట్టుడూ, అద్దూ అదుపూ లేకుండ తిరుగుతంటే మనమైతే ఊకుంటవూనే. కాల్జేతులిరగ్గొట్టి మూలగ్గూసోవెట్టం. గసొంటి మొగపోరన్ని మనిం టికి రానిత్తమా?'గొర్రె బలిత్తె గొల్లాయినకే లాభం' అనుకున్నరేమో! నడిసినన్ని రోజుల్ల డిసింది, మజా జేసినన్నిదినాల్ మజా చేసింద్రు.యాన్నో బెడిసికొట్టింది.బస్, పొల్ల ఈడు తక్కువని యాది కచ్చింది. 'పోక్సో'మంటకు నెగల్లు దోసిండ్లు. బిడ్డను ఖరాబ్జేసిండని మతిల కచ్చింది. రాజ కీయాల మద్దతచ్చింది.'కోతికి కొబ్బరి సిప్ప దొర్కినట్లైంది' లెక్కలేనన్ని టి.వీలు, సానల్లు న్నయ్. ఆల్లకు ఇరాం లేకుంట పన్డొరికింది.

'పోక్సో'లో ఉన్న ఆడపొల్లకు ఓ ఇల్లుంటది, అవ్వయ్యలుంటలు, అల్లకు పజీతుంటది, అల్ల ఇవరాలు బయటపెట్టద్దనే సోయి యెవ్వర్కి లేకపాయే 'అన్ని నల్ల గురిజలే,కాని యెవ్వలు అల్లు నల్లగున్నట్లు సుతరాము ఒప్పుకోరు'.

యేలేటోల్లు తెలివైనోల్లు. నిత్తెము ఓ నికార్స యిన మాటంటలు. సట్టం తనపని తన్జేసు కుంటది. ఇగ పాల్టీల లొల్లిజూత్తే రామసెంద్ర ! అల్ల నోల్లకే మొక్కాలే. నోట్లె మైకులువెట్టుకున్నట్లే! దడ్డంతా కూరగాయలోల్లే మరి మొంటెల సాపలెట్ల మాయమైనయ్.అందరు పత్తిత్తులే అల్ల జమానల గిసొంటియ్ యేమైనయో జనాలకి తెల్వదా? అనుకుంట ఇగ సెప్పచ్చేదేందంటే అండ్ల యెవ్వలు సొక్కం పూసలు గాదు. పైసల్ గుంజ టాన్కి యేశాలని పొల్లగాడు, నవంబరు కాన్నుంచి పొల్లను కరాబు జేత్తండని పొల్ల అవ్వయ్యలు. నవంబరు నుంచి కోరాడు జేత్తంటే గిన్ని దినాలెందుకాగిండ్లో అల్లు నమ్మే దేవుల్లే చెప్పాలే. పొలగాండ్లను పెంచే తరీక గిదిగాదని అందరు అనుకుంటండ్లు. రొండు అవద్దాలైతే గాదు. ఇగ పోలీసోల్ల సిట్టు జల్దిన సెట్టుజేత్తదో. లేక తెలంగాణ మీన ప్రణబ్ దా కమిటీ లెక్క నా! కాక తెలంగాణ నౌకరోల్ల పిఆర్సీకమటీ లెక్క యేండ కేండ్లు సా...గు...త...దా!! సూడాలే. అంబటా ల్లైంది అనుకుంట ఈరసామ్మామ పిరో పిరనుంట పోయిండు. నేన్సుతవోతన్న .........సెనార్థులు

**- మీస రాజమల్లయ్య**
9491319904

# అపర భగీరథుడు ఆర్థర్ కాటన్

'నిత్య గోదావరీ స్నాన పుణ్యదోయోమహమతిః, స్మరామ్యాంగ్లేయ దేశీయం కాటనుం తం భగీరథం' ఆంధ్ర ప్రదేశ్ లోని ఉభయ గోదావరి నదీ తీర వాసులు గోదావరీ స్నానాల సమయంలో సంకల్పం చేసేప్పుడు పఠించే సాంప్రదాయం ఆచరిస్తారు. అపర భగీరథుడైన ఆంగ్లేయ ఇంజినీర్ సర్ ఆర్థర్ కాటన్ కారణంగా తాము నిత్యం ఉదయాన్నే గోదావరి స్నానమా చరించే భాగ్యం కలిగిందన్నది దాని సారాంశం.

తమ జీవితాల్లో సమూల మార్పులకు మూలం ఆర్థర్ కాటన్ ఆలోచనే అని గోదావరి తీర వాసులు నేటికీ విశ్వసిస్తారు. ఆయనను నిత్యం తమ పూజా మందిరంలో కొలిచేవాళ్లు, తమ ఇంటి వద్ద, సమీపాలలో కాటన్ మహాశయుని విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఆరాధించేవాళ్లు చాలామంది కనిపిస్తారు. కాటన్ దొర అని గోదావరి ప్రజలు అభిమానంగా పిలుచుకొనే జనరల్ సర్ ఆర్థర్ కాటన్ బ్రిటిషు సైనికాధికారి, నీటిపారుదల ఇంజనీరు. కాటన్ 15 ఏళ్ల వయసులో ఈస్ట్ ఇండియా కంపెనీ ఇంజనీరింగు సర్వీసుల్లో చేరి శిక్షణ పొందారు. 1819లో రాయల్ ఇంజనీర్స్ దళంలో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమితుడైన ఆయన విధి నిర్వహణలో భాగంగా 18 ఏళ్ల వయసులో భారత దేశానికి వచ్చి మొదటిసారిగా మద్రాస్‌లో ఉద్యోగిగా పనిచేశారు. అక్కడి నుంచి ఈస్ట్ ఇండియా కంపెనీ తరుపున దక్షిణ భారత చెరువుల శాఖకు ఇంజనీర్‌గా నియమితులయ్యారు. ఆ సమయంలో 1828-29 మధ్య కాలంలో కావేరీ నది వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేశారు. కరువు పీడిత ప్రాంతం గోదావరి డెల్టాగా రూపాంతరం చెందడంలో ధవళేశ్వరం వద్ద నిర్మించిన ఆనకట్ట ప్రధాన పాత్ర పోషించింది. అప్పటి జిల్లా అధికారిగా ఉన్న సర్ హెన్రి మౌంట్ పంపించిన నివేదిక ఆధారంగా ఆనకట్ట నిర్మాణం ఆలోచన తెరమీదకు వచ్చింది. 1840లోనే కృష్ణా నదిపై ఆనకట్ట నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఆయన రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను అప్పటి మద్రాసు గవర్నరు మార్కస్ ట్వేల్ డేల్ ఆమోదించారు. 1846 ధవళేశ్వరం వద్ద గోదావరిపై ఆనకట్టను కాటన్ ఆధ్వర్యంలో నిర్మించేందుకు లండన్ నుంచి అనుమతి లభించింది.

1847 ఏప్రిల్ నెలలో ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ధవళేశ్వరం వద్ద గోదావరి సుమారుగా 6 కి.మీ. వెడల్పు ఉంటుంది. 1847 ఆగస్టు మూడో వారంలో రైల్వే వ్యాగన్ల ద్వారా ఉక్కు, రాయిని ధవళేశ్వరానికి తరలించారు. దాంతో నిర్మాణపు పనులు ముమ్మర మయ్యాయి. కాటన్‌కు కూలీలతో పాటుగా ఇంజనీర్లయిన భారతీయులు కూడా కొందరు తోడుగా ఉన్నారు. వారిలో తొలి నాటి ఇంజనీర్లలో ఒకరైన రాజ్ బహదూర్ వీణం వీరన్న కూడా ఉన్నారు. కాటన్ పర్యవేక్షణలో ఈ ఆనకట్టను వేగంగా పూర్తి చేశారు. ఐదేళ్ల లోనే నిర్మాణం జరగడంతో 1852 నాటికి అందుబాటు లోకి వచ్చింది.

ధవళేశ్వరం వద్ద ప్రస్తుతమున్న సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి పూర్వ రూపంగా ఆనకట్ట ఉండేది. అనేక వరదల తాకిడికి ఆనకట్ట దెబ్బ తినడంతో చివరకు 1970వ దశకంలో కొత్తగా బ్యారేజ్ నిర్మాణం చేశారు.

20వ శతాబ్దం తొలినాళ్లలోనే ఆయా ప్రాంతాల్లో వెనువెంటనే ఆరు లక్షల ఎకరాల భూమి సాగు కిందికి రావడం తో పాటు, పారిశ్రామి కాభివృద్ధి, విస్తారంగా పంటలు, రవాణా సదుపాయాలు ధవళేశ్వరం ఆనకట్ట ద్వారా గోదావరి జల ప్రవాహం ద్వారా లభించాయి. ఆయన బెంగాల్, ఒడిసా, బీహారు, మొదలైన ప్రాంతాల నదులను మానవ ఉపయోగం చేయడానికి ఎన్నో పరిశోధనలు, పరిశీలనలు చేశాడు. తెలుగు వారే కాదు తమిళులు, ఒరియాలు, బెంగాలీలు, ఒరియాలు, బీహారీలు మొత్తం భారతీయులే ఆయనకు ఎంతో రుణ పడి ఉంటారు. తమ పాలిట దుఃఖదాయినిగా ఉన్న గోదావరిని, ప్రాణదాతగా మార్చిన ఆర్థర్ కాటన్... అపర భగీరథునికి, ప్రాతః స్మర స్మరణ చేయడం తప్ప ఏమిచ్చుకో గలరు.

**మే 15న సర్ ఆర్థర్ కాటన్ జయంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494



# ద్రవిడ కోటలో సరికొత్త 'దళపతి'

తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక నూతన శకం ఆరంభ మైంది. దశాబ్దాలుగా ద్రవిడ రాజకీయాలను శాసిస్తున్న డీఎంకే, అన్నా డీఎంకే ద్వంద్వాధిపత్యానికి తెరదించుతూ, వెండితెర వేల్పుగా కోట్లాది మంది అభిమానాన్ని సొంతం చేసు కున్న 'దళపతి' విజయ్ ఇప్పుడు రాజకీయ యవనికపై 'తమిళగ వెట్రి కళగం' సారథిగా అధికార పీఠాన్ని అధిరో హించారు. తాజాగా అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో 144 మంది ఎమ్మెల్యేల మద్దతుతో తన బలాన్ని నిరూపించు కోవ డమే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మలు పును ఆవిష్కరించారు. ఎం.జి. రామచంద్రన్, జయలలిత వంటి దిగ్గజాల వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ, సినిమా గ్లామర్‌ను పొలిటికల్ పవర్‌గా మార్చుకున్న నేతల జాబితాలో విజయ్ పేరు ఇప్పుడు సమున్నతంగా నిలుస్తోంది.

తమిళనాడు శాసనసభలో జరిగిన ఈ బలపరీక్ష కేవలం అంకెల గారడీ మాత్రమే కాదు, అది ప్రజాతీర్పుకు లభించిన రాజ్యాంగబద్ధమైన ఆమోదముద్ర. 234 స్థానాలున్న అసెంబ్లీ లో మేజిక్ ఫిగర్ 118 కాగా, విజయ్ కూటమికి ఏకంగా 144 మంది సభ్యుల మద్దతు లభించడం విశేషం. ఈ విజయం వెనుక భారీ రాజకీయ కసరత్తు దాగి ఉంది. ముఖ్యంగా అన్నా డీఎంకేలో తలెత్తిన అంతర్గత సంక్షోభం, ఆ పార్టీకి చెందిన 24 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు జెండా ఎగురవేయడం విజయ్‌కు కలిసొచ్చిన అంశం. విజయ్ రాజకీయ ప్రస్థానాన్ని గమనిస్తే, ఆయన అనుసరించిన వ్యూహాలు అత్యంత శాస్త్రీయంగా ఉన్నాయని చెప్పక తప్పదు. సినీ నటుడిగా శిఖరాగ్రాన ఉన్నప్పుడే రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించు కున్న ఆయన, 'తమిళగ వెట్రి కళగం'ను కేవలం ఒక ఫ్యాన్ క్లబ్‌గా కాకుండా, ఒక పక్కా కేడర్ బేస్డ్ పార్టీగా నిర్మించారు. ఎన్నికల ప్రచారంలో ఆయన వాడిన అస్త్రాలు-అవినీతి రహిత పాలన, మహిళల రక్షణ, సామాజిక న్యాయం, పారదర్శకత-యువతను, మధ్యతరగతి ఓటర్లను భారీగా ఆకర్షించాయి. ముఖ్యంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, ఉచిత నాణ్యమైన వైద్యం, నిరుద్యోగ నిర్మూలన వంటి అంశాలపై ఆయన ఇచ్చిన స్పష్టమైన హామీలు ఓటర్లలో బలమైన నమ్మకాన్ని కలిగిం చాయి. అధికారంలోకి రావడం ఒక ఎత్తు అయితే, సంక్లిష్టమైన తమిళనాడు వంటి రాష్ట్రాన్ని పాలించడం మరో ఎత్తు. విజయ్ ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాలు పరిపాలనా అనుభవం. రాష్ట్రంలో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ, క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలను చేరవేయడం ఆయనకు అగ్నిపరీక్ష వంటిదే. గతంలో ఎంజీఆర్, జయలలిత వంటి వారు కూడా సినీ నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ, వారు పార్టీలో ఏళ్ల తరబడి పనిచేసి పాలనా మెలకువలు నేర్చు కున్నారు. ఆర్థిక సవాళ్లు విజయ్ ప్రభుత్వాన్ని వెన్నాడే మరో కీలక అంశం. ప్రస్తుతం తమిళనాడు అప్పుల భారం సుమారు 7.5 లక్షల కోట్ల రూపాయలకు పైగా ఉంది. ఒకవైపు అప్పుల భారం, మరోవైపు భారీ సంక్షేమ హామీలు-ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం కత్తిమీద సాము వంటిదే. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్థిక భరోసా, యువతకు ఉపాధి భృతి వంటి పథకాల అమలుకు భారీగా నిధులు అవసరం. వీటి కోసం కొత్త పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, పారిశ్రామిక రంగాన్ని పరుగులు తీయించాల్సి ఉంటుంది. పొరుగున ఉన్న కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలతో పెట్టుబడుల విషయంలో పోటీ పడుతూ, తమిళనాడును 'బిలియన్ డాలర్ ఎకానమీ' వైపు నడిపించడం విజయ్ విజన్-2030లో అత్యంత ముఖ్యం.

రాజకీయ స్థిరత్వం అనేది కూటమి ప్రభుత్వాల్లో ఎప్పుడూ ఒక ప్రశ్నార్థకమే. ప్రస్తుతం విజయ్‌కు మద్దతు ఇస్తున్న కాంగ్రెస్, వామపక్షాలు మరియు వి.సి.కె వంటి పార్టీల సిద్ధాం తాలు వేర్వేరు. దళిత ఓటు బ్యాంకును శాసించే తిరుమావళవన్ (విసికె)ఆకాంక్షలు, మైనారిటీల అవసరాలు, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అనుసరించే విధానాలు-వీటన్నింటినీ ఏకతాటిపైకి తీసుకురావడం సాధారణ విషయం కాదు. ఒకవేళ ఎక్కడైనా పొరపచ్చాలు వస్తే, ప్రధాన ప్రతిపక్షాలైన డీఎంకే, అన్నాడీఎంకే ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి.

సామాజిక న్యాయం విషయంలో తమిళనాడు రాజకీ యాలు ఎప్పుడూ సున్నితంగా ఉంటాయి. పెరియార్, అన్నా దురై వంటి మహనీయులు నిర్మించిన సామాజిక పునాదులపైనే నేటి రాజకీయాలు ఆధారపడి ఉన్నాయి. రిజర్వేషన్లు, కుల గణన, భాషా పరిరక్షణ వంటి అంశాలపై విజయ్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ఆయన భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ముఖ్యంగా హిందీ వ్యతిరేక ఉద్యమాలు, నీట్ పరీక్ష రద్దు వంటి భావోద్వేగ అంశాల్లో తమిళనాడు ప్రజల మనోభావాలను విజయ్ ఎలా గౌరవిస్తారనేది ఆసక్తికరం. యువత ఓట్లు విజయ్ విజయానికి ప్రధాన చోదక శక్తిగా నిలిచాయి. నేటి తరం యువ తకు కేవలం ఉచిత పథకాలు మాత్రమే కాదు, గౌరవ ప్రదమైన ఉపాధి కావాలి. ఈ అంచనాలను అందు కోలేకపోతే, అదే యువత వ్యతిరేక గళం విప్పే ప్రమాదం కూడా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాంతీయ అస్తిత్వం బలపడుతున్న తరుణంలో, సినిమా గ్లామర్ మరియు యువత రాజకీయ చైతన్యం ఎలా ప్రభావితం చేస్తాయనే దానికి విజయ్ ఒక ప్రయోగశాలగా మారారు. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు తమిళ నాడులో పట్టు చిక్కడం కష్టమవుతున్న తరుణంలో, విజయ్ వంటి కొత్త తరం నాయకులు ప్రాంతీయ ఆకాంక్షలకు ప్రతిని దులుగా నిలుస్తు న్నారు. ఇది భవిష్యత్తులో జాతీయ రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించవచ్చు.

అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నెగ్గడం అనేది విజయ్ సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో మొదటి మెట్టు మాత్రమే. సినిమాల్లో ఉన్నట్లు ఇక్కడ రీ టేక్‌లు ఉండవు. ప్రతి నిర్ణయం, ప్రతి చర్య ప్రజా క్షేత్రంలోనే పరీక్షించబడుతుంది. ప్రజల ఆశలు, కూటమి భాగస్వాముల సర్దుబాటు, ఆర్థిక నిర్వహణ, సామాజిక సమతుల్యత-ఈ నాలుగు స్తంభాలపైనే విజయ్ సర్కారు మనుగడ ఆధారపడి ఉంది. ఒక సాధారణ నటుడి నుంచి అసాధారణ ప్రజా నాయకుడిగా ఎదిగిన విజయ్, తమిళనాడు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి 'మంచి ముఖ్యమంత్రి'గా పేరు తెచ్చుకుంటారా? లేదా కేవలం ఒక రాజకీయ ప్రయోగంగా మిగిలి పోతారా? అన్నది రాబోయే ఐదేళ్ల పాలనలో తేలి పోతుంది. ప్రస్తుతానికి మాత్రం తమిళనాడు గడ్డపై కొత్త రక్తం, కొత్త ఆలోచనలు పరిపాలనా పగ్గాలు చేపట్టడం శుభ పరిణామం. ఆయన తన శక్తిసామర్థ్యాలతో తమిళనాడును అభివృద్ధి పథంలో నడిపించాలని ఆశిద్దాం.

**- ఆర్‌కేఎస్**


# విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందించాలి



**మహాదేవపూర్ మే 14మనం న్యూస్:** మహాదేవపూర్ మండలంలోని టెన్త్ మరియు ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి పై చదువులకు వెళ్లే, ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు సకాలంలో కులం, నివాసం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు సరియైన సమయంలో అందించకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు మహాదేవపూర్ ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు .సకాలంలో దృవీకరణ పత్రాలుఅందకపోవడంతో పై చదువులకు అప్లై చేసుకునే విద్యార్థులు మరియు ఎంట్రన్స్ ఎగ్జామ్స్ రాసే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తక్షణమే ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలోఅందించేందుకు చొరవ తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజకుమార్ మహాదేవపూర్ ఎమ్మార్వో సత్యనారాయణ స్వామివినతి పత్రం అందజేశారు. ఈ సమస్యపై మహదేపూర్ ఎమ్మార్వో వివరణ కోరగా విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని హామీ ఇవ్వడం జరిగింది

# కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

- **జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**



**జగిత్యాల మే 14( మనం ప్రతినిధి ):** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ నుండి మండల తహసీల్దార్ల తో గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల పురోగతి, ధాన్యం నిల్వలు, రవాణా, హమాలీలు, గన్నీ బ్యాగుల సరఫరా తదితర అంశాలపై అధికారులను సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.₹ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్న ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, తాగునీరు, ఖ్షి ప్యాకెట్స్, నీడ, టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం లిఫ్టింగ్ ప్రక్రియను వేగవంతం చేసి గోదాములకు వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, మిల్లర్లు, ట్రాన్స్ పోర్ట్ యాజమాన్యాలు సమన్వయంతో పని చేసి కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు.ప్రతి రోజు కొనుగోలు వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేసి నివేదికలు సమర్పించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద పారదర్శకత పాటించాలని సూచించారు.

# బొడ్రాయి కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి



**ములుగు, మే 14(మనంన్యూస్):** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం చల్పాక గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి కార్యక్రమాన్ని గౌరవ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ గ్రామ దేవతలు మన మూలాలని, సంస్క ృతి సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ కార్యక్రమాలు సమాజ ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# జ్యువెలరీ షాప్ దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్




**కరీంనగర్, మే 14 (మనం బ్యూరో):** కరీంనగర్ 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిఎంజె జ్యువెలరీ షాపులో ఈనెల 3న దోపిడీలో 161.4 తులాల బంగారు ఆభరణాలు, 112 క్యారెట్ల వజ్రాభరణాలు కలిపి మొత్తం రూ.82,02,000/- విలువైన ఆభరణాలు దొంగతనం జరిగిన ఘటనలో నలుగురు స్టాఫ్ గాయపడిన విషయం విజితమే. ఈ సంఘటనపై గురువారం సాయంత్రం సిపి గౌస్ అలం విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కరీంనగర్లో జరిగిన జువెలరీ షాప్ దోపిడికి సంబంధించిన ఆపరేషన్ను ప్రస్తుతం బీహార్ జైలులో ఉన్న అంతరాష్ట్ర గ్యాంగ్ హ్యాండ్లర్ మరియు ది గోల్డెన్ థీఫ్ గా పేరొందిన సుభోద్ సింగ్ ప్రణాళికా బద్ధంగా నిర్వహించినట్లు చెప్పారు. ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్, జగీరా సింగ్ను ఈ నెల 13న సాయంత్రం 4:00 గంటల సమయంలో వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద అరెస్ట్ చేశామన్నారు. మరో ఇద్దరు నిందితులు రవీష్ కుమార్, ప్రద్యుమన్ మరియు మెహతాబ్ ఖాన్లను బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారెంట్ తీసుకురావడం జరిగిందన్నారు. రఘునాథ్ కర్మాకర్ విచారణలో బీహార్ మరియు బెంగాల్ కేంద్రంగా పనిచేస్తున్న అంతరాష్ట్ర దోపిడీ ముఠా గురించి కీలక సమాచారం బయటపడిందన్నారు. ఈ ముఠా బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో జ్యువెలరీ షాపులు మరియు బ్యాంకులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలు నిర్వహిస్తున్నట్లు తెలిసిందన్నారు. ది గోల్డెన్ థీఫ్గా పేరొందిన సుభోద్ సింగ్ నాయకత్వంలో ఈ గ్యాంగ్ ఏర్పడినట్లు విచారణలో తేలిందని, ఈ ముఠా ముందస్తుగా రేక్కీ నిర్వహించడం, నేరము చేసిన తరువాత తప్పించుకునే మార్గాలను గుర్తించడం, నకిలీ ఆధార్ కార్డులు, నకిలీ బైక్ నంబర్ ప్లేట్లు ఉపయోగించడం, తప్పుడు పేర్లతో లాడ్జలో ఉండడం, ఆధునిక సాంకేతికత వినియోగించడం వంటి పద్ధతులతో ఆయుధాలతో దోపిడీలు నిర్వహించేదని గుర్తించినట్లు చెప్పారు. సుభోద్ సింగ్ మరియు అతని అనుచరుల ప్రణాళిక ప్రకారం నిందితులు తెలంగాణకు రెండు నెలల క్రితం పంపించినట్లు తెలిపారు. రఘునాథ్ కర్మాకర్, జగీరా సింగ్, రవీష్ కుమార్, ప్రద్యుమన్ రాధే, అభయ్, ప్రమోద్ గోస్వామి మిశ్రా, సూర్యమణి, కుమార్, సనోజ్ తెలంగాణలోకి ప్రవేశించే ముందు వీరు జార్ఖండ్-పశ్చిమ బెంగాల్ సరిహద్దులో మెహతాబ్ ఖాన్ వద్ద ఒక్కో సిమ్ కార్డును రూ.10,000 చొప్పున కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అనంతరం వీరు ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల్లో తిరుగుతూ జ్యువెలరీ షాపులు, బ్యాంకుల పై రేక్కీ నిర్వహించి చివరకు కరీంనగర్లోని పిఎంజె జ్యువెలరీ షాప్ను లక్ష్యంగా ఎంచుకుని పెద్దపల్లిలోని ఒక లాడ్జ్ లో బస చేసినట్లు చెప్పారు. ఈనెల 1న ధర్మపురిలోని విజయలక్ష్మి గెస్ట్ హౌస్కు మారి దోపిడీకి సిద్ధమయ్యారని సుభోద్ సింగ్ అనుచరుల సమాచారంతో రఘునాథ్ కర్మాకర్ మంచిర్యాలకు వెళ్లి రైలులో చంద్రపూర్ సమీపానికి చేరుకున్నాడని అక్కడ ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఈనెల 2న గడ్చిందూర్ పరిసరాల్లో ఆరు పిస్టల్స్ మరియు మ్యాగజైన్లు అందజేసినట్లు తెలిపారు. అనంతరం రఘునాథ్ కర్మాకర్ ఆయుధాలతో ధర్మపురికి తిరిగి వచ్చాడని ఈనెల 3న ఉదయం ఐదుగురు నిందితులు ధర్మపురిలో వారు ఉన్న లాడ్జ్ ఖాళీ చేసి రెండు బైక్ల పై బయలుదేరి బ్యాగులను కొండ ప్రాంతంలో దాచిపెట్టి, అక్కడే వారి బైక్ నంబర్ ప్లేట్లు మార్చి, వెలిచాల ఎక్స్ రోడ్ వద్దకి చేరుకొని అక్కడ టిఫిన్ చేసి, దోపిడీ ప్రణాళికను మరోసారి చర్చించినట్లు తెలిపారు. తరువాత ఉదయం 10:50 గంటలకు పిఎంజె జ్యువెలరీ షాప్కు చేరుకున్నారని ప్రణాళిక ప్రకారం రాధే, అభయ్ కస్టమర్లా షాప్లోకి వెళ్లి పరిస్థితిని గమనించారని అన్నారు. రాధే మెస్సేజ్ ఇచ్చిన తర్వాత మిగతా నిందితులు లోపలికి ప్రవేశించి సిబ్బందిని ఆయుధాలతో బెదిరించారని, నగలు దోచుకొనుచునడగా స్టాఫ్ ప్రతిఘటించడముతో నిందితులు వారి వద్ద ఉన్న ఆయుదాలతో స్టాఫ్ పై కాల్పులు జరపడం జరిగిందన్నారు. నిందితులు షాప్ నుండి పారిపోతూ వారు షాపులో దోచుకున్న ఒక ఆభరణాల బ్యాగ్ను తీసుకుని పారిపోయారని ఆందోళనలో మరో బ్యాగ్ను షాప్లోనే వదిలివేశారని తెలిపారు. ముందుగా నిర్ణయించిన మార్గంలో ధర్మపురికి చేరుకున్నట్లు చెప్పారు. సనోజ్, రాధే, అభయ్, ప్రద్యుమన్ గోదావరి నది ఒడ్డున పల్సర్ బైక్ను వదిలి నడుచుకుంటూ నది దాటి మంచిర్యాల నుంచి రైలులో పరారయ్యారని చెప్పారు.మరోవైపు రఘునాథ్ కర్మాకర్, జగీరా సింగ్ మరియు మిశ్రా ఆభరణాల బ్యాగ్తో అపాచీ బైక్ గుండాల అడవి ప్రాంతానికి వెళ్లారని అక్కడ తెలుపు రంగు క్రెటా కారులో వచ్చిన వ్యక్తులకు బ్యాగ్ మరియు బైక్ అప్పగించి సమీప రైల్వే స్టేషన్ ద్వారా బీహార్కు పారిపోవడం జరిగిందన్నారు. సాంకేతిక నిఘా ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఇప్పటివరకు 13 మంది నిందితులను గుర్తించాయను, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, నకిలీ ఆధార్ కార్డులు, రూ.51,000 ల నగదు స్వాధీనం చేసుకొని ముగ్గురిని కోర్టులో హాజరుపరుస్తున్నామని అన్నారు. మిగిలిన నిందితులు మరియు దోచుకెళ్లిన ఆభరణాల కోసం ఐదు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయని చెప్పారు.

# జిల్లా ఎన్నికల అధికారులతో సీఈవో వీడియో కాన్ఫరెన్స్



**జగిత్యాల, మే 14(మనం న్యూస్):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, ఈ సి ఐ నెట్ యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లు, బి ఎల్.ఓ లకు యాప్ను ఏ విధంగా ఉపయోగించాలి, వివరాలను ఎలా నమోదు చేయాలి, ఫీల్ స్థాయిలో సమాచారం సేకరణ విధానం తదితర అంశాలపై అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, వేగం మరియు సమన్వయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ఎన్నికల అధికారులు పలు సూచనలు చేశారు. ఎన్నికల సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితా సవరణను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టరేట్ ఏవో కిషన్, డిపిఆర్ఓ పి. నరేష్, ఎడియం మమత, ఐటీ టీమ్ సభ్యులు మరియు సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- **జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు ,మే 14, మనం ప్రతినిధి:** జిల్లాలో అధిక వర్షపాతం వల్ల సంభవించే వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఫారెస్ట్ అధికారి వికాస్ మీనా తో కలిసి వరదల నిర్వహణకు నిర్వహించనున్న టేబుల్ టాప్ ఎక్సర్సైజ్, మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమాలపై కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశపు గదిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సంభవించే వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టవలసిన ముందస్తు చర్యలు, సహాయక చర్యలు,సమన్వయ విధానాలపై విస్తృతంగా సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. 15-05-2026 తేదీ శుక్రవారం రోజున నిర్వహించనున్న టేబుల్ టాప్ ఎక్సర్సైజ్ మరియు 18-05-2026 తేదీన సోమవారం రోజున నిర్వహించనున్న మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమాలకు వివేకానంద కాలనీ, కృష్ణన్ కాలనీ, పల్సాబ్పల్లి, ములుగు ప్రాంతాలను ఎంపిక చేయడం జరిగిందని,వరదల సమయంలో చేపట్టవలసిన ఎవాక్యుయేషన్ చర్యలు, సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్స్, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానం, అత్యవసర పరిస్థితుల్లో వివిధ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పశువుల చెరువును పరిశీలించిన ఎస్పీ



**సిద్దిపేట , మే14 మనం న్యూస్:** రాబోయే బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకుని, అలాగే డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు, సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఐపీస్ సిద్దిపేట జిల్లా పొన్నాల గ్రామ శివారులో ఉన్న పశువుల చెరువు, కమ్యూనిటీ క్యాటిల్ హాస్టల్ను సందర్శించి పరిశీలించారు. సుమారు 400 పశువులను ఉంచగల సామర్థ్యం కలిగిన కమ్యూనిటీ క్యాటిల్ హాస్టల్ను పండుగ కాలంలో ప్రత్యేక పశువుల నిల్వ కేంద్రంగా వినియోగిస్తున్నారు. పరిశీలన సందర్భంగా కమిషనర్ పశువుల వసతి, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయాలు, వెటర్నరీ సేవలు, ట్రాఫిక్ నియంత్రణ మరియు భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. బక్రీద్ పండుగ సందర్భంగా పరిశుభ్రత, ప్రజల సౌకర్యం, శాంతి భద్రతలను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవీందర్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ కొండల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అర్షిత్ కుమార్, వెటర్నరీ డాక్టర్ డా. వేణుగోపాల్, హరి కిషన్, సీఐ లక్ష్మిబాబు, ఇతర పోలీస్ అధికారులు, శాఖల అధికారులు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు మరియు పశువుల నిల్వ కేంద్రాల వద్ద సజావుగా నిర్వహణ కొనసాగించేందుకు సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ అన్ని అవసరమైన చర్యలు చేపడుతోంది.

# నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలి

- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**




**రాజన్న సిరిసిల్ల, మే -14(మనం ప్రతినిధి ):** జిల్లాలో నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ సీఐ), స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (ఎస్ డబ్ల్యూసీ), నాబార్డ్, పరిశ్రమల శాఖ, ఎల్ డీ ఎం తహసీల్దార్లు, మార్క్ ఫెడ్, మార్కెటింగ్ శాఖ ఇతర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎఫ్ సీఐ, ఎస్ డబ్ల్యూసీ, మార్క్ ఫెడ్ తదితర శాఖల ఆధ్వర్యంలో పంట ఉత్పత్తుల నిల్వ కోసం గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. స్థలాలు గుర్తించాలని, నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరితగతిన పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, మార్క్ ఫెడ్ అధికారి హబీబ్, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ నరసింహ, నాబార్డ్ డీడీఎం దిలీప్, పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు, ఎస్ డబ్ల్యూసీ, ఎఫ్ సీ ఐ అధికారులు, తహసీల్దార్లు, పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు ప్రతిఒక్కరు దూరంగా ఉండాలి

- **కల్వకుర్తి డీఎస్పీ సైరెడ్డి వెంకట్ రెడ్డి**

**కల్వకుర్తి మే14(మనం న్యూస్):** మదకద్రవ్యాలకు ప్రతిఒక్కరు దూరంగా ఉండాలని గంజాయి లాంటి మత్తు పదార్థాలు సేవించిన విక్రయించిన చట్టరీత్యా చర్యలు తప్పవని కల్వకుర్తి డీఎస్పీ సైరెడ్డి వెంకట్ రెడ్డి హెచ్చరించారు.నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కల్వకుర్తి డీఎస్పీ సైరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సీఐ నాగార్జున,ఎస్ఐ కురుమూర్తి, కృష్ణదేవ,లతో పాటు నాగర్ కర్నూల్ జిల్లా నుంచి వచ్చిన దాదాపు 130 మంది పోలీస్ సిబ్బంది గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా కల్వకుర్తి, ఊర్కొండ మండలాల పరిధిలోని సూర్యలత, సూర్యలక్ష్మి స్పిన్నింగ్ మిల్లులలో కార్మికుల ఇండ్లపై ఆకస్మిక తనిఖీలతో పాటు సోదాలు నిర్వహించారు. సోదాలలో కల్వకుర్తి మండల పరిధిలోని సూర్యలత కాటన్ మిల్లులో ఓ కార్మికుడి వద్ద వద్ద 10 గ్రాముల గంజాయి మత్తు పదార్థం అదేవిధంగా ఊర్కొండ మండల పరిధిలోని సూర్యలక్ష్మి కాటన్ మిల్లులో ఓ కార్మికుడి వద్ద 15 గ్రాముల గంజా దొరకడంతో ఆ ఇద్దరు కార్మికులపై కేసులు నమోదు చేయడం జరిగిందని కల్వకుర్తి డీఎస్పీ సైరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి ఇతర మాదకద్రవ్యాలను సేవించిన లేదా విక్రయించిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతిఒక్కరూ గంజాయి లాంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# దుగ్గొండి తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- **వారసత్వ భూమి వ్యవహారంలో రూ.10 వేల లంచం తీసుకుంటూ ఆరి పట్టివేత**



**దుగ్గొండి, మే 14 (మనం న్యూస్):** తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. వారసత్వ భూమికి సంబంధిత ఫైల్ పరిష్కారం కోసం రూ. 10 వేల లంచం తీసుకుంటున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆరొ ను ఏసీబీ అధికారులు రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని మధిర గ్రామానికి చెందిన లొల్లాటి రాజు తన తండ్రి నర్సయ్య మరణంతో తన తండ్రి పేరు మీద ఉన్న 27 గుంటల వ్యవసాయ భూమి పట్టా చేసుకునేందుకు వారసత్వ భూమి నమోదు ప్రక్రియ కోసం దరఖాస్తు చేసుకోగా, సంబంధిత ఫైల్ను ముందుకు జరిపేందుకు ఆరొ రూ. 10 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం.బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు పక్కా ప్రణాళికతో దాడి నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలోనే లంచం తీసుకుంటున్న సమయంలో అధికారులు ఆరొను అదుపులోకి తీసుకుని, నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి, సంబంధిత పత్రాలను సీజ్ చేసినట్లు తెలిసింది. ఈ ఘటనతో తహసీల్దార్ కార్యాలయంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# రుద్రంగి పీహెచ్సీ నూతన భవన పనులను వేగవంతం చేయాలి



- **జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత**

**రాజన్న సిరిసిల్ల, మే 14(మనం ప్రతినిధి ):** జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత ఆదేశించారు. గురువారం రుద్రంగి మండలంలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రుద్రంగి ఆరోగ్య ఉప కేంద్రం, చందుర్తి, అనుమాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు: వడదెబ్బపై అప్రమత్తత: ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వడదెబ్బకు సంబంధించిన అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంల సమన్వయంతో గ్రామాల్లో ఓఆర్ఎస్ కార్నర్లను ఏర్పాటు చేయాలని, ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రులకు వచ్చే వ్యాధిగ్రస్తుల కోసం చల్లని త్రాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమయపాలన: వైద్య సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో జిల్లా డాటా మేనేజర్ కార్తీక్, ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



**క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలి**

**మౌలిక వసతుల అభివృద్ధే విద్యా వారోత్సవాల ప్రధాన లక్ష్యం**

**విద్యా వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి, మే 14 (మనం జిల్లా ప్రతినిధి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో గురువారం రాజంపేట మండలంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కలెక్టర్ శాలువాలతో సన్మానించి అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు. జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో అదనపు తరగతి గదులు, మరమ్మతుల అవసరాన్ని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని ఏఈ పీఆర్ను ఆదేశించారు. గ్రామపంచాయతీ నిధుల నుంచి 50 శాతం నిధులు మంజూరు చేస్తామని సర్పంచ్ శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యా వారోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం విద్యాపట్ల ఆసక్తి పెంపొందించడం, పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి అని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రాజు, ఎంఆర్వో, హెచ్ఎం ఈశ్వర్, సర్పంచ్ శ్రీకాంత్, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి మున్సిపాలిటీలో వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ



- **మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్**
- **కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన**

**కల్వకుర్తి, మే14(మనం న్యూస్):** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో అన్ని రకాల మౌళిక వసతులు కల్పించడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ తెలిపారు. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని మహబూబ్ నగర్ చౌరస్తా నుండి శివాజీ చౌకు వరకు చేపడుతున్న రహదారిలో విస్తరణలో భాగంగా ఆర్టీసీ డిపో ఎదుట నూతనంగా నిర్మాణం చేపట్టే కల్వర్టు పనులకు గురువారం మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్ కౌన్సిలర్లు షేక్ ఏజాస్,కొల్లోజు రాజేష్ కుమార్, నాజియా మక్బూల్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి,నాయకులు వర్కాల భాస్కర్ రెడ్డి,బృంగి ప్రవీణ్,బంగారి, పురుషోత్తం గాంధీ, సంతుయాదవ్,ముక్తాధర్, పడకంటి వెంకటేష్, దున్న సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# భిక్కనూర్‌లో ఉచిత హెచ్‌పీవి వ్యాక్సిన్ కొనసాగింపు

**భిక్కనూర్, మే 14 ( మనం న్యూస్ ):** 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాలు పూర్తి కాని బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం భారత ప్రభుత్వం అందిస్తున్న క్వాడ్రివాలెంట్ హెచ్పీవీ టీకా ఉచిత కార్యక్రమాన్ని భిక్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ యెమీమా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ., మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన సర్వే ప్రకారం మొత్తం 354 మంది బాలికలను అర్హులుగా గుర్తించామని చెప్పారు. అందులో ఇప్పటివరకు 175 మంది బాలికలకు హెచ్పీవీ టీకా అందించినట్లు వెల్లడించారు. ఇంకా మిగిలిన అర్హులైన బాలికలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని టీకా తీసుకోవాలని సూచించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణలో హెచ్పీవీ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న డాక్టర్ యెమీమా, తల్లిదండ్రులు టీకాపై ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా తమ పిల్లలకు వ్యాక్సిన్ వేయించాలని కోరారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది కలిసి గ్రామాల్లో అవగాహన కల్పించి బాలికలను టీకా తీసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



# మేడ్చల్ జిల్లాలో అనధికారికంగా నడుస్తున్న క్లినిక్‌లు సీజ్



- **ఆకస్మిక తనిఖీలు చేసిన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని డా. ఉమా గౌరీ**

**మేడ్చల్, మే 14( మనం జిల్లా ప్రతినిధి ):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో అనధికారికంగా నడుస్తున్న పలు క్లినిక్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డా. ఉమా గౌరీ సీజ్ చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అనధికారికంగా నడుస్తున్న క్లినిక్స్, హాస్పిటల్స్ పై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరి ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో కే.పీ.హెచ్.బి, జగదీర్ గుట్ట పరిధిలోని పలు క్లినిక్లను, ఆసుపత్రులను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా రిజిస్ట్రేషన్ లేకుండా, అనధికారికంగా నడుస్తున్న క్రింది క్లినిక్లను సీజ్ చేశారు. సుమన్ క్లినిక్ శ్రీ గాయత్రి క్లినిక్ సుమన హెల్త్ మరియు రిహాబ్ సెంటర్ ను సీజ్ చేశారు.ఈ క్లినిక్ లు ఎటువంటి చట్టబద్ధ రిజిస్ట్రేషన్ లేకుండా, అర్హత కలిగిన వైద్యులు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నందున, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం మరియు అలోపతి చట్టం-2010 ప్రకారం సీజ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరి మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ లేకుండా ఉండడమే కాకుండా ఎలాంటి క్వాలిఫికేషన్ లేకుండా ల్యాబ్ టెస్ట్ లకై రక్త, మూత్ర నమూనాలను కలెక్ట్ చేసి వివిధ ల్యాబ్ లకు పంపడం, ఫార్మసీ కూడా వారే నడుపుతూ మందులను రోగులకు అధిక ధరలకు ఇస్తూ దానర్జన చేయడమే కాకుండా, ప్రజల ఆరోగ్యం తో చెలగాటం చేస్తున్నారని తెలిపారు వైద్య సేవలు తగిన అర్హతలు కలిగిన వైద్యులచే జరగాలని,నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల ఆరోగ్యంతో చట్ట విరుద్ధం గా ప్రవర్తించే వారిపై ఉపేక్షించడం ఉండదు అని హెచ్చరించడం జరిగినది.ఈ తనిఖీ లలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డా.ఉమా గౌరి, పాటు ప్రోగ్రాం అధికారులు డా. గీతా, డా. పవన్, వసంత డిప్యూటీ డెమో పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



- **రైతులు ఇబ్బంది పడకుండా వేగంగా ధాన్యసేకరణ పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి, మే 14 (మనం జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా రాజంపేట మండలంలోని రాజంపేట, అరగొండ, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, లిఫ్టింగ్ పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. లోడింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తగిన సంఖ్యలో లారీలు, హమాలీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కాంటా వేసి మిల్లులకు తరలించాలని తెలిపారు. అరగొండ గ్రామంలోని మొక్కజొన్న సేకరణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, లారీల్లో లోడింగ్ పనులను దగ్గరుండి పరిశీలించారు.

**వాహనాలను సిద్ధంగా ఉంచాలి...**

కాగా మిగిలిన మొక్కజొన్నను వెంటనే సేకరించేలా చర్యలు తీసుకోవాలని, గోదాములకు తరలించేందుకు అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచాలని డీఎం మార్కెఫెడ్ను ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాబోయే వర్షాలను దష్టిలో ఉంచుకుని వరి, మొక్కజొన్న నిల్వలో ఎటువంటి నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాల పరిశీలనలో పారదర్శకత పాటించాలని సూచించారు. ఈ పర్యటనలో డీసీవో, డీసీఎస్ఓ, డీఎంసీఎస్, డీఎం మార్కెఫెడ్, డీఎంఓ, ఎంఎస్ఓ, తహసీల్దార్, ఎంపిఓ, ఎంఈఓలు, సర్పంచులు, ప్యాక్స్ చైర్మన్లు, ప్యాక్స్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీసులకు సీపీ ప్రత్యేక సహాయం



**సిద్దిపేట, మే14 మనం న్యూస్:** తీవ్ర వేసవి ఎండల్లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి ఉపశమనం కల్పించేందుకు మరియు మద్దతు అందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ట్రాఫిక్ పోలీసు సిబ్బందితో మాట్లాడి, వారి సమస్యలు మరియు ఫిర్యాదులను తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమం, విధుల సమయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. వేసవి కాలంలో ట్రాఫిక్ సిబ్బందికి తగినంత తాగునీరు, హైడ్రేషన్ సదుపాయాలు కల్పించాలని ట్రాఫిక్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజల భద్రత మరియు సాఫీ ట్రాఫిక్ నిర్వహణ కోసం నిరంతరం కృషి చేస్తున్న ట్రాఫిక్ పోలీసుల కష్టపడి పనిచేసే తత్వాన్ని, అంకితభావాన్ని కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కుషాల్కర్, ట్రైనీ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా, ట్రాఫిక్ ఏసీపీ సుమన్, సీఐలు, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీ

**మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కేజేఎస్ యూనిట్-ఐఐకి శ్రీకారం**

**1,500 మందికి స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు**

**జగ్గారెడ్డి, నిర్మల కృషితో ముందుకు వచ్చిన ప్రాజెక్ట్**

**శంకుస్థాపన చేయనున్న పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**సంగారెడ్డి మే 14 మనం న్యూస్ ప్రతినిధి:** సంగారెడ్డి నియోజకవర్గంలో మహిళలకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే మరో భారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. కె జె ఎస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో కొండాపూర్ మండలం తొగర్పల్లి-అలియాబాద్ ప్రాంతంలో కేజేఎస్ యూనిట్-ఐఐ పేరుతో సమగ్ర ఆహార పానీయాల తయారీ కేంద్రానికి రేపు మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి లు భూమిపూజ చేయనున్నారు. సుమారు రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో నిర్మించనున్న ఈ పరిశ్రమ ద్వారా దాదాపు 1,500 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి లభించనుండగా, మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.



ప్రస్తుతం పాశమైలారం యూనిట్లోనే వందలాది మహిళలు పనిచేస్తుండటం విశేషం. సంగారెడ్డి నియోజకవర్గం లో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యం తో ఇక్కడే పరిశ్రమ నెలకొల్పాలని టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి లు కోరారని, వారి కృషి తోనే పరిశ్రమ స్థాపన కు ముందుకు వచ్చామని పరిశ్రమ ప్రతినిధులు తెలియజేశారు. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రోత్సాహంతో, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్చార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి ల సహకారంతో పరిశ్రమ స్థాపనకు వేగం చేకూరిందన్నారు. సంగారెడ్డిని ఫుడ్ ఎఫ్ఎంసిజి హబ్గా తీర్చిదిద్దే దిశగా అడుగు కాన్ఫెక్షనరీ, బేవరేజెస్, కాఫీ, న్యూట్రాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ విభాగాలతో ఏర్పడనున్న ఈ యూనిట్ తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి, స్థానిక యువతకు మరియు మహిళలకు ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషించనుంది. సంగారెడ్డి మహిళలకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పరిశ్రమ రావడం ఒక మహిళ గా ఇది నాకు గర్వ కారణం అంటూ టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం లో 1500 మహిళలకు ఈ పరిశ్రమ ద్వారా ఉపాధి లభిస్తుండటం సంతోషంగా ఉంది. ఒక మహిళగా ఇది నాకు గర్వ కారణం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకట స్వామి ల సహకారం వల్లనే ఇది సాధ్యమైంది అని హర్షం వ్యక్తం చేశారు.

# జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోను కలిసిన ఉద్యోగులు



**సూర్యాపేట, మే 14 (మనం ప్రతినిధి):** సూర్యాపేట జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో గా భాద్యతలు స్వీకరించిన మహా లక్ష్మి ని గురువారం జెడ్పి కార్యాలయంలో తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు పంతిని శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో ఉద్యోగులు డిప్యూటీ సీఈవో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గుయ్యాని ప్రసాద్, సహా అధ్యక్షులు శ్రీనివాస్ రావు, కోశాధికారి మణి కుమార్, ఉపాధ్యక్షులు, యాసీన్, దశరాథ, ఆర్గనైజింగ్ సెక్రటరీ హాసాన్ అలీ, సంఘ సభ్యులు శ్రీనివాస్ చారి, మదన్మోహన్ రెడ్డి, పద్మనాభం, రాజశేఖర్,నాగేశ్వర్ రావు, మల్లేష్, మహిళా సభ్యులు శిల్పిక, ప్రియాంక, నాగలక్ష్మి, రాధాకుమారి, మంగమ్మ, మమత, సుమలప్రియ, జ్యోతి, నర్సింహ రావు, బాబురావు, కోటేశ్వరరావు, ఖాసీం బాబు, మహేష్, సంపత్ కుమార్, మహేష్ నాగులు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో డంపర్ ఆపరేటర్లుగా మహిళలు

**13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్లను నడపనున్న మహిళా కార్మికులు**

**మహిళా శక్తికి ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆదేశంపై స్పందించిన సింగరేణి**

**వివిధ క్లిష్టతర బాధ్యతల నిర్వహణపై ఆసక్తి గల మహిళలకు అవకాశాలు**

**త్వరలో జారీ అయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకాల్లో మహిళలకు కూడా అవకాశం**

**హెవీ మోటార్ వెహికిల్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 13 మంది మహిళా ఉద్యోగులు**



**కొత్తగూడెం సింగరేణి, మే15(మనం న్యూస్):** మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యనిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థలో కూడా మహిళా శక్తికి తగు ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని ఆదేశించడంతో సింగరేణి చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్ల ఆపరేటర్లుగా కొందరు మహిళలకు కంపెనీ అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశంపై సింగరేణి యాజమాన్యం మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్ ను గని క్వారీ నుండి ఉపరితలానికి రవాణా చేయడానికి యాజమాన్యం 60 నుంచి 100 టన్నుల భారీ డంపర్లను వినియోగిస్తుంది. సింగరేణిలో గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటివరకు కేవలం మగ ఆపరేటర్లు మాత్రమే ఈ భారీ డంపర్ లను నడుపుతూ వస్తున్నారు. ఎందుకంటే ఈ డంపర్లను నడపడం కొంత కష్టంతో పాటు శారీరక దృఢత్వం, డ్రైవింగ్ నైపుణ్యం అవసరమై ఉంటాయి. పైగా మండే ఎండల్లోనూ భారీ వర్షాలు తీవ్రమైన చలి పరిస్థితులను తట్టుకొని మూడు షిఫ్టుల్లో కూడా డంపర్లు నడపాల్సి ఉంటుంది. ఇంత కష్టతరమైన పనిని పురుష ఆపరేటర్లు మాత్రమే నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే సింగరేణి సంస్థలో ఇటీవల మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని వారి నైపుణ్యాలను శక్తి సామర్థ్యాలను కూడా వినియోగించడానికి తగు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల్లో డంపర్ ఆపరేటర్లుగా పని చేయడానికి ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను కోరింది. మొదట దాదాపు 35 మంది వరకు ముందుకు వచ్చారు. అయితే భారీ డంపర్లను నడపడానికి వారికి అంతకుముందే సాధారణ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు భారీ వాహనాలను నడిపే లైసెన్స్ కూడా అవసరమై ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న యాజమాన్యం సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్(టైడ్స్)అనే సంస్థ ద్వారా ఆసక్తి గల మహిళలకు కంపెనీ ఖర్చులతో భారీ వాహనాలపై ఉచిత డ్రైవింగ్ శిక్షణను అందించింది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 13 మంది మహిళా ఉద్యోగులు తాము డంపర్ ఆపరేటర్లుగా పనిచేయటానికి సంసిద్ధంగా ఉన్నామని కంపెనీకి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వీరందరికీ త్వరలో విడుదలయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకల్లో అవకాశం కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో సింగరేణి సంస్థ కూడా ఆ దిశగా కీలక అడుగులు వేస్తోంది. పురుషులకు మాత్రమే పరిమితమైన కఠినమైన పనుల్లో మహిళలకు సైతం ప్రాధాన్యతనిస్తూ సింగరేణి సంస్థ తొలిసారిగా డంపర్ ఆపరేటర్లుగా మహిళలకు కూడా అవకాశం కల్పించటానికి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ విధంగా అనతి కాలంలోనే సింగరేణి సంస్థలో భారీ డంపర్లపై మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కనపడే అవకాశం ఉంది. ఈ సందర్భంగా కొందరు మహిళా ఆపరేటర్లు మాట్లాడుతూ భారీ డంపర్లను నడపడం శారీరక కష్టం నైపుణ్యంతో కూడుకున్న పని అని తాము చేయగలమో లేదో అని కొంత భయపడినప్పటికీ స్వయంగా డంపర్లు నడుపుతున్నప్పుడు తాము కూడా ఇటువంటి పనులు చేయగలమన్న ఆత్మవిశ్వాసం కలగిందన్నారు.

నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాలతో పాటు రోదసిలోకి వెళ్తున్నారని కనుక గనిలోని డంపర్లను మహిళలు నడపడం అంత కష్టమేమీ కాదని ఇటువంటి మంచి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి యాజమాన్యానికి తాము ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివ రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ల ఆదేశాల మేరకు సింగరేణిలో మహిళా శక్తికి తగిన అవకాశాలు కల్పిస్తూ వస్తున్నామని బెల్లంపల్లి ఖైరీగూడ ఓపెన్ కాస్ట్ గనిలో అత్యంత క్లిష్టమైన బ్లాస్టింగ్ విభాగంలో కూడా కేవలం మహిళలను మాత్రమే నియమించగా వారు పురుష ఉద్యోగులతో సమానంగా బ్లాస్టింగ్ ను నిర్వహిస్తున్నారని అలాగే ఇతర విభాగాల్లో కూడా మహిళలు రాణిస్తున్నారని ఒక అధికారి పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో తొలిసారిగా మహిళా రెస్క్యూ జట్టును కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇలాగే ఇకపై కూడా వివిధ క్లిష్టతరమైన ఉద్యోగాలలో ఆసక్తి గల మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

## రామయ్యను దర్శించుకున్న మంత్రి తుమ్మల



భద్రాచలం,మే 14 (మనం న్యూస్): భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. ప్రత్యేక ఆహ్వానం పలికిన ఆలయ అర్చకులు. మంత్రిగా తొలిసారి ఎన్టీఆర్ క్యాబినెట్ లో ప్రమాణ స్వీకారం చేసి నేటికి నలభై ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న మంత్రి తుమ్మల ,1986 మే 14 తేదీన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తుమ్మల 40 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి తుమ్మలతో పాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు ,ఖమ్మం సుడా చెర్మన్ పువ్వాడ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం



**రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం 22 వేల కోట్లు**

**హమాలీలు, రవాణా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు**

**పాలేరులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

కూసుమంచి, మే 14(మనం న్యూస్)ః రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ - సెర్ప్ ద్వారా శ్రీ లక్ష్మి గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి ధాన్యం సేకరణ, తూకం, నాణ్యత ప్రమాణాలు, నిల్వ ఏర్పాట్లు తదితర అంశాలను మంత్రులు పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులు పండించిన చివరి గింజ వరకూ మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు.

ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం 22 వేల కోట్లతో ఈ సీజన్లో రాష్ట్ర వ్యాప్తంగా 82 నుంచి 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు.ప్రస్తుతం హమాలీలు, లారీ వాహనాల కొరత వంటి సమస్యలు ఉన్నాయని మంత్రి తెలిపారు. సాధారణంగా బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి హమాలీలు వస్తారని, ఇటీవల పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు, బీహార్లో వ్యవసాయ సీజన్ పొడిగింపు కారణంగా హమాలీల కొరత తీవ్రంగా ఉందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఆ సమస్య పరిష్కారానికి అత్యవసర చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

రవాణా సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. వచ్చే 15 రోజుల పాటు లారీలు, డీసీఎంలను ఇతర అవసరాలకు కాకుండా ధాన్యం రవాణాకే వినియోగించా లని నిర్ణయించామని చెప్పారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంత్రులు జిల్లాల వారీగా పర్యటిస్తూ కొనుగోళ్ల ప్రక్రియను సమీక్షిస్తున్నారని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, డిఆర్డిఓ శ్రీరామ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ. అలీం, ఇంచార్జీ డిఎం సివిల్ సప్లై సునీల్ రెడ్డి, డిసిఓ గంగాధర్, సెంటర్ ఇంచార్జీ రేణుక, ఏఈఓ, సంబంధిత అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్లో వనజీవి రామయ్య స్మారక వనానికి శంకుస్థాపన

### మంత్రి పొంగులేటి హామీ.. కలెక్టర్కు ఆదేశాలు

ఖమ్మం రూరల్, మే 14(మనం న్యూస్)ః పర్యావరణ పరిరక్షణే శ్వాసగా, కోటి మొక్కలే ప్రాణంగా జీవించిన పద్మశ్రీ వనజీవి రామయ్య జ్ఞాపకార్థం వచ్చే నెల జూన్ లో స్మారక వనానికి అంకురార్పణ చేయనున్నట్లు తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ సత్యనారాయణపురం క్లస్టర్ పరిధిలో నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామయ్య సతీమణి జానమ్మ మంత్రిని కలిసి తమ గోడు వెళ్లబోసుకోగా ఆయన సానుకూలంగా స్పందించారు. రామయ్య సేవలను స్మరించుకుంటూ జూన్లో స్మారక చిహ్నానికి శంకుస్థాపన చేస్తామని, జానమ్మకు ప్రభుత్వ పింఛను అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. స్మారకం కోసం తక్షణమే స్థలాన్ని సేకరించాలని కలెక్టర్ను ఆదేశించారు. 'వృక్షోరక్షితి రక్షిత:' అనే నినాదాన్ని తన జీవితాంతం ఆచరించిన రామయ్య సేవలు చిరస్మరణీయమని, వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మంత్రి పేర్కొన్నారు.

## మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్లోకి వలసలు

### మునిగేపల్లి సర్పంచ్, ఐదుగురు వార్డు సభ్యుల చేరిక



ఖమ్మం, మే 14(మనం న్యూస్)ః పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలంలో అధికార పార్టీలోకి వలసలు ఊపందుకున్నాయి. మునిగేపల్లి సర్పంచ్ గంగా స్రవంతి తన అనుచర వర్గంతో కలిసి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మంలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐదు నెలల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సర్పంచ్గా గెలుపొందిన గంగా స్రవంతి, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. సర్పంచ్తో పాటు ఆమె వెన్నంటి గెలిచిన ఐదుగురు వార్డు సభ్యులు, గ్రామ ముఖ్య నాయకులు, వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు మంత్రి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా పిడమర్తి రవి జన్మదిన వేడుకలు



ఖమ్మం, మే 14(మనం న్యూస్)ః మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్ గా విద్యార్థి లోకాన్ని ఏకం చేసి తెలంగాణ రాష్ట్ర సాధనకు విశేష కృషి చేసిన విద్యార్థి ఉద్యమకారుడు , మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి జన్మదిన వేడుకలు ఖమ్మంలోని అంబేడ్కర్ భవన్ లో జిల్లా విజయ్ కుమార్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టే గురుమూర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు వందలాది కేసులతో పాటు , జైలు జీవితం గడిపి ఉద్యమంలో తన సత్తా చాటిన యువ నాయకుడు పిడమర్తి రవి జన్మదిన జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు . కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా ఎంత ఉంటే అంత వాటా రావాలని రిజర్వేషన్ల పెంపు ఉద్యమానికి శ్రీకారం చుట్టిన పిడమర్తి రవి ధన్యజీవి అని కొనియాడారు. ఈ పుట్టినరోజు వేడుకలో ఆర్పిఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరీకంటి సంజీవరావు, మాగి శేషగిరి, తెలంగాణ ఉద్యమకారుడు కొరకొప్పుల రామారావు తదితరులు పాల్గొన్నారు .

## 25న జరిగే మహాధర్నాను జయప్రదం చేయండి

**కనీస వేతనం ప్రభుత్వం అమలు చేయాలి**

**విలేకరుల సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రుల మెడికల్ కాలేజీల శానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ సూపర్వైజర్స్ కార్మికుల అసోసియేషన్**



ఖమ్మం మే 14(మనం న్యూస్)ః ఐహెచ్ఎఫ్ఎంఎస్ నుంచి ఐఎఫ్ఎంఐఎస్ లోకి విలీనం చేయాలని, కనీస వేతనం 26,000 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న హైదరాబాద్ రాష్ట్రవ్యాప్త కార్మికులు మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు శానిటేషన్ పేషెంట్స్ సెక్యూరిటీ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కుర్రి సైదయ్య తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత అనేక సంవత్సరాలుగా తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్నమని కానీ సమస్య మాత్రం పరిష్కారం నేర్చుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం 26,000 అమలు చేయాలని జీతం నేరుగా ప్రభుత్వం నుంచే ఐ ఎఫ్ ఎం ఐ ఎస్ ద్వారా చెల్లించాలని, ప్రతి కార్మికుడికి ఎంప్లాయర్ షేర్ ద్వారా ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం తాడుపాటి ఏజెన్సీ ద్వారా తాము పని చేస్తున్నామని, ఈ విధానాన్ని ఎత్తివేయాలని కోరారు. ప్రతి కార్మికుడికి నెలలో నాలుగు రోజులు సెలవు దినాలు, రెండు సిఎల్ఎలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు 10 లక్షల ప్రమాద బీమా వర్తించాలని, చనిపోయిన కార్మికుల కుటుంబానికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బెడ్ సైడ్ కాంట్రాక్టర్ విధానం తీసివేసి ,తెలంగాణ రాష్ట్రంలో డిఎంఈ, టి వివి పి కింద పనిచేస్తున్న శానిటేషన్ సెక్యూరిటీ సూపర్వైజర్స్ కు వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు . ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు మాతంగి అనిల్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్బ రామ, గొర్రె నాగరాజు, జిల్లా అధ్యక్షులు ఇసంపల్లి అంబేద్కర్, ఉపాధ్యక్షులు రాయల రమాదేవి, అడపాల అపర్ణ, బడిషా, హరీష్, ప్రధాన కార్యదర్శి కర్రీష జగదీష్, సహాయ కార్యదర్శి ఎస్.కె సైదాబీ, డి. భాను, వల్లపురమ్మ , కోశాధికారి బత్తుల మమత, ఏపూరి నాగమల్లిక, ఈసీ సెంబర్లు జి. నాగేంద్ర, బి. సీతారాములు, ఎస్.కె నస్రిన్, సుభద్ర , పి. కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## సేవకు మించిన సంపద లేదు...

- **వైద్యం సంపాదనకు సాధనం కారాదు**
- **ప్రజావైద్యులు పారుపల్లి గోర్కీ**



ఖమ్మం, మే 14(మనం న్యూస్)ః ఎటువంటి ప్రయోజనం ఆశించకుండా నిస్వార్థంగా చేస్తున్న సేవకు మించిన సంపద లేదని, వైద్యో నారాయణో హరి అన్న నానుడి ప్రకారం రేపటి వైద్యులు వైద్యాన్ని సంపాదనకు సాధనంగా కాకుండా సేవాభావంతో నిర్వర్తించి ఖ్యాతి గడించాలని ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ ప్రజా వైద్యులు డాక్టర్ పారుపల్లి గోర్కీ కోరారు. గాంధీ వైద్యకళాశాలలో నాలుగవ సంవత్సరం వైద్య విద్య అభ్యశిస్తున్న కనపర్తి మనోజ్ కుమార్కు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ అందించిన ఇరవై వేల రూపాయల చెక్కు, జ్ఞాపికను డాక్టర్ గోర్కీ, ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్యతో కలిసి గురువారం స్థానిక గోర్కి పబ్లిక్ స్కూల్ కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. గురువారం నాడు పరిశ సీతారత్నం ఆరవ వర్ధంతి సందర్భంగా నిరుపేద విద్యార్థి కనపర్తి మనోజ్ కుమార్ ఉన్నత విద్యకు చేయూత అందించినట్లు ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య తెలిపారు. పౌరులు అందరు సేవాభావం కలిగి ఉండాలని, పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ విద్యారంగానికి చేస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకోవాలని డాక్టర్ గోర్కీ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్జీపిఎటి ఖమ్మం జిల్లా సంయుక్త అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శి గుర్రాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ అవగాహన లేకపోతే నిరక్షరాస్యులే

### కొనసాగుతున్న విద్యా వారోత్సవాలు



ఖమ్మం, మే 14(మనం న్యూస్)ః ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్యా వారోత్సవాలలో నాలుగో రోజు నాలుగు విభిన్న కార్యక్రమాలు కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా ఆధ్వర్యంలో జరిగాయి. ఇంగ్లీష్- కంప్యూటర్ సైన్స్ విభాగాలు నిర్వహించిన డిజిటల్ ట్రైనింగ్ ఫర్ ఫ్యాకల్టీ కార్యక్రమంలో చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల కంప్యూటర్ విభాగాధిపతి డా.వి.సుదర్శన్ ముఖ్య వక్తగా పాల్గొని ప్రస్తుత డిజిటల్ యుగంలో వేగవంతంగా మారుతున్న సాంకేతిక మాధ్యమాలను అధ్యాపకులు ఎప్పటికప్పుడు అవగాహనతో ఉండాలని సూచించారు. అనంతరం నూతనంగా కళాశాలకు వచ్చిన ఏఈడిపి కోర్సులైన బి.కాం బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్సూరెన్స్, బి.ఎస్.సి హెల్త్ కేర్ కోర్సుల అప్రెంటిస్ షిప్ విధి, విధానాలు కోర్సుల తీరుతెన్నుల గురించి కళాశాల విద్యా కమిషనరేట్ నుంచి వచ్చిన ప్రతినిధులు అధ్యాపకుల సందేహాలను నివృత్తి చేశారు.తరువాత కళాశాల భాగ్య హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ జి.చేతన్ వడదెబ్బ,బి.పీ, షుగర్ క్యాన్సర్ గురించి అవగాహన చైతన్యాన్ని కలుగజేశారు. చివరగా ప్రస్తుతం బోధనా రంగంలో ఉన్న కళాశాల పూర్వ విద్యార్థులైన ఇల్లందు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వై.చిన్నప్పయ్య, మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి, నేషనల్ బెస్ట్ టీచర్ జిల్లా పాఠశాల మానిటరింగ్ ఆఫీసర్ పెసర ప్రభాకర్ రెడ్డి, వివిధ కళాశాలల్లో పనిచేస్తున్న డిగ్రీ అధ్యాపకులు పాఠశాల విద్యలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పాల్గొని తమ అపూర్వ జ్ఞాపకాలను పంచుకున్నారు విద్యా వారోత్సవాల వలన తాము చదువుకున్న కళాశాల లో అడుగులు వేయడం గొప్ప స్ఫూర్తినిస్తుందని పాత మధురాలను పంచుకున్నారు అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ ఏఎల్ఎన్ శాస్త్రి, డా.సీహెచ్ శ్రీనివాస్, ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, కార్యక్రమాల సమన్వయకర్తలు, డా.జి.వీరన్న , చందా సుధాకర్, డా.ఏ నర్సమ్మ, డా.షేక గౌసియా బి.వెంకటేశ్వర్లు, డా.కె.నాగేశ్వరరావు, డాక్టర్ బి.వేణుమాధవ్, వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం..




**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**జూన్ 2 నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రారంభం**

**ధరణి, సాదా బైనామా సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరిస్తాం**

**ఏదులాపురం మున్సిపాలిటీలో నిర్వహించిన ప్రజాదర్బార్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి**



ఖమ్మం రూరల్, మే 14(మనం న్యూస్)ః ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదాలతో ప్రజా ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిందని తెలిపారు. పేద ప్రజలకు అండగా నిలవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లోనే అధికారులను ప్రజల వద్దకు పంపించి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కార చర్యలు చేపట్టామని తెలిపారు. రెండేళ్ల పాలన అనంతరం మళ్లీ ప్రజల వద్దకే అధికారులను పంపిస్తూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా, మున్సిపాలిటీని రెండు క్లస్టర్లుగా విభజించి ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 11 క్లస్టర్ల కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. ప్రతి దరఖాస్తుపై అధికారులకు పూర్తి జవాబుదారీతనం ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. కొన్ని సమస్యలను ఇక్కడికక్కడే పరిష్కరిస్తామని, మరికొన్ని సమస్యలకు కొంత సమయం పట్టవచ్చని తెలిపారు. అయితే ప్రతి అర్హత గల దరఖాస్తును నిబంధనల ప్రకారం మూడు నెలల్లోగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామని చెప్పారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్కు 500 బోనస్ కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వమిదేనని స్పష్టం చేశారు. గత పదేళ్లలో పేదలకు ఇళ్లు ఇవ్వలేదని, అయితే తమ ప్రభుత్వం తొలి దశలోనే లక్షలాది ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. జూన్ 2 నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రారంభమవుతుందని, అనంతరం మూడవ, నాల్గవ విడత ఇళ్లను కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు. ప్రతి అర్హులైన కుటుంబానికి ఇంటి నిర్మాణానికి 5 లక్షల సహాయం రాజకీయాలకు అతీతంగా అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజాదర్బార్ కార్యక్రమాల్లో ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు వస్తున్నాయని, గత ప్రభుత్వం ఇళ్లు నిర్మించకపోవడమే దీనికి కారణమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుండటంతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. ధరణి కారణంగా ఏర్పడిన భూ సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు. సాదా బైనామా దరఖాస్తులను కూడా ప్రభుత్వం అర్హత ప్రకారం పరిష్కరిస్తుందని చెప్పారు. త్వరలో పెండింగ్లో ఉన్న సాదా బైనామా భూ సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. నిరుద్యోగ యువతకు తొలి ఏడాదిలోనే 70 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించామని మంత్రి తెలిపారు. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి ఎలాంటి లీకులు లేకుండా ప్రతిభావంతులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నిరుద్యోగ యువతకు మరిన్ని శుభవార్తలు అందిస్తామని తెలిపారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మున్సిపాలిటీ పరిధిలో తొలి ప్రజాదర్బార్ కార్యక్రమమని తెలిపారు. ఇప్పటివరకు గ్రామాల వారీగా క్లస్టర్ స్థాయిలో ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించామని, ఆ కార్యక్రమాల ద్వారా సుమారు 16 వేల దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తున్నామని, నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు జయలక్ష్మి, మమత మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం వచ్చాక తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని,

# ఆకాశరాజు నిర్మించిన శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి పుణ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవ మహోత్సాహం

## మే 28 నుండి జూన్ 5 వరకు నారాయణవనంలో బ్రహ్మోత్సవాలు

**తిరుపతి మే14 మనం న్యూస్:** శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి దివ్య క్షేత్రమైన నారాయణవనంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మే 28 నుండి జూన్ 5వ తేదీ వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. మే 27న సాంప్రదాయబద్ధంగా అంకురార్పణ కార్యక్రమంతో ఉత్సవాలకు శ్రీకారం చుడనున్నారు.

### ఆకాశరాజు నిర్మించిన పుణ్యక్షేత్రం

శ్రీ పద్మావతీ దేవి అవతరించిన పవిత్ర స్థలంగా నారాయణవనం ప్రసిద్ధి చెందింది. శ్రీ ఆకాశరాజు పుత్రకామేష్టి యాగ సమయంలో స్వర్ణహలంతో భూమిని దున్నుతుండగా పద్మంపై వెలసిన దివ్య శిశువును కనుగొని పద్మావతి అని నామకరణం చేశారు. అనంతరం శ్రీనివాసుడు వేటకు విచ్చేసిన సందర్భంలో పద్మావతీదేవిని దర్శించి, ఆకాశరాజు అనుమతితో సకల దేవతల సమక్షంలో వివాహం జరిగింది. ఆ దివ్య కల్యాణ ఘట్టానికి చిరస్మరణగా ఆకాశరాజు నారాయణవనంలో ఈ ఆలయాన్ని నిర్మించారు.స్వామివారి వక్షస్థలంలో శ్రీ మహాలక్ష్మీదేవి కొలువై ఉండగా, ఆలయ ప్రాంగణంలో శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ గోదాదేవి అమ్మవార్ల సన్నిధులు భక్తులకు దర్శనమిస్తాయి. అలాగే శ్రీకోదండరామస్వామి,శ్రీరంగనాథస్వామి,శ్రీరాజమన్నార్స్వామిఉపాలయాలు ఈ క్షేత్ర మహిమను మరింత పెంచుతున్నాయి.

### మే 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయంలో మే 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పులు, పూజా సామగ్రి తదితరాలను పవిత్ర జలాలతో శుద్ధి చేస్తారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ తదితర సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన పవిత్ర ద్రావణాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేయనున్నారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పిస్తారు.

### బ్రహ్మోత్సవాల వాహనసేవలు

బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలపై స్వామి, అమ్మవారు విహరించి భక్తులను ఆశీర్వదించనున్నారు.మే 28న



ధ్వజారోహణం, పెద్దశేష వాహనం మే 29నచిన్నశేష వాహనం, హంస వాహనంమే 30న సింహ వాహనం, ముత్యపుపందిరి వాహనం

### మే 31నకల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం...

జూన్ 1నమోహినీ అవతారం, గరుడ వాహనంజూన్ 2న హనుమంత వాహనం, గజ వాహనంజూన్ 3నసూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం.జూన్ 4న రథోత్సవం, అశ్వవాహనం, కల్యాణోత్సవంజూన్ 5న చక్రస్నానం, ధ్వజావరోహణం జూన్ 4న స్వామివారి కల్యాణోత్సవం.జూన్ 4వ తేదీ రాత్రి 8.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం





నిర్వహించనున్నారు. రూ.1000/- టికెట్తో గృహస్తులు పాల్గొనవచ్చు. పాల్గొనే దంపతులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డు, ఒక వడ, కుంకుమను ప్రసాదంగా అందజేయనున్నారు.

### ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంగీత, హరికథ, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని టీటీడీ కోరింది.

# అర్ధగిరి ఆలయ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**బంగారుపాళెం, మే 14 మనం న్యూస్:** అర్ధగిరి ఆలయ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అర్ధగిరి ఆలయ అభివృద్ధిపై ఆలయబోర్డు సభ్యులుతో దేవాదాయ శాఖాధికారులు, పర్యాటక శాఖాధికారులు, డ్వామా,అటవీ శాఖాధికారులతో కలసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి కి సమర్పించిన వినతిపత్రంలో ఆలయ పరిసరాల్లో టాయిలెట్ బ్లాకులు,టూ కాంప్లెక్స్, అన్నదాన సత్రం, ప్లాంట్స్ పార్క్ తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి కార్యాలయం సమాచారం అందడంతో సంబంధిత శాఖల అధికారులతో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులను ఏ విధంగా అమలు చేయాలి, ఏ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి, నిధుల వినియోగం,కార్యాచరణ అంశాలపై సమగ్రంగా చర్చించి పలు సూచనలు చేశారు.అలాగే



అటవీ శాఖతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత అన్ని శాఖల అధికారులు కలిసి ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. జూన్ 15వ తేదీ నాటికి మరోసారి అన్ని శాఖల అధికారులు సమావేశమై అభివృద్ధి పనుల అమలుపై తుది నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అర్ధగిరి ఆలయ పరిసరాలను భక్తులకు మరింత సౌకర్యవంతంగా, పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా తెలిపారు.ఈ సమావేశంలో అర్ధగిరి బోర్డు సభ్యులతో పాటు పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్,డ్వామా పిడి రవికుమార్, టూరిజం అధికారి నరేంద్ర, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కే చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి గంగమ్మ జాతర కట్టుదిట్టమైన బద్రత



- కుప్పంలో 18నుంచి గంగమ్మ జాతర,ఏర్పాట్లును
- పరిశీలించిన : జిల్లాఎస్పీ తుషార్ డూడి

**కుప్పం మే 14 మనం న్యూస్:** కుప్పంలో ఈ నెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరగనున్న తిరుపతి గంగమ్మ జాతరకు కట్టుదిట్టమైన బద్రత ఏర్పాటు చేస్తామని చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. గురువారం కుప్పంలో పర్యటించిన ఎస్పీ గంగజారత.ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా గంగమ్మ దేవాలయాన్ని, ఇతర ప్రదేశాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ప్రతి సంవత్సరం కుప్పం నందు అంగరంగ వైభవంగా జరుగుతున్న గంగమ్మ జాతరకు సంబంధించిన ప్రాంతాలను జిల్లా ఎస్పీ ఆలయ అధికారులు, కుప్పం డి.ఎస్పీ పార్థసారధి తో కలిసి దేవాలయం, అగ్నిగుండం, బలిపీటం, ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్న ప్రాంతాలన్నీ పరిశీలించారు.ఈ సందర్భముగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఏటా కుప్పం నందు గంగమ్మ జాతర ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సం. కూడా జాతరకు తగిన పోలీస్ సిబ్బంది తో పాటు, అదనపు బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని మరియు ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ నియంత్రణ లో బాగంగా జాతర నిర్వహించే ప్రదేశాలలో ట్రాఫిక్ మళ్లింపు చేస్తామని తెలిపారు. పిక్ పాకెటింగ్, ఆకతాయిల వెకిలి చేష్టల నివారణకు నిష్ణాతులైన క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక క్రైమ్ బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచుతామని, అలాగే జాతర సందర్భంగా వచ్చే భక్తులకు మంచినీరు, వైద్యం సహాయ కేంద్రాలు, శౌచాలయాలు వంటి మౌలిక సదుపాయాలను స్థానిక అధికారుల సమన్వయంతో కల్పిస్తామని తెలిపారు. ఎవరైనా బాలల్ని కోల్పోతే లేదా ఏవైనా అత్యవసర పరిస్థితుల్లో సహాయం పొందేందుకు ప్రత్యేకంగా హెల్ప్డెస్క్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. జాతర ప్రాంతమంతటా సీసీ కెమెరాలు అమర్చి మానిటరింగ్ కోసం కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేస్తామని, డ్రోన్ కెమెరాలతో గగనతల నుండి కూడా నిఘా కొనసాగుతుందని అన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది 24 గంటల పాటు విధుల్లో నిబద్ధంగా పనిచేస్తారని తెలిపారు. జాతర సమయంలో ఎటువంటి చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా జాతర సజావుగా జరిగేల సహకరించాలని పట్టణ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ పి డా.తరుణ్ పహ్వా, కుప్పం రూరల్ ఇన్స్పెక్టర్ మల్లేష్ యాదవ్, ఎస్.బి. ఇన్స్పెక్టర్ మురళీమోహన్, ఆలయ చైర్మన్ రవిచంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారులు సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలి


- దేశ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అన్ని స్థాయిల్లో పొదుపు చర్యలు పాటించాలని పిలుపు
- చిత్తూరు ఎం.పి దగ్గుమల్ల ప్రసాద్ రావు
- ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద,10 కోట్లతో 66 ఎస్సీ గ్రామాలలో 437 పనులను చేశాం
- కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరుమే14 మనం న్యూస్:** ప్రభుత్వ పథకాల అమలులో ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా అధికారులు సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలి అని చిత్తూరు ఎంపి దగ్గుమల్ల ప్రసాద్ రావు పేర్కొన్నారు, గురువారం స్థానిక కలెక్టరేట్లోని నాగార్జున ఐఎఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాలు చిత్తూరు జిల్లా అభివృద్ధిపై దిశా కమిటీ సమీక్ష నిర్వహించారు, ఈ కార్యక్రమంలో



జడ్పీ చైర్మన్ జి.శ్రీనివాసులు,జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో ఖాళీగా వివిధ పోస్టులను నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 70 సంక్షేమ పథకాలన్నీ అర్హులైన లబ్ధిదారులకు ఆలస్యం లేకుండా చేరేలా చూడాలని జిల్లా యంత్రాంగం, అధికారులను కోరారు. ప్రతి పథకంలో నిధుల వినియోగం, పనుల అమలు, లబ్ధిదారుల వివరాలు తదితర అంశాల్లో స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమ తమ విభాగాల్లో సమగ్ర పర్యవేక్షణ చేపట్టి ఎటువంటి తారతమ్యాలే లేకుండా లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఎవరైనా ప్రశ్నించినా సమగ్ర వివరాలు అందించే విధంగా రికార్డులు, అమలు వ్యవస్థ ఉండాలని తెలిపారు.దేశ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చుల నియంత్రణ, పొదుపు చర్యలపై దృష్టి సారిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలలోనే కాకుండా కుటుంబ స్థాయిలో కూడా అనవసరమైన, ఖర్చులను తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఆహార వ్యర్థాన్ని నివారించడం ద్వారా గ్యాస్, ఇతర వనరుల వినియోగాన్ని తగ్గించవచ్చని సూచించారు. విదేశీ మారక నిల్వల పరిరక్షణ కోసం బంగారం కొనుగోళ్లు తగ్గించడం, ఇంధన పొదుపు కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి చర్యలు దేశ పరిస్థితులను సూచిస్తున్నాయని తెలిపారు. వచ్చే రోజులలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు జిల్లా స్థాయిలో అధికారులు ప్రజలకు మార్గనిర్దేశకులుగా వ్యవహరించాలని, పొదుపు చర్యలు, వనరుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు వ్యవసాయ అనుబంధ రంగాల అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నాయని వాటిపై విస్తృతంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు, భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , పేదవారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నారని ఆ ఫలాలను మీ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా మీ సేవలు అందజేయాలనిపేర్కొన్నారు.అనంతరం కలెక్టర్ వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఎంపీకి వివరించారు.జిల్లాలో ఉన్న సుమారు 3100 చెరువులకు సంబంధించిన శుభ్రపరిచే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ వివరించారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, విద్య, వైద్యం, విద్యుత్, సంక్షేమ శాఖల, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో పథకాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో, జడ్పీ సీఈఓ రవి కుమార్ నాయుడు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రాన్స్జెండర్ సంక్షేమ బోర్డు ఏర్పాటు



- రాయలసీమ ప్రాంత ప్రతినిధిగా తిరుపతి జిల్లా కలెక్టర్

**తిరుపతి, మే 14 మనం న్యూస్ :** రాష్ట్ర ట్రాన్స్జెండర్ సంక్షేమ బోర్డు తొలి సమావేశం అమరావతిలోని ఏపీ సెక్రటేరియట్ కాన్ఫరెన్స్ హాల్లో మంత్రి దోలా వీరాంజనేయ స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సెక్రటరీ ఎ. సూర్యకుమారి,తో పాటు వివిధ శాఖల అధికారులు, ట్రాన్స్జెండర్ ప్రతినిధులు పాల్గొనగా జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ గురువారం సాయంత్రం వర్చువల్ విధానంలో కలెక్టర్ బంగ్లా నుండి పాల్గొన్నారు. ట్రాన్స్జెండర్ వ్యక్తుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం,సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ట్రాన్స్జెండర్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసింది. ట్రాన్స్జెండర్ పర్సన్స్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్) యాక్ట్-2019 మరియు రూల్స్-2020 నిబంధనలను అనుసరించి జిఓయంఎస్ నెం,14,మేరకు ఏర్పాటు చేయబడిన బోర్డు రాయలసీమ ప్రతినిధిగా తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ కు సభ్యత్వం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ బోర్డు ఛైర్పర్సన్గా విభిన్న ప్రభావంతులు, ట్రాన్స్జెండర్ వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి దోలా వీరాంజనేయ స్వామి వ్యవహరిస్తుండగా, మెంబర్ సెక్రటరీగా మహిళలు, శిశువులు, విభిన్న ప్రభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి వ్యవహరిస్తారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ - రాయలసీమ ప్రాంత ప్రతినిధిగా, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ - ఆంధ్ర ప్రాంత ప్రతినిధిగా నియమించారు. ట్రాన్స్జెండర్ ప్రతినిధులుగా కోట ప్రేమ్ సాగర్ రాయ్, నక్కా జీవన్ కుమారి, బోను దుర్గ ఉన్నారు.ఈ బోర్డు ట్రాన్స్జెండర్ వ్యక్తుల సంక్షేమానికి సంబంధించిన పథకాలు, చట్టాలు, కార్యక్రమాల రూపకల్పనలో ప్రభుత్వానికి సలహాలు అందించడం, అమలు అవుతున్న సంక్షేమ పథకాల ప్రభావాన్ని మూల్యాంకనం చేయడం, వివిధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించడం, ట్రాన్స్జెండర్ వ్యక్తుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టడం ద్వారా రాష్ట్రంలోని ట్రాన్స్జెండర్ సమాజానికి సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో మరింత సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది.

# దేశ ఆర్థిక భద్రత కోసం ప్రతి కుటుంబం బాధ్యత తీసుకోవాలి

- దేశ ప్రధాని నరేంద్ర మోడీ సూచించిన పొదుపు సూత్రాలను పాటించాలి
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



**చిత్తూరు మే14 మనం న్యూస్:** ప్రపంచ రాజకీయ పరిస్థితులు రోజురోజుకూ ఉద్రిక్తంగా మారుతున్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నాయి. చమురు ధరల పెరుగుదల, దిగుమతి వ్యయాల భారము, మార్కెట్ అస్థిరత వంటి పరిణామాలు భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో దేశ ప్రజలు ముందుగానే జాగ్రత్తగా వ్యవహరించాలనే.. భారత ప్రధాని నరేంద్ర మోదీ సూచించిన పొదుపు సూత్రాలను పాటించి.. పొదుపు అనేది కేవలం కుటుంబ అవసరం కాదుఅది దేశ భద్రతకు కూడా ఆధారం అనే భావనను ఆయన ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. పశ్చిమాసియా సంక్షోభం.., పెరుగుతున్న ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ దేశవిదేశీ మారక నిల్వలను కాపాడేందుకు,ఇందన వినియోగాన్ని తగ్గించేందుకు కీలక పొదుపు సూత్రాలను ప్రకటించిన దరిమిలా..,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గ నిర్దేశంలో...మోడీ పిలుపునందుకున్నచిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.... దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను గురువారం చిత్తూరు ఎంపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మీడియాకు వెల్లడించారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.విద్యుత్ పొదుపు దేశానికి ప్రత్యక్ష సహాయం అవసరం లేని సమయంలో లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు ఆఫ్ చేయడం చిన్న విషయం అనిపించినా, కోట్లాది కుటుంబాలు అదే చేస్తే దేశ విద్యుత్ వినియోగ భారం గణనీయంగా తగ్గుతుంది. కాబట్టి విద్యుత్ పొదుపు అంటే పరోక్షంగా దేశ సంపదను కాపాడినట్లేనన్నారు. ఇంధన వినియోగంలో నియంత్రణ అవసరం.అవసరం లేని వాహన ప్రయాణాలు తగ్గించడం, ఒకే పనికి అనేకసార్లు బయటకు వెళ్లకుండా ప్లాన్ చేసుకోవడం,సాధ్యమైనంత వరకు పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ వినియోగించడం వంటి చర్యలు పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గిస్తాయి. భారత్ ఎక్కువగా విదేశీ చమురుపైనే ఆధారపడుతున్నందున ప్రతి చుక్క ఇంధనం విలువైనదేనని తెలిపారు.

# రూ.1.57 కోట్లతో 68 జల సంరక్షణ పనులు

- నీటి సంరక్షణ పనులతో మండలంలోని 3,612 ఎకరాలకు సాగునీటి లబ్ధి
- వెంబాకం, కొట్టాకాడు, నాగలాపురం, రాజులకండ్రిగ, సదాశివ శంకరాపురం
- పంచాయితీ రైతులకు సాగునీటి ప్రయోజనం
- జలధార-జలహారతితో రైతులకు రెట్టింపు ప్రయోజనం

**తిరుపతి మే14 మనం న్యూస్:** ఎండలతో నిర్జీవమైన నేల పై వర్షపు చినుకు పడితే ఎలా జీవం మేల్కొంటుందో ఇప్పుడు జలధార-జలహారతి పనులతో తిరుపతి జిల్లా గ్రామాల్లో అదే దృశ్యం కనిపిస్తోంది. పూడికతీతతో మళ్లీ ఊపిరి పీల్చుకుంటున్న కాలువలు, నిండుకుండలా మారే చెరువులు, పెరుగుతున్న భూగర్భ జలాలు రైతు జీవితాల్లో కొత్త ఆశల విత్తనాలు నాటుతున్నాయి. ప్రతి నీటి బొట్టును భవిష్యత్తుకు భద్రపరిచే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పనులు గ్రామీణ ప్రాంతాలకు సాగునీరు, ఉపాధి, ఆనందాన్ని ఒకేసారి అందిస్తున్నాయి.నాగలాపురం మండలంలో జలధార జలహారతి కార్యక్రమం క్రింద 1 కోటి 57 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 68 పనులకు పరిపాలనా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 26 ఫీడర్ కాలువల పునరుద్ధరణ, 20 పీల్ కాలువల పునరుద్ధరణ 6 చెక్ డ్యాంలలో పూడికతీత పనులు, 5 చెరువులలో పూడికతీత, 5 కందిత కందకాల నిర్మాణం, 6 నీటి కుంటలలో పూడికతీత పనులు చేపట్టనున్నారు. ఈ పనుల ద్వారా మండలంలోని 3,262 ఎకరాలకు లబ్ధి కలగనుంది. నాగలాపురం మండలంలోని రాజులకండ్రిగ గ్రామ పంచాయితీలో 60 మంది ఉపాధి హామీ వేతనదారులతో 1,000 మీటర్ల పొడవు, 3.0 మీటర్ల వెడల్పు వంక నుండి రాజులకండ్రిగ చెరువు, 50 మంది ఉపాధి హామీ వేతనదారులతో 1,000 మీటర్ల పొడవు, 3.0 మీటర్ల వెడల్పు అల్లపగుంట మిట్ట నుండి వజ్జవారికండ్రిగ చెరువు పూడికతీత పనులను రూ.5,17,519/- అంచనా విలువతో చేపడుతున్నారు. అటవీ ప్రాంతంలో కురిసే వర్షపు నీరు ఈ కాలువ ద్వారా రాజులకండ్రిగకు వెళ్తుంది. ఈ కాలువ పనులు చేపట్టడం ద్వారా రాజులకండ్రిగ పంచాయితీతో పాటు జానికాపురం, అనామతుకండ్రిగ, వజ్జవారికండ్రిగ ప్రాంతాలలోని రైతుల భూములకు సాగు నీరు అందనుంది. తద్వారా ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ, మామిడి, వరి పంటలకు నీరు సమృద్ధిగా




చేకూరుతుంది. చెరువు పరిధిలో 250 ఎకరాలకు సాగునీరు, 35 బోర్లు, 10 బావుల్లో భూగర్భ జలాల పెరుగుదల.. రాజులకండ్రిగ ఉపాధి హామీ వేతనదారుడు మాధవరాజు మాట్లాడుతూ జలధార-జలహారతి పథకం క్రింద తమ గ్రామంలో వంక నుండి రాజులకండ్రిగ చెరువు కాలువ పనులను చేస్తున్నామన్నారు. అల్లపగుంట మిట్ట నుండి వజ్జవారికండ్రిగ చెరువు వరకు ఈ కాలువ పని కొనసాగి రాజులకండ్రిగ చెరువులోకి ఈ నీరు చేరుతుందన్నారు. ఈ చెరువు క్రింద 250 ఎకరాల భూములకు సాగు నీరు, 35 బోర్లు, 10 బావులలో భూగర్భ జలాలు పెరిగి వ్యసాయానికి మేలు కలుగుతుందన్నారు. ఈ పని చేపట్టడం వలన రైతులందరికీ మేలు జరగడంతో పాటు నీటి ఎద్దడి ఏర్పడకుండా ఉంటుందన్నారు. ఈ పథకం ద్వారా తమకు ఉపాధి కల్పించే పనులు కల్పిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ కి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ధన్యవాదాలు తెలిపారు.

# తిరుపతిలో భక్తులకు టీటీడీ వసతి సౌకర్యాలు

- నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఆన్లైన్ బుకింగ్ సదుపాయం

**తిరుమల, మే14 మనం న్యూస్:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు ప్రతిరోజూ దేశ విదేశాల నుండి లక్షలాది మంది భక్తులు విచ్చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో విస్తృత స్థాయిలో వసతి, విశ్రాంతి, లాకర్, స్నాన, అన్నప్రసాదం, వైద్య తదితర సౌకర్యాలను టిటిడి అందుబాటులో ఉంచింది.భక్తుల కోసం తిరుపతిలో శ్రీనివాసం, విష్ణునివాసం, మాధవం, ఎస్వీ గెస్ట్ హౌస్, పద్మావతీ గెస్ట్ హౌస్, తిరుచానూరు తోళ్లప్ప గార్డెన్స్ వంటి వసతి సముదాయాలను టీటీడీ నిర్వహిస్తోంది. వీటితో పాటు డార్మిటరీలు, ఉచిత లాకర్లు, మరుగుదొడ్లు, స్నాన గదులు, ప్రథమ చికిత్స కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ఏసీ గదులను ఆన్ లైన్ మరియు రొటేషన్ విధానంలో భక్తులకు కేటాయిస్తున్నారు. నాన్ ఏసీ గదులను ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన కేటాయిస్తున్నారు.విష్ణునివాసం 2011లో ప్రారంభించిన విష్ణునివాసంలో 408 గదులు, 09 హాళ్లు, 706 లాకర్లు అందుబాటులో ఉన్నాయి. ఏసీ, నాన్ ఏసీ గదులను ఆన్లైన్ ,రొటేషన్ విధానంలో భక్తులకుకేటాయిస్తున్నారు.శ్రీనివాసం కాంప్లెక్స్2003లో ప్రారంభమైన శ్రీనివాసం కాంప్లెక్స్లో 552 గదులు, 09 డార్మిటరీలు, 1038 లాకర్లు ఉన్నాయి. ఏసీ, నాన్ ఏసీ, డీలక్స్ గదులు భక్తులకు అందుబాటులో ఉన్నాయి.మాధవం గెస్ట్ హౌస్ 2009లో ప్రారంభించిన మాధవం గెస్ట్ హౌస్లో 164 ఏసీ గదులు, డీలక్స్ సూట్లు ఉన్నాయి.ఎస్వీ గెస్ట్ హౌస్ 1955లో నిర్మించిన ఎస్వీ గెస్ట్ హౌస్లో ఏసీ, నాన్ ఏసీ కలిపి 31 గదులను భక్తులకు కేటాయిస్తున్నారు. ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన గదులను



కేటాయిస్తున్నారు.

### ఇతర వసతి కేంద్రాలు

రేణిగుంట సమాచార కేంద్రంలో 4 గదులు, 1 డార్మిటరీ, 18 లాకర్లు అందుబాటులో ఉన్నాయి. 2002లో ప్రారంభమైన భూదేవి కాంప్లెక్స్ లో 1 - డార్మిటరీ, 100 లాకర్లు ఉన్నాయి. తిరుచానూరు తోళ్లప్ప గార్డెన్స్లోని గెస్ట్ హౌస్ 1982లో భక్తులకు అందుబాటులోకి రాగా, అందులోని 30 గదులను ఆన్ లైన్ లో నిబంధనల ప్రకారం బుకింగ్ చేసుకోవచ్చు. తిరుపతి శ్రీ పద్మావతీ గెస్ట్ హౌస్ 1979లో భక్తులకు అందుబాటులోకి రాగా, అందులో ఉన్న 35 గదులు ప్రోటోకాల్ ప్రతినిధులకు కేటాయించబడుతున్నాయి. విష్ణునివాసం, శ్రీనివాసం, తోళ్లప్ప గార్డెన్స్లలో అన్నప్రసాదం సౌకర్యం కూడా భక్తులకు అందుబాటులో ఉంది. వీటితో పాటు శ్రీ గోవిందరాజ స్వామి సత్రాల స్థానంలో నిర్మిస్తున్న భవనాలు పూర్తి అయితే మరిన్ని వసతి గదులు, లాకర్లు, డార్మిటరీలు భక్తులకు అందుబాటులో రానున్నాయి.గదుల కేటాయింపు విధానంతిరుపతిలోని విష్ణునివాసంలో పరిమిత సంఖ్యలో గదుల కేటాయింపు కరెంట్ బుకింగ్ లో మినహా, తిరుపతిలోని మిగిలిన అన్ని చోట్ల నిబంధనల ప్రకారం ఆన్లైన్లో ముందస్తుగా భక్తులు బుక్ చేసుకోవాలి. ఒంటరి అవివాహిత స్త్రీ, పురుష జంటలకు గదులు కేటాయించబడవు. భక్తులు టీటీడీ కల్పిస్తున్న వసతి, లాకర్, విశ్రాంతి, అన్నప్రసాదాలు సదుపాయాలను వినియోగించుకుని స్వామివారి దర్శనాన్ని పూర్తి చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. దర్శనం అనంతరం గదులు, లాకర్లు వెంటనే ఖాళీ చేసి ఇతర భక్తులకు సహకరించాలని కోరుతోంది.

# ఎర్రకోట పేలుడు వెనుక 'ఆపరేషన్ హెవెన్లీ హింద్'..

## ఛార్జిషీట్‌లో కీలక విషయాలు



**ఢిల్లీ , మే 14:** గతేడాది యావత్ దేశాన్ని ఉలికిపాటుకు గురిచేసిన ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఇందులో కేసుకు సంబంధించిన పలు కీలక విషయాలను ప్రస్తావించింది. ఈ ఘటనలో నిందితులకు అల్‌ఖైదా అనుబంధ సంస్థతో సంబంధాలున్నాయని పేర్కొంది. 'ఆపరేషన్ హెవెన్లీ హింద్'లో భాగంగా నిందితులు ఈ పేలుడుకు పాల్పడినట్లు వెల్లడించింది.

2025 నవంబరు 10న దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 11 మంది మృతి చెందారు. ఈ కేసులో ఎన్ఐఏ 7500 పేజీల ఛార్జిషీట్‌ను రూపొందించి గురువారం ఢిల్లీ కోర్టుకు సమర్పించింది. ప్రధాన సూత్రధారి ఉమర్ ఉన్ నబీతో (పేలుడులో అతడు మరణించాడు) పాటు మొత్తం 10 మందిని నిందితులుగా చేర్చింది. దర్యాప్తులో భాగంగా జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీలో ఎన్ఐఏ సోదాలు జరిపింది. 588 మంది నుంచి వాంగ్మూలాలు నమోదు చేసింది. 395కు పైగా పత్రాలు, 200కు పైగా స్వాధీనం చేసుకున్న పరికరాల నుంచి సాక్ష్యాలు సేకరించినట్లు ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఈ పేలుడు వెనుక జిహాదీ కుట్ర కోణం ఉన్నట్లు ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలు స్పష్టంచేశాయని దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 11 మందిని అరెస్ట్ చేసింది.

అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్ కాంటినెంట్ అనుబంధ సంస్థ అన్సార్ గజ్వాతుల్ హింద్‌తో నిందితులకు సంబంధాలున్నాయని ఎన్ఐఏ తెలిపింది. వీరంతా 2022లో శ్రీనగర్‌లో సమావేశమయ్యారని, అక్కడే ఓ కొత్త ముఠాను ఏర్పాటుచేసినట్లు ఛార్జిషీట్‌లో పేర్కొంది. భారత్‌లో ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు వీరు కుట్రలు పన్నినట్లు దర్యాప్తులో గుర్తించింది. దీనికి 'ఆపరేషన్ హెవెన్లీ హింద్' అని పేరు పెట్టినట్లు తెలిపింది.

ఈ ఆపరేషన్‌లో భాగంగా నిందితులు ఉగ్ర కుట్రల కోసం కొత్త నియామకాలు చేపట్టారని, ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిల్వ చేసుకోవడంతో పాటు పేలుడు పదార్థాలను సొంతంగా తయారుచేసుకున్నట్లు ఎన్ఐఏ తెలిపింది. వైద్యవృత్తిలో ఉన్న నిందితులు వక్రమార్గం పట్టి తమ నైపుణ్యాలను పేలుడు పదార్థాల తయారీకి వినియోగించారు. తమ నివాస స్థలాలు, ల్యాబ్‌లను హబ్‌లుగా మార్చుకున్నారు. అత్యంత ప్రమాదకరమైన పేలుడు పదార్థంగా పేర్కొనే ట్రై అసిటోన్ ట్రైపెరాక్సైడ్ (టీఏటీపీ)ని కూడా వీరు ల్యాబ్‌లో తయారుచేసినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో గుర్తించింది. దీన్ని మదర్ ఆఫ్ సైతాన్‌గా పిలుస్తారు. జమ్మూకశ్మీర్‌తోపాటు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని భద్రతా స్థావరాలే లక్ష్యంగా దాడులు చేయాలని వీరు కుట్రలు చేసినట్లు ఎన్ఐఏ తెలిపింది. ఇందుకోసం రాకెట్లు, డ్రోన్ ఆధారిత ఐఈడీలతో ప్రయోగాలు కూడా చేసినట్లు ఛార్జిషీట్‌లో వెల్లడించింది.

# ఎన్నికల అనంతరం హింసపై విచారణ..

## నల్లకోటులో హైకోర్టుకు మమత



**కోల్‌కతా, మే 14:** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నల్ల కోటు ధరించి కలకత్తా హైకోర్టుకు వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో చోటు చేసుకున్న హింసాత్మక ఘర్షణలకు సంబంధించిన కేసుపై ఆమె స్వయంగా వాదనలు వినిపించనున్నారు. తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత, న్యాయవాది అయిన కల్యాణ్ బందోపాధ్యాయ్ కుమారుడు శిర్షన్య ఈ పిటిషన్ దాఖలు చేశారు.

మమత నల్ల కోటు ధరిస్తూ కోర్టుకు వస్తున్న దృశ్యాలను తృణమూల్ కాంగ్రెస్ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఇది ఆమె నిబద్ధతకు నిదర్శనంగా అభివర్ణించింది. 'బెంగాల్ ప్రజలకు అవసరమైన సమయంలో ఎప్పుడూ మమత వారికి అండగా నిలుస్తారు. సత్యం, న్యాయం, రాజ్యాంగ విలువల కోసం తన పోరాటానికి కట్టుబడి ఉంటారు. ద్వేషపూరిత రాజకీయాలకు అతీతంగా నిలుస్తారు. కరుణ, ధైర్యం, దృఢ విశ్వాసాన్ని ఆమె ప్రదర్శిస్తున్నారు. అన్యాయమైన సర్‌తోపాటు బీజేపీ అనాగరిక ప్రవర్తను ఆమె బలంగా వ్యతిరేకిస్తారు' అని ఆ పోస్టులో రాసుకొచ్చింది. కాగా.. ఎన్నికలకు ముందు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విచారణలో భాగంగా మమతాబెనర్జీ సుప్రీం కోర్టులో స్వయంగా వాదనలు వినిపించిన సంగతి తెలిసిందే.

# పంచదార ఎగుమతులపై కేంద్రం నిషేధం

## విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ ఉత్తర్వులు జారీ



**ఢిల్లీ , మే 14:** పంచదార ఎగుమతులపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఎగుమతులను తక్షణం నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దేశీయంగా చక్కెర ధరలు పెరగకుండా, సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ పరిధిలోని విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ముడి, తెల్ల, శుద్ధి చేసిన చక్కెరలకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టంచేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు లేదా తదుపరి ఆదేశాలు జారీ అయ్యేవరకు ఈ నిషేధం కొనసాగుతుందని తెలిపింది. అయితే, ఈ ఉత్తర్వులకు ముందే లోడింగ్ ప్రారంభమైనా, చక్కెర నిల్వలను కస్టమ్స్‌కు అప్పగించినా వాటి ఎగుమతులకు అనుమతిస్తామని వెల్లడించింది. కాగా.. ఇప్పటికే కుదిరిన ఒప్పందాల ప్రకారం ఐరోపా, అమెరికాకు ఈ ఎగుమతుల నిషేధం వర్తించదని ప్రభుత్వం పేర్కొంది.

# వికాస్ ఖన్నాకు అరుదైన గౌరవం



**న్యూయార్క్ ,మే 14:** ప్రముఖ పాకశాస్త్ర నిపుణుడు వికాస్ ఖన్నాకు న్యూయార్క్ ప్రభుత్వం ప్రత్యేక సత్కారం అందించింది. ఆసియాన్ అమెరికన్ అండ్ పసిఫిక్ ఐలాండర్ (ఏఏపీఐ) హెరిటేజ్ నెల సందర్భంగా ఆయన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ గౌరవం ప్రకటించారు. ఆల్బనీలో నిర్వహించిన కార్యక్రమంలో న్యూయార్క్ గవర్నర్ క్యాథీ హోచుల్ ప్రత్యేక ప్రశంసాపత్రం అందజేశారు. ఈ గౌరవం పొందిన తొలి భారతీయుడిగా వికాస్ ఖన్నా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, ఆహార సంప్రదాయాలను ప్రపంచానికి చేరవేయడం తన లక్ష్యమని చెప్పారు. అమృత్‌సర్‌కు చెందిన ఖన్నాను 2026 సంవత్సరానికి 'ప్రపంచంలో అత్యంత ప్రభావవంతులైన 100 మంది' జాబితాలో టైమ్ మ్యాగజీన్ ఇటీవల చేర్చింది.

# ఆ క్షణంలో నా అహం పూర్తిగా అణిగింది:రజనీకాంత్ భావోద్వేగం



**బెంగళూరు, మే 14:** సినీతారలు ఏదైనా కార్యక్రమానికి వెళ్తే ఆటోగ్రాఫ్, సెల్ఫీల కోసం అభిమానులు చుట్టుముడతారు. అలాంటివేమీ ఎదురుకాని క్షణంలో తనలోని అహమంతా అణిగిపోయిందని నటుడు రజనీకాంత్ వ్యాఖ్యానించారు. బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రం 45వ వార్షికోత్సవంలో భాగంగా 'వరల్డ్ మెడిటేట్స్ విత్ గురుదేవ్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ కేంద్రంలో తనకు ఎదురైన అనుభవాన్ని పంచుకున్నారు.

'హిమాలయాల తర్వాత నాకు ఎంతో ఇష్టమైన ప్రాంతం.. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆశ్రమం. ఓసారి ఇక్కడకు వచ్చినప్పుడు వేదికపైకి రమ్మని గురూజీ ఆహ్వానించారు. నేనొస్తే మీకు అసౌకర్యంగా ఉంటుందని చెప్పాను. అలాంటిదేమీ జరగదని గురూజీ చెప్పారు.

దాంతో వేదికపైకి వెళ్లా. అక్కడ వేలమంది ఉన్నారు. వారంతా నా ఆటోగ్రాఫ్, సెల్ఫీల కోసం చుట్టుముడతారనుకున్నా. ఎవరూ నన్ను పట్టించుకోలేదు. పైగా నేనే చేతులు ఊపినా వారెవరూ స్పందించలేదు' అంటూ వివరించారు. 'నా జీవితంలో ఎందరో నాయకులు, పారిశ్రామికవేత్తలను కలిశాను. ఇలాంటి అనుభవం ఎప్పుడూ కలగలేదు. ఆ క్షణంలో నాలోని అహమంతా అణిగిపోయింది. వారి దృష్టంతా గురూజీపైనే ఉంది. స్టార్డమ్ వస్తుంది.. పోతుంది. గురువుల స్థానం శాశ్వతం. ఈ శరీరం వీడిపోయినా వీరి ప్రభావం రెట్టింపు అవుతుంది తప్ప తగ్గదు' అని రజనీకాంత్ అన్నారు. రాజ్యాన్ని పాలించే రాజైనా గురువు ముందు మోకరిల్లాల్సిందేనని ఓ కథ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్ గురూజీతో పాటు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, కర్ణాటకకు చెందిన పలువురు క్రైస్తవ మతబోధకులు పాల్గొన్నారు.



# నెతన్యాహు మా దేశానికి రాలేదు

## 'రహస్య పర్యటన' నిరాధారం

### యూఏఈ అధికార మీడియా వెల్లడి

**అబుదాబి, మే 14:** పశ్చిమాసియా ఉద్రిక్తతల సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బుధవారం రహస్యంగా యూఏఈలో పర్యటించినట్లు వచ్చిన వార్తలు చర్చనీయాంశమయ్యాయి. అయితే, ఈ ప్రచారాన్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తోసిపుచ్చింది. నెతన్యాహునే కాదు.. ఇజ్రాయెల్ సైనిక బృందం కూడా తమ దేశంలో పర్యటించలేదని స్పష్టం చేసింది.

''ఇజ్రాయెల్‌తో మా సంబంధాలన్నీ బహిరంగమే. అబ్రహం ఒప్పందాల చట్టానికి లోబడే ఇరుదేశాల మధ్య సంబంధాలు కొనసాగుతున్నాయి. ఇందులో ఎలాంటి రహస్యాలు, నిగూఢ వ్యవహారాలకు తావులేదు. అందువల్ల.. యూఏఈ అధికారులు ప్రకటిస్తే తప్ప.. రహస్య పర్యటనలకు సంబంధించి వచ్చే వార్తలన్నీ నిరాధారమైనవే'' అని ఎమిరేట్స్ ప్రభుత్వం అధికారిక మీడియాలో వెల్లడించింది. ఈ పర్యటన గురించి నెతన్యాహు కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది. పర్యటన సందర్భంగా నెతన్యాహు, యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ను కలిసి విస్తృత చర్చల్లో పాల్గొన్నారని కార్యాలయం తెలిపింది. ఈ పర్యటన యూఏఈ, ఇజ్రాయెల్‌ల మధ్య సంబంధాలను పెను మలుపు తిప్పిందని స్పష్టం చేసింది. ఇరాన్ యుద్ధం వేళ ఈ ప్రచారం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఐటీ కంపెనీల్లో భారీగా లే ఆఫ్‌లు

## అమెజాన్. సిస్కో, లింక్డ్ఇన్ మరో రౌండు తొలగింపులు




**హైదరాబాద్, మే 14 :** ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి ఉద్యోగాల కోతలకు సిద్ధమవుతోంది. ఈసారి కంపెనీ సెల్లింగ్ పార్టనర్ సర్వీసెస్ విభాగంలోని కొంతమంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ధృవీకరించింది. ఈ విభాగం థర్డ్ పార్టీ విక్రేతలకు ఆన్బోర్డింగ్, లాజిస్టిక్స్, అకౌంట్ మేనేజ్మెంట్ వంటి కీలక సేవలను అందిస్తుంది. కంపెనీ ఖర్చులను తగ్గిస్తూ, కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా మార్చే ప్రయత్నాల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఈఓ యాండీ జెస్సీ తెలిపారు. ఎంతమందిని తొలగించనున్నదనే విషయంపై కంపెనీ స్పష్టత ఇవ్వలేదు. అమెజాన్ ఇప్పటికే వివిధ విభాగాల్లో దాదాపు 30 వేల ఉద్యోగాలను తొలగించిన సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా అమెజాన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగంలో ఎక్కువ పెట్టుబడులు పెడుతోంది. రిటైల్, లాజిస్టిక్స్, క్లౌడ్ సేవలు, ప్రకటనల విభాగాల్లో ఏఐ టూల్స్ వినియోగాన్ని కంపెనీ వేగంగా పెంచుతోంది. ఉద్యోగుల పనిలో ఆటోమేషన్ పెరగడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగాల సంఖ్య తగ్గే అవకాశం ఉందని జెస్సీ స్వయంగా చెప్పారు. ఈ లేఆఫ్ ప్రభావం భారత్లోని అమెజాన్ ఉద్యోగులపైనా పడనుంది. ముఖ్యంగా సపోర్ట్ ఆపరేషన్స్, అకౌంట్ మేనేజ్మెంట్, లాజిస్టిక్స్ బ్యాక్-ఎండ్ సేవల్లో పనిచేసే వారిపై ఉండొచ్చని సమాచారం. ఇదే బాటలో సిస్కో, లింక్డ్ఇన్ కంపెనీలు కూడా ఉద్యోగులను తొలగించే ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశాయి. నెట్వర్కింగ్ కంపెనీ సిస్కో ఏఐ, సైబర్ సెక్యూరిటీపై ఎక్కువ దృష్టి సారిస్తోంది. ఈ కారణంగా పాత విభాగాల్లోని వారిని తొలగించి, కొత్త సాంకేతికతపై పెట్టుబడి పెడుతోంది. దీంతో మొత్తం ఉద్యోగులలో సుమారు 5 శాతం (దాదాపు 4,000 మంది) తొలగిస్తున్నట్లు ప్రకటించింది. మైక్రోసాఫ్ట్ యాజమాన్యంలోని లింక్డ్ఇన్ కూడా సుమారు 5 శాతం మందిని (దాదాపు 875 మంది) తొలగిస్తోంది. మార్కెటింగ్, ఇంజనీరింగ్, ప్రొడక్ట్ టీమ్స్ లో ఉద్యోగుల కోతలు ఉండనున్నాయి.

# భగీరథ్‌ను రక్షించేదే రేవంత్

- ఆర్ఎస్ ప్రవీణ్ ఆరోపణలు

**హైదరాబాద్, మే 14 :** బండి భగీరథ్ ను రక్షించాలన్నదే రేవంత్రెడ్డి ఆలోచన అన్నట్లు కనిపిస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ అన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్లో మీడియాతో మాట్లాడారు. చట్టానికి వ్యతిరేకంగా బండి భగీరథ్ మామకు పోలీసులు నోటీసులు ఇచ్చారని అన్నారు. భగీరథ్కు నేర చరిత్ర ఉన్నదని.. తెలంగాణ మహిళా లోకానికి అతనితో ప్రమాదం పొంచి ఉన్నదని అన్నారు. భగీర్ప నమోదు అయిన పోక్సో కేసుపై పోలీసులు మీడియా సమావేశం ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. సీతక్క మీడియా సమావేశం ఏర్పాటు చేసి మహిళా లోకానికి తెలియజేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలి తల్లి తనతో మాట్లాడి ఆవేదనతో కొన్ని విషయాలు చెప్పుకున్నారని.. బాధితురాలి వ్యక్తిత్వాన్ని అడుగడుగునా నాశనం చేయాలని చూస్తున్నారని అన్నారు. ఆమెపై సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్నారని.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రితో కొట్లాట చేస్తానని ఆమె తనతో చెప్పిందన్నారు. మంత్రులు సీతక్క, కొండ సురేఖ డీజీపీతో మాట్లాడి బాధితురాలి ఫొటోలను సోషల్ మీడియా నుంచి వెంటనే తీసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కల్వకుంట్ల కవిత పార్టీ పెట్టినప్పుడు తెలంగాణకు అమ్మలా ఉంటానని చెప్పి మర మనిషిగా ఉంటున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అమ్మలా ఉండాలని అనుకుంటున్న కవిత, బాధితురాలి తల్లి బాధ ఒకసారి చూడాలని సూచించారు.

# ఒక్కరోజూ కాలేజీకి వెళ్లకుండానే డాక్టర్..

## 'నీట్ పేపర్ లీక్' నిందితుడి అక్రమాలు




**నాసిక్, మే 14:** సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. ఈ కేసులో కీలక నిందితుడైన మహారాష్ట్రలోని నాసిక్ 'డాక్టర్' శుభం ఖైర్నార్‌ను సీబీఐ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, అతడి గురించి కీలక విషయం బయటికొచ్చింది. స్థానికంగా డాక్టర్‌గా చలామణి అవుతోన్న శుభం.. ఒక్క రోజు కూడా వైద్యకళాశాలకు వెళ్లకపోవడం గమనార్హం.

శుభం స్వస్థలం నందగావ్. నాసిక్‌లోని అత్యంత రద్దీ అయిన కోచింగ్ కారిడార్‌లో 'ఎస్ఆర్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ'ని నిర్వహిస్తున్నాడు. ఈ కన్సల్టెన్సీ నేమ్ బోర్డుపై శుభం పేరు ముందు డాక్టర్ అని ఉంది. స్థానికంగానూ అతడు డాక్టర్‌గానే అందరికీ పరిచయం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీహెచ్ఎంఎస్ సహా ఇతర మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ప్రయత్నించే విద్యార్థులకు గైడెన్స్ ఇస్తుంటాడు. అయితే, 2021లో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ సమీపంలోని శ్రీ సత్యసాయి యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సుకు శుభం రిజిస్టర్ చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. దీని గురించి ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను సంప్రదించగా.. కీలక విషయాలు బయటికొచ్చాయి. కేవలం అడ్మిషన్ సమయంలోనే శుభం యూనివర్సిటీకి వచ్చాడని, ఆ తర్వాత ఏనాడూ క్లాసులకు హాజరుకాలేదని వీసీ చెప్పారు. పరీక్షలు కూడా రాయలేదని తెలిపారు.

ఈ నీట్ లీకేజీ వ్యవహారం తొలుత రాజస్థాన్‌లో బయటపడిన సంగతి తెలిసిందే. దీంతో తీగ లాగితే నాసిక్ నుంచే ఈ ప్రశ్నపత్నం లీకైనట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. నీట్ పేపర్‌ను శుభం తనకు తెలిసిన ఓ వ్యక్తి నుంచి రూ.10 లక్షలకు కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో తెలిసింది. కొరియర్‌లో వచ్చిన ఆ ప్రశ్నపత్రాన్ని శుభం పీడీఎఫ్ రూపంలోకి మార్చి వాట్సప్‌లో గురుగ్రామ్‌లోని ఓ వ్యక్తికి రూ.15లక్షలకు విక్రయించినట్లు అధికారులు గుర్తించారు. అక్కడి నుంచి ఈ పేపర్ రాజస్థాన్, జమ్మూకశ్మీర్, బిహార్, కేరళ తదితర రాష్ట్రాలకు చేరినట్లు తెలిపారు. పలువురు విద్యార్థులు రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేసినట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి.

నీట్ పేపర్ లీకేజీ దర్యాప్తులో శుభం గురించి తెలుసుకున్న రాజస్థాన్ పోలీసులు మహారాష్ట్ర అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అతడిని అరెస్ట్ చేసేందుకు నాసిక్ పోలీసులు రంగం సిద్ధం చేశారు. అయితే పేపర్ లీక్ బయటపడగానే శుభం తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. తనను ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు గుండు చేయించుకుని తిరిగాడు. ఈ క్రమంలో డిజిటల్ ఆధారాలను సేకరించిన పోలీసులు మంగళవారం శుభంను అరెస్ట్ చేశారు. అనంతరం సీబీఐ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు అప్పగించారు. నిందితుడి సోదరుడిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# కలవరపెడుతోన్న హంటా..

## వ్యాక్సిన్‌కు నిధుల కొరత



**శాంటియాగో, మే 14:** క్రూజ్ నౌక ఎంవీ హొండియస్లోని ప్రయాణికులు హంటావైరస్ బారిన పడటంతో ఇటీవల యావత్ ప్రపంచం ఉలిక్కిపడింది. శ్వాసకోశ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ఈ వైరస్ కారణంగా మరణాల రేటు కూడా అధికంగా ఉండటం భయాందోళనలు రేకెత్తించింది. ఈ వైరస్కు వ్యాక్సిన్ కూడా లేకపోవడంతో వ్యాప్తిని కట్టడి చేసే చికిత్సపై శాస్త్రవేత్తలు పరిశోధనలు ప్రారంభించారు. అయితే, హంటాకు దశాబ్దం క్రితమే వ్యాక్సిన్ రావాల్సి ఉండగా.. నిధుల కొరతతో నాటి ప్రయత్నాలు ఆగిపోయినట్లు తెలిసింది. ఈ మేరకు వ్యాక్సిన్ ప్రయోగాల్లో భాగమైన చిలీ శాస్త్రవేత్తలు అంతర్జాతీయ మీడియాతో నాటి తమ అనుభవాలను పంచుకున్నారు.

చిలీలోని ఓ యూనివర్సిటీలో వైరాలజీ శాస్త్రవేత్త మరియా జోస్ బరియా నేతృత్వంలోని బృందం హంటా వైరస్‌పై ప్రయోగాలు చేపట్టింది. ముఖ్యంగా మనుషుల నుంచి మనుషులకు సోకే ఆండిస్ అనే రకం హంటా వైరస్‌ను ఎదుర్కొనే యాంటీబాడీ సామర్థ్యాలపై ఈ శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపారు. ఈ క్రమంలోనే 2016లో వీరు తమ ప్రయోగాల్లో కీలక ముందడుగు సాధించారు. జంతువులపై ఈ యాంటీ బాడీలను పరీక్షించగా అవి సత్ఫలితాలనిచ్చాయి. తర్వాత మనుషులపై ప్రయోగాల కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ నిధుల కొరత కారణంగా ముందుకెళ్లలేకపోయామని శాస్త్రవేత్త మరియా జోస్ గుర్తుచేసుకున్నారు.

హ్యూమన్ ట్రయల్స్ కోసం దాదాపు 7 మిలియన్ డాలర్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు ఆమె తెలిపారు. నిధుల కోసం ఎన్నో అంతర్జాతీయ సంస్థలను సంప్రదించామని తెలిపారు. ఈ క్రమంలోనే కొవిడ్ మహమ్మారి వచ్చి తమ ప్రయత్నాలను ఆటంకం కలిగించిందని పేర్కొన్నారు. ఒకవేళ తక్షణమే నిధులు అందినా.. వ్యాక్సిన్‌పై ప్రయోగాలు పూర్తయ్యేందుకు కనీసం 12 నుంచి 24 నెలల సమయం పడుతుందని తెలిపారు.

సాధారణంగా ఈ హంటావైరస్‌లో 40 రకాలున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. వాటిని ఓల్ వరల్డ్, న్యూ వరల్డ్‌గా విభజించారు. న్యూ వరల్ వైరస్లు ఉత్తర, దక్షిణ అమెరికాల్లో ఎక్కువగా కనిపిస్తుంటాయి. చిలీలో ఏటా 40 నుంచి 60 కేసులు వెలుగుచూస్తున్నాయి. వీటిలో మరణాల రేటు 40శాతంగా ఉంటోంది. ఈ ఏడాది కూడా ఇప్పటికే 39 హంటా వైరస్ కేసులు నమోదు కాగా.. 13 మరణాలు సంభవించాయి. దక్షిణ అర్జెంటీనాలోనూ 42 కేసులు నమోదయ్యాయి. ఈ వైరస్ కారణంగా ఊపిరితిత్తుల్లో నీరు చేరడంతో పాటు కొన్నిసార్లు తీవ్ర పరిణామాలు తలెత్తవచ్చు.

ఇటీవల అర్జెంటీనా నుంచి బయల్దేరిన హొండియస్ నౌకలో పలువురు ఈ వైరస్ బారిన పడిన సంగతి తెలిసిందే. వీరిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ నౌకలో వెలుగు చూసింది ప్రమాదకర ఆండిస్ రకం హంటా వైరస్ అని అధికారులు నిర్ధరించారు. బాధితుడికి చాలా సన్నిహితంగా వచ్చినప్పుడు ఇది వ్యాపిస్తుంది.

# మాది రైతు పక్షపాతి ప్రభుత్వం



**రబీలో రైతులు పండించిన చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొంటాం**

**ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నాం**

**4600 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో వేశాం**

**రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

**నల్లగొండ-- మే 14( మనం ప్రతినిధి ):** దేశంలో వరి పండించడంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు.గురువారం నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి ఆయన నల్గొండ జిల్లా, కనగల్ మండలం చెట్ల చెన్నారం గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న అనంతరం అక్కడే రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రిమాట్లాడుతూ గడచిన రెండున్నర సంవత్సరాలలో అత్యధికంగా వరి పండించిన కొనుగోలు చేసిన రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు .ప్రతి రైతుకు మద్దతు ధర వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం 22 వేల కోట్ల రూపాయలను చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ రబీలో 65 లక్షల ఎకరాలలో 140 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని తెలిపారు. అందులో 80 నుండి 90 లక్షలు మెట్రిక్ టన్నులు ప్రభుత్వం కొనుగోలు చేయనుందని, ధాన్యంకొనుగోలుకై 18.67 కోట్ల గన్ని బ్యాగులను పిపిసి సెంటర్లకు పంపించినట్లు మంత్రి వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రతి సెంటర్తో పాటు, మండల ,నియోజకవర్గ స్థాయిలో అధికారులను నియమించామని ,ధాన్యం కొనుగోలుకు అన్ని రకాల వాహనాలను వినియోగించుకునేలా జిల్లా కలెక్టర్లకు విస్తృత అధికారాలు కల్పించామని ,రాష్ట్రవ్యాప్తంగా రబీ ధాన్యం కొనుగోలుకు 8575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ,ఇప్పటివరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని,4600 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్లలో జమ చేయడం జరిగిందని,రానున్న రెండు, మూడు రోజుల్లో మరో 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు పంపించడం జరుగుతుందని,అలాగే 3000 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయనున్నామని చెప్పారు. మూడు లక్షల 84,000 మంది రైతుల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రబీలో రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుందని ,అంతేకాక నిర్దేశించిన సమయంలో రైతుల ఖాతాలలో ధాన్యం డబ్బులు జమ చేయడం జరుగుతుందని, ట్రాన్స్పోర్ట్ ,హమాలి సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని, ఈసారి పెద్ద ఎత్తున పంట వచ్చిందని, రైతులకు కష్టం కలగకుండా రైతుల చెంతకే వచ్చి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొంటున్నట్లు వెల్లడించారు.రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ గతంలో కంటే ఈ రబీలో నల్గొండ జిల్లాలో అత్యధిక ధాన్యం పండిందని ,గతం తో పోలిస్తే 30000 మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా పండినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలులో ఏర్పడిన హమాలి, ట్రాన్స్పోర్ట్ సమస్యను పరిష్కరించడం జరిగిందని , బుధవారం ఒక్కరోజే నల్గొండ జిల్లాలో 19000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, రానున్న పది రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తామని తెలిపారు.

# ఇది రైతు ప్రభుత్వం కాదు



**తిరుమలగిరి, మే 14 (మనం న్యూస్):** రాష్ట్రం అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు ప్రభుత్వం కాదని రైతు వ్యతిరేక ప్రభుత్వం సిపిఎం సీనియర్ నాయకులు కడెం లింగయ్య గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఐకెపి సెంటర్ అధికారులు, వ్యవసాయ మార్కెట్ అధికారులపై తక్షణమే చర్య తీసు కోవాలని కోరారు. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ గత నాలుగు రోజుల నుండి సెలవు ప్రకటించడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ బందు చేయడం వల్ల దిక్కుతోచని స్థితిలో రైతులు, ఐకెపి కేంద్రాలలో ధాన్యం పోసి నెలలు గడుస్తున్నా ధాన్యం కాంటాలు కాక, లారీలు సక్రమంగా రాక రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మార్కెట్ యార్డులు ధాన్యం పోయడానికి స్థలం సరిపోక సెలవు ప్రకటించడా, వ్యవసాయ మార్కెట్ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతుందని అన్నారు. అధికారుల లోపం కమిషన్, ఖరీదారులు అధికారులు కుమ్మక్కె వారికి ఇష్టం వచ్చిన రీతిలో వ్యవసాయ మార్కెట్ నడిపిస్తుందని ఆరోపించారు. రైతులు ఐకెపి సెంటర్లో పోద్దామంటే కాంటాలు కావు మార్కెట్ లో అమ్ముదామంటే మార్కెట్లు సెలవు ఉంది ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నిస్తున్నారు. కష్టపడిన పంట చేతికొచ్చి అమ్ముకుందామంటే కొన్ని నాథుడు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వర్షాలు రైతులను భయపెడుతున్నాయని, ధాన్యాన్ని అమ్ముకొనే వరకు భయపడుతున్నారని చెప్పారు. మార్కెట్ సంబంధిత అధికారులు రైతుల సమస్యను అర్థం చేసుకొని తక్షణమే మార్కెట్ ను నడిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు లారీలను రప్పొంచి మార్కెట్ యార్డులోని మొక్కజొన్న రైతులకు ఐకెపి కేంద్రంలోని వరి ధాన్యాన్ని ఎగుమతి చేయాలని కోరారు. ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై తక్షణమే చర్య తీసుకోవాలని ఉన్నది అధికారులను కోరారు.

# చింతలపాలెంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం




**చింతలపాలెం, మే 14( మనం న్యూస్):** మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం - విద్యాశాఖ సూచన మేరకు చింతలపాలెం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మరియు ఎంఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం చింతలపాలెం మండల కేంద్రంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి పాల్గొని మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అలాగే తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వేములూరి రంగచారి, షేక్ సొందు, ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు, విఓఏలు, విద్యార్థుల తల్లితండ్రులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ



**కోదాడ, మే 14 (మనం న్యూస్):** హైద్రాబాద్ వాసి తెలంగాణ హైకోర్టు న్యాయవాది నకిరికంటి వెంకట లక్ష్మీ నరసింహారావు సతీమణి కాంతామణి జన్మదిన సందర్భంగా గురువారం కోదాడలోని శనగల రాధాకృష్ణ మానసిక వికలాంగుల కేంద్రంలోని విద్యార్థులకు అల్పాహారం, అరటి పండ్లు అందజేయడం అభినందనీయని పందిరి ఫౌండేషన్ గౌరవ సలహాదారు ఎస్ఎస్ రావు అన్నారు. కార్యక్రమానికి సహకరించిన నకిరికంటి సత్య కిరణ్ అర్చన దంపతులకు యస్ యస్ రావు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పందిరి ఫౌండేషన్ సభ్యులు సేకు రమేష్, మిట్టపల్లి నరసింహారావు, అనాధాశ్రమ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ప్రారంభం




**పాలకీడు మే 14 (మనం ప్రతినిధి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 14 వ తారీకు నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గురువారం మండల విద్యాధికారి కాటయ్య ఇంజమూరి తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... పాలకవీడు మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ప్రారంభించి గ్రామంలో ఇంటింటికి తిరగడం జరిగిందని,ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని ఇటీవలజరిగిన ఎస్ ఎస్ సి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ విద్యార్థులకు దీటుగా సత్తా చాటాలని విషయాన్ని గుర్తు చేశారు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మాలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేస్తూ సౌకర్యాలను మెరుగుపరుస్తుందని ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు అన్ని పోటీ పరీక్షలలో తమ సత్తా చాటుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఉచిత పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు ఉచిత యూనిఫాం పౌష్టికాహారంతో కూడినమధ్యాహ్న భోజనం అందిస్తున్నారని అదేవిధంగా ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు కావలసిన అనేక వస్తువులను సమకూర్చడమే కాకుండా పౌష్టికాహారాన్ని మెరుగుపరుస్తూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్తుందని పాఠశాలలో సౌకర్యాలను మెరుగుపరచడం తో పాటు డిజిటల్ బోధనను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఇంటరాక్టివ్ ఫ్లాట్ పైయానెల్స్ సహాయంతో ఉన్నత పాఠశాలలో బోధన అత్యున్నతంగా జరుగుతుందని, ప్రభుత్వపాఠశాలల బలోపేతానికి సమాజంలో ఉన్న పెద్దలు ప్రముఖులు యువకులు, రాజకీయ నాయకులు ముఖ్యంగా తల్లిదండ్రులుఅందరూ కూడా తమ యొక్క సహాయ సహకారాలను అందించాలని, నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వ పాఠశాలలకు ధీటుగాళ ఏమాత్రం తీసిపోకుండా పనిచేస్తున్నాయని, అత్యున్నతరహతలతో శిక్షణ పొందిన సుశిక్షితులైన ఉపాధ్యాయుల నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాల నడుస్తున్నాయని వీటిని ఆదరించి బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు.పాలకవీడు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి ఇంటింటికి తిరిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపించవలసిందిగా తల్లిదండ్రులను అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులుఉపేంద్రశ్రీనివాసరెడ్డి,స్వప్న,రహవ ఎతున్నీసా, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి దర్శనం టికెట్లు ఇప్పిస్తానంటూ భక్తులను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

- **భక్తులు అధికారిక టీటీడీ వెబ్సైట్ ద్వారానే దర్శనం, వసతి టికెట్లు పొందాలని జిల్లా ఎస్పీ సూచన**

**తిరుమల. మే14 మనం న్యూస్:** తిరుపతి జిల్లా ఎస్పీ. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి మురళీకృష్ణ ఐపీఎస్., పర్యవేక్షణలో అమాయక భక్తులను లక్ష్యంగా చేసుకుని శ్రీవారి దర్శనం టికెట్లు, వసతి గదులు ఏర్పాటు చేస్తాం అంటూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకున్నారు.ఈ క్రమంలో శ్రీవారి దర్శనం టికెట్లు ఇప్పిస్తానని భక్తులను నమ్మించి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిని తిరుమల టుటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు.దర్యాప్తులో భాగంగా పల్నాడు జిల్లా, పెద్దకూరపాడు మండలం, లింగంగుంట గ్రామానికి చెందిన బొడపాటి నవీన్ చౌదరి (33) అనే వ్యక్తి సోషల్ మీడియా, ఫోన్ కాల్స్ ద్వారా తనను టి.టి.డి ఉద్యోగిగా పరిచయం చేసుకుని, ఎంప్లాయిస్ కోటాలో శ్రీవారి ప్రత్యేక దర్శనం టికెట్లు ఇప్పిస్తానని భక్తులను నమ్మించినట్లు తేలింది. హైదరాబాద్కు చెందిన ప్రముఖ తెలుగు ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలో పనిచేస్తున్న సూర్యకళ అనే మహిళను నమ్మించి, ఈ సంవత్సరం మార్చి నెలలో ఆరుగురికి శ్రీవాణి దర్శనం టికెట్లు ఏర్పాటు చేస్తానని చెప్పి పలు దఫాలుగా యుపిఐ ద్వారా రూ.47,000/- తిరుమలకు వచ్చిన అనంతరం మరో రూ.18,000/- నగదు తీసుకుని మొత్తం రూ.65,000/- స్వీకరించి, ఎటువంటి దర్శనం టికెట్లు ఏర్పాటు చేయకుండా మోసం చేసినట్లు విచారణలో వెల్లడైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుమల టుటౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, ప్రత్యేక బృందం పల్నాడు జిల్లాలో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుంది. విచారణలో నిందితుడు తన నేరాన్ని ఒప్పుకున్నాడు.నిందితుడి వద్ద నుండి రూ.45,000/- నగదు, ఒక రెడ్మీ జీ కంపెనీ వైట్ కలర్ మొబైల్ ఫోన్ రెండు బ్యాంక్ పాస్బుక్కులు స్వాధీనం చేసుకున్నారు. మొబైల్ ఫోన్లోని యుపిఐ లావాదేవీలను పరిశీలించగా బాధితుల నుంచి నగదు



బదిలీ అయిన వివరాలు నిర్ధారణ అయ్యాయి.అలాగే నిందితుడి బ్యాంకు లావాదేవీలను పరిశీలించగా దాదాపు రూ.10 లక్షలకు పైగా లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. నిందితుడిపై 2021 నుండి 2026 మధ్య గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాలలో నాలుగు చీటింగ్ కేసులు నమోదై విచారణ ఎదుర్కొంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, అతని గత నేర చరిత్రను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం 15 రోజుల జ్యుడీషియల్ కస్టడీ (రిమాండ్) విధించారు. బొడపాటి నవీన్ చౌదరి, వయస్సు: 33 సంవత్సరాలు, లింగంగుంట గ్రామం, పెద్దకూరపాడు మండలం, పల్నాడు జిల్లా. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, మాట్లాడుతూ, భక్తుల అవసరాలను ఆసరాగా చేసుకుని దర్శనం టికెట్లు, వసతి, ప్రత్యేక ప్రవేశం పేరుతో సోషల్ మీడియా లేదా ఫోన్ కాల్స్ ద్వారా డబ్బులు డిమాండ్ చేసే వారిని నమ్మవద్దు. శ్రీవారి దర్శనం, వసతి టికెట్లు కేవలం అధికారిక టీటీడీ వెబ్సైట్,అనుమతించబడిన కేంద్రాల ద్వారా మాత్రమే పొందాలి.

మోసపూరిత ప్రకటనలు, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తులు లేదా లావాదేవీల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

# మీ బంగారం భద్రం..



- **అప్రమత్తతే రక్షణ కవచం**
- **ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు**

**శంఖవరం, మే 14, మనం ప్రతినిధి:** ఆభరణాల రక్షణలో ఏమరపాటు తగదని, పెరుగుతున్న బంగారం ధరల నేపథ్యంలో వ్యాపార సంస్థలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సూర్య అప్పారావు స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, పెద్దాపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారుల పర్యవేక్షణలో అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్యాంకులు, నగల దుకాణాలు మరియు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల నిర్వాహకులతో గురువారం ఒక ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ బి సూర్య అప్పారావు మాట్లాడుతూ, వినియోగదారుల నమ్మకమే పెట్టుబడిగా సాగే ఈ వ్యాపారాల్లో భద్రతా ప్రమాణాలు అత్యున్నత స్థాయిలో ఉండాలని సూచించారు. ప్రతి సంస్థ తప్పనిసరిగా అత్యాధునిక సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, ఏవైనా అనుమానాస్పద కదలికలు ఉంటే వెంటనే పసిగట్టేలా అలారం వ్యవస్థలను సిద్ధం ఆదేశించారు. చేసుకోవాలని కేవలం పరికరాలపైనే కాకుండా, రాత్రి సమయాల్లో నిరంతరం పహారా కాసే సెక్యూరిటీ గార్డుల నియామకం ద్వారా భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని ఆయన పేర్కొన్నారు.

# ఒక చేత్తో విధి మరో చేత్తో మాతృత్వం



- **బస్సు ప్రమాదంలో చిన్నారికి పాలిచ్చి మానవత్వం చాటుకున్న 108 ఈఎంటి టి.అమల**

**దేవరపల్లి మే 14 మనం ప్రతినిధి:** మండలంలోని యర్నగూడెం జాతీయ రహదారి పై గురువారం జరిగిన ఘోర బస్సు ప్రమాదం హృదయ విదారక దృశ్యాలకు వేదికైంది.ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా,మరో పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల అరుపులు,కుటుంబ సభ్యుల రోదనలు మధ్య చోటుచేసుకున్న ఓ మానవతా సంఘటన అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ప్రభుత్వ 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులకు అత్యవసర వైద్య సేవలు అందించారు.ఈ క్రమంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో పడివున్న ఓ తల్లి పక్కనే ఆమె చిన్నారి ఆకలితో ఏడుస్తూ సొమ్మసిల్లిపోయే పరిస్థితికి చేరుకుంది.తల్లి పరిస్థితిని అర్థం చేసుకోలేని ఆ చిన్నారి గుక్కపెట్టి ఏడవడం అక్కడున్న వారందరినీ కలచివేసింది.ఈ దృశ్యాన్ని చూసిన 108 అంబులెన్స్ ఈఎంటి (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) టి.అమల మానవత్వంతో స్పందించింది. ఒకవైపు తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూనే, మరోవైపు తల్లిగా స్పందించి ఆ చిన్నారిని తన ఒడిలోకి తీసుకుని పాలిచ్చి ఆకలి తీర్చింది.ప్రమాదం మధ్యలో చోటుచేసుకున్న ఈ మాతృత్వ ఘట్టం అందరినీ భావోద్వేగానికి గురిచేసింది. ఆ చిన్నారి పై అమల చూపిన ప్రేమ మానవత్వానికి స్థానికులు, ప్రయాణికులు,సహచర సిబ్బంది ప్రశంసలు కురిపించారు.ఉద్యోగి కావడం ఒక్కటే కాదు మానవత్వం ఉండాలి.అమల చేసిన పని ప్రతి తల్లికి గర్వకారణం అంటూ పలువురు అభినందించారు. ఈ సందర్భంగా అమల మాట్లాడుతూనేను ఉద్యోగినే కావచ్చు కానీ ముందుగా ఒక తల్లిని.ఒక వైపు తల్లి నిస్సహాయ స్థితిలో ఉండటం, మరోవైపు చిన్నారి ఆకలితో ఏడుస్తూ ఉండటం నా మనసును కలిచివేసింది.ఆ సమయంలో నాకు నా మాతృత్వమే గుర్తుకొచ్చింది. వెంటనే చిన్నారిని దగ్గరకు తీసుకుని పాలిచ్చి ఆకలి తీర్చాను.ఇలాంటి అదృష్టం అందరికీ రాదుఅని భావోద్వేగంగా తెలిపారు. విపత్తు సమయంలో విధి నిర్వహణతో పాటు మాతృత్వానికి నిలువెత్తు నిర్వచనంగా నిలిచిన అమల పై ప్రస్తుతం సోషల్ మీడియాలో కూడా ప్రశంసల వర్షం కురుస్తోంది.ఆమె చేసిన ఈ సేవ మానవత్వం ఇంకా బతికే ఉంది అనే నమ్మకాన్ని మరోసారి గుర్తు చేసింది.ఈ సందర్భంగా 108 జిల్లా అధికారి దాసరి రాజు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

# దుకాణాలవారు డ్రైన్లపై ఏర్పాటు చేసుకున్న బల్లలను వెంటనే తొలగించాలి



**ముమ్మిడివరం, మే 14, మనం న్యూస్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలోని ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ప్రతిఏటా డ్రైన్లో పూడిక తీసే ప్రక్రియ చేపట్టిన విధంగానే, పూడిక తీసే కార్యక్రమాన్ని నిర్వహించారు. పూడిక తీసిన పనిని పర్యవేక్షించే నిమిత్తం నగర పంచాయతీ కమిషనర్ పి రవివర్మ నగర పంచాయతీ పరిధిలో తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రవివర్మ దుకాణదారులతో మాట్లాడుతూ డ్రైన్లపై ఏర్పాటు చేసుకున్న బల్లలను వెంటనే తొలగించాలని,లేని పక్షంలో నగర పంచాయతీ ఆధ్వర్యంలో బల్లలను తొలగిస్తామని హెచ్చరించారు. డ్రైనుల వెంబడి గల దుకాణాల వారు పూర్తిగా తమ సహకారాన్ని నగర పంచాయతీ అధికారులకు, సిబ్బందికి అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ కవర్లు మరియు చెత్తను డ్రైనులలో వేయరాదని, డస్ట్ బిన్ లో వేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కమిషనర్ కోరారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఏఈ కే శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ మరియు శానిటేషన్ సెక్రటరీలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# భూ రీ సర్వే ప్రక్రియ వేగవంతం

**శంఖవరం/ఏలేశ్వరం మే 14 మనం ప్రతినిధి:** ప్రభుత్వం రైతుల భూ సమస్యల పరిష్కార దిశగా చేపడుతున్న భూ రీ సర్వే ప్రక్రియ ఏలేశ్వరం మున్సిపాలిటీ పరిధిలో మండల తాసిల్దార్ కుశరాజు సూచనలతో రెవిన్యూ శాఖ అధికారుల వేగవంతం చేశారు. ఏలేశ్వరం పట్టణ పరిధిలో రైతుల తమ వ్యవసాయ భూములు వివరాలు సంభందిత వి ఆర్ ఓ,లకు విధిగా అందించి రీ సర్వేకి సహరించాలని కోరారు. ఈ రీ సర్వే అనంతరం రైతులకు ల్యాండ్ పార్సిల్ మ్యాప్ ద్వారా తమ తమ భూములకు హక్కు పత్రాలు పభుత్వం అందిస్తుందని తెలిపారు.ఈ భూ రీ సర్వే ప్రక్రియ ఏలేశ్వరం మండలం పరిధిలో పలు గ్రామాల్లో ఇప్పటికే పూర్తి అయిందని, ఏలేశ్వరం నగర పంచాయతీలో రైతులు రెవెన్యూ అధికారులకు సహకరించాలని తాసిల్దార్ కుశరాజు కోరారు. ఈ కార్యక్రమంలో వి ఆర్ ఓ లు కొట్టేటి సత్యారావు, గండి వెంకట రమణ, రామలక్ష్మి వరలక్ష్మి అనిల్ మీరా సర్వేయర్ లు సత్యనారాయణ,అనిల్, రాజా బాబు, శ్రీను,ప్రసాద్ బాబు, కళ్యాణ శివ ప్రసాద్, దుర్గా ప్రసాద్, లుపాల్గొన్నారు



## అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి



ములుగు, మే 14(మనంన్యూస్): పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం గ్రామంలో సీఆర్ఆర్-ప్లెయిన్ నిధులతో 60.00 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్లు మరియు సిసి డ్రెయిన్స్ లను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క,ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ పి మనన్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి.,సంపత్ రావు, గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డిఓ వెంకటేష్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తహసిల్దార్, యంపిడిఓ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మద్దులపల్లిలో బడి బాట ర్యాలీ విజయవంతం




మహాదేవపూర్, మే14మనం న్యూస్: మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలోని తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నవిద్యావారోత్సవాలలో భాగంగా గురువారం మద్దులపల్లి ప్రాథమిక పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ పీటీమ్ మరియు బడి బాట ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల సరిత, ఏఏపిసి చైర్మన్ దేవిక ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదయ్యా విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ర్యాలీలో విద్యార్థులువిద్యప్రావఖ్యత పై నినాదాలు చేస్తూ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన మెగా పిటిఎంలో విద్యార్థుల చదువు, హాజరు, ప్రతిభపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తాం

**ప్రజా దర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన**

**ప్రజా దర్బార్ కార్యక్రమానికి హాజరైన 10 గ్రామాల ప్రజలు**

**రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**



కన్నాయిగూడెం, మే 14, మనం ప్రతినిధి: ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన ప్రతి సమస్య దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని, గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించడానికి స్థానిక గ్రామాలకే జిల్లా యంత్రాంగం కదిలి వస్తుందని, ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని, కన్నాయి గూడెం మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో 10 గ్రామాల ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం గ్రామంలోని నూతన గ్రామపంచాయతీ కార్యాలయం మైదానంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో తుపాకులగూడెం, లక్ష్మీపురం, రాజన్నపేట గ్రామాల ప్రజల నుంచి, ముప్పనపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో ముప్పనపల్లి, బుట్టాయిగూడెం, ఐలాపురం, చింతగూడెం, సర్వాయి, కంతనపల్లి, ఏటూరు గ్రామాల ప్రజల నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం గ్రామంలో 20 లక్షల అంచనా విలువతో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని, సి ఆర్ ఆర్ - ప్లెయిన్ నిధులతో 60 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయిన్స్ లను, ముప్పనపల్లి గ్రామంలో బోరే గూడెం నుండి ఎస్టి కాలనీ వరకు ఎస్ టి ఎస్ డి ఎఫ్ 145.00 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు, సి ఆర్ ఆర్ - ప్లెయిన్ నిధులతో 115.00 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అంతర్గత సిసి రోడ్లు, డ్రెయిన్స్ లను మంత్రి అనసూయ సీతక్క,ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి ప్రారంభించి, నూతన అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భాల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజల సమస్యలను వారి చెంతనే పరిష్కరించాలనే లక్ష్యంతో కన్నాయిగూడెం మండలంలో రెండు ప్రధాన కేంద్రాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. ముప్పనపల్లి, దేవాదుల లక్ష్మీపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా 10 గ్రామాల సర్పంచ్ లు ఆయా గ్రామాలకు కావలసిన అభివృద్ధి పనులు స్థానిక సమస్యలను వివరించడం జరిగిందని, గ్రామస్తుల నుంచి నేరుగా వారి సమస్యలను తెలుసుకుంటూ దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడం కోసం జిల్లా కేంద్రానికి దూరంగా, వెనుకబడిన ప్రాంతంగా ఉన్న కన్నాయిగూడెం మండల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బంది లేకుండా అధికారులే నేరుగా గ్రామాలకు తరలివచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. స్థానిక సర్పంచులు, ప్రజల నుంచి నేరుగా గ్రీవెన్స్ స్వీకరించి, సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కార మార్గాలను సూచించడం జరుగుతుందని, ఇతర సమస్యలు, సాంకేతిక ఇబ్బందులు ఉన్న సమస్యలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోడెద్దుల వలె కలిసి పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ పి మనన్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి.,సంపత్ రావు, గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డిఓ వెంకటేష్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తహసిల్దార్, యంపిడిఓ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మంచినీటి కొత్త మోటారును ఏర్పాటు చేయించిన సర్పంచ్



మహాదేవపూర్, మే14మనం న్యూస్: మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఏడవ వార్డు సంబంధించినవేసవిని దృష్టిలో ఉంచుకొని మంచినీటికి ఇబ్బందులు పడకుండా గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం మేరకు సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ ఆధ్వర్యంలో మంచినీటికి సంబంధించిన కొత్త మోటర్ ను పెట్టించడం జరిగింది దీంతో ఏడవ వాడు కాలనీ వాసుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి ఈరోజు మేము నమ్ముకొని ఎన్నికలలోగెలిపించుకున్నటువంటి మానాయకురాలు హసీనాబాను అక్బర్ ఖాన్ మరియు ఏడవవార్డు సభ్యులు చీర్లవంచ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మోటర్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం అని కాలనీ వాసులు చాలా సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ ఉప సర్పంచ్ శ్రీజ సంతోష్ మరియు వార్డు సభ్యులు గడ్డం స్వామి కొండపల్లి రాములు చీర్లవంచ చంద్రశేఖర్ సీనియర్ నాయకులు కడాల నాగరాజు శంషుద్దీన్ గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డ్ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.



## అభివృద్ధి బాటలో కర్రెగుట్టలు

**వేగంగా పూర్తవుతున్న రహదారి పనులు**

**కర్రెగుట్టల రోడ్ పనులను పరిశీలించిన సి ఆర్ పి ఎఫ్ అదనపు డైరెక్టర్**

ములుగు ,మే 14, మనం ప్రతినిధి: ములుగు జిల్లా - ఛత్తీస్గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలు ప్రాంతాన్ని ఈరోజు సి ఆర్ పి ఎఫ్ దక్షిణ జోన్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రవిదీప్ సింగ్ సాహి ములుగు జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్ ఐపీఎస్తో కలిసి సందర్శించి రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. కర్రెగుట్టల వంటి కఠినమైన భూభాగంలో వేగంగా జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా తడపాల కొండల వరకు రహదారి పనులు దాదాపు పూర్తికావడం పట్ల అభినందనలు తెలిపారు. మోరుమూరు నుండి పామునూరు, పామునూరు నుండి జెల్లా, జెల్లా నుండి డోలి, డోలి నుండి తడపాల కొండల వరకు రహదారి నిర్మాణ పనులు పూర్తికావడం విశేషమని పేర్కొన్నారు. అత్యంత క్లిష్టమైన అటవీ ప్రాంతంలో సైతం వేగవంతంగా రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసిన సిబ్బందిని అధికారులు అభినందించారు. ఈ రహదారుల నిర్మాణం ద్వారా స్థానిక గిరిజన ప్రజలకు రవాణా, వైద్య, విద్య మరియు అత్యవసర సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు.అనంతరం అధికారులు పామునూరు సీఆర్పీఎఫ్ క్యాంపును సందర్శించి భద్రతా పరమైన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భద్రతా బలగాల సమన్వయం, సరిహద్దు ప్రాంత భద్రత, మావోయిస్టు వ్యతిరేక చర్యలు మరియు అభివృద్ధి కార్యక్రమాల అమలుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రేంజ్ డీఐజీ అనిల్ మింజ్, 81 బెటాలియన్ కమాండెంట్ ముఖేష్ కుమార్ సింగ్ , 39 బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండ్ పంచం లాల్ మరియు జాంగ్వేర్ పాల్గొనగ స్థానిక పోలీస్ అధికారులైన వెంకటాపురం సీఐ ముత్యం రమేష్, వెంకటాపురం ఎస్ఐ తిరుపతి రావు తదితరులు రోడ్ పనులపై అధికారులకు వివరించారు.

## ప్రతి ఒక్క అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

- **ఓటరు జాబితా ప్రత్యేక సవరణను సమర్థవంతంగా అమలు చేయాలి**
- **ఓటరు జాబితా పారదర్శకంగా, కచ్చితత్వంగా రూపొందించాలి**
- **కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్**




ములుగు ,మే 14, మనం ప్రతినిధి: ఓటరు జాబితా ప్రత్యేక సవరణను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి ఒక్క అర్హుడికి ఓటు హక్కు కల్పించాలని, ఓటరు జాబితా పారదర్శకంగా కచ్చితత్వంగా రూపొందించాలని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్నారు. గురువారం భారత ఎన్నికల సంఘం కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, న్యూఢిల్లీ కార్యాలయం నుండి,ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై శిక్షణ కార్యక్రమం పై అన్ని రాష్ట్రాల చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్స్, జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ వీడియోసమావేశానికి ములుగు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలను నవీకరించేందుకు 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 3వ దశను అమలు చేస్తున్నట్లు భారత ఎన్నికల సంఘం 2026 మే 14న ప్రకటించిందని తెలిపారు. 2026 మే 30 నుండి అక్టోబర్ 14 వరకు, 3.94 లక్షలకు పైగా బూత్ స్థాయి అధికారులు సుమారు 36.73 కోట్ల మంది ఓటర్ల ఇంటింటి ధ్రువీకరించనున్నట్లు పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ఓటరు జాబితాలను శుద్ధి చేసి ఖచ్చితత్వాన్ని పెంపొందించడం లక్ష్యంగా భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ బి రివిజన్ పై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన ఓటర్ల తొలగింపు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్ల తొలగింపు, ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉంటే వాటి గుర్తింపు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించడం జరిగిందన్నారు.అధికారులు గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించేందుకు బూత్ లెవెల్ ఆఫీసర్స్ కు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా పోలింగ్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఓటర్లకు ప్రత్యేక ఎన్యుమేషన్ ఫారమ్స్ అందజేసి వారి వివరాలను ధృవీకరించనున్నట్లు వెల్లడించారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫామ్-6, తొలగింపుల కోసం ఫామ్-7, సవరణలు, మార్పుల కోసం ఫామ్-8 వినియోగించాలని సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో చోటు పొందేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు.జిల్లా స్థాయిలలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తాహసిల్దార్ నితీష్ కుమార్, ఐటీ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం రైతులదోపిడిని ఆపాలి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- **రాష్ట్రంలో మహిళలపై జరుగుచున్న అరాచకాలపై స్పందించాలి**
- **అగ్రకుల దిశపై స్పందించినట్లు ఇప్పుడు మహిళా సంక్షేమ శాఖ మంత్రి స్పందించాలి**
- **బండి భగీరథ్‌ను అరెస్టుచేసి శిక్షించాలి**
- **లంబాడీ న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు దేవా నాయక్ డిమాండ్**



రాష్ట్రం లో రైతు ఎంతో కష్టపడి పండించిన వరి మొక్కజొన్నలు కొనడంలో ప్రభుత్వం విఫలమైందని దేవా నాయక్ అరోపిస్తున్నారు అకాల వర్షాలు కురుస్తూ పండించిన పంటలు నీటిపాలు అవుతున్నా ప్రభుత్వం తనకేమీ పట్టనట్లు గా వ్యవహరించడం బాధాకరం రైతు కన్నీటి గోస తాకి ప్రభుత్వం పోతుందని ఇప్పటికే రైతుకు గిట్టుబాటు ధర లేక హరికోస పడుచుంటే తమాషా చూస్తున్నారు వ్యాపారస్తులు ప్రభుత్వ సంస్థలు రైతు వద్ద క్వింటాలుకు 4నుండి 8కిలోల వరకు తరుగు పేరుతో దోచుకుంటున్నారని ఇది మంత్రికి కనబడుట లేదా వినబడుట లేదా అని దేవా నాయక్ విచారం వ్యక్తం చేశారు ప్రభుత్వం. ఇప్పటికైనా స్పందించి రైతు సమస్యలు పట్టించుకోవాలని తరుగు పేరుతో చేసే దోపిడీని ఆపాలని డిమాండ్ చేశారు ప్రతి మంత్రిత్వ శాఖ బాధ్యత గా వ్యవహరించాలని తను అధికారంలో లేనప్పుడు మహిళల కు అవమానం జరిగినప్పుడు పెగిలిన గొంతుక ఇప్పుడు ఎందుకు మూగ బోయిందని కేంద్ర మంత్రి కుమారుడు అంటే మంత్రి కి అంత బయమేందుకని దేవా నాయక్ నిల దీశారు పేదవారికి ఒక న్యాయం కేంద్రమంత్రికి ఒక న్యాయమా ఒక మహిళకు జరిగిన అవమానం పై రాష్ట్ర మంత్రి ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రభుత్వం పై దుమ్మెత్తి పోస్తున్నారు కదా అయినా ఎందుకు ఒక మహిళగా మంత్రిగా ఎందుకు నోరు మెదపడం లేదని దేవా నాయక్ దుయ్యబట్టారు రైతులు ఏడ్చినా మహిళలు కన్నీళ్లు పెట్టినా వారి గోస తాకి పోవడం ఖాయం అని దేవా నాయక్ హెచ్చరించారు.



## గృహప్రవేశం ఓ అద్భుత ఘట్టం

- **తెలంగాణ శ్రీనివాస్ నాయక్**

మహబూబాబాద్ జిల్లా 14 న్యూస్ : గుండెగ గ్రామానికి చెందిన బోడ జయేంద్ర కవిత గృహప్రవేశ కార్యక్రమానికి సామాజిక జాతీయ భావం గల ఉద్యమ నేత, నర్సంపేట కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి తెలంగాణ శ్రీనివాస్ నాయక్ హాజరై గృహప్రవేశం ఒక అద్భుత ఘట్టమని... అంతేకాదు ఆ సర్వోన్నతుడి అనుగ్రహం, ఆశీర్వాదం తో ఇంటిని రక్షించడానికి సానుకూల శక్తితో నింపడానికి నిర్వహించే పవిత్రమైన కార్యమని, మూడు కోట్ల దేవతలు మీ గృహంలోకి విచ్చేసే అద్భుతమైన పవిత్ర ముహూర్త కార్యక్రమం అని తెలంగాణ శ్రీనివాస్ నాయక్ కొని ఆడారు ఈ కార్యక్రమంలో బోడ సుధాకర్ నాయక్, మోహన్ నాయక్, సునీత, మంజుల, బానోతు రవి నాయక్, లచ్చి, రఘు చంద్రశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సక్రమహాజరుకు సహకరించండి



- **ప్రిన్సిపల్ జన్ను విజయ్ కుమార్**

మహాదేవపూర్ మే 14మనం న్యూస్: మహాదేవపూర్ మండల కేంద్రంలోనిప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహాదేవపూర్లో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా నాలుగోరోజువిద్యార్థులతల్లిదండ్రుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జన్ను విజయ్ కుమార్ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు సక్రమంగా కళాశాలకుహాజరవడం ద్వారా విద్యపై ఆసక్తి, క్రమశిక్షణ పెరుగుతాయని తెలిపారు.సక్రమ హాజరు వల్ల పాఠ్యాంశాలను పూర్తిగాఅర్థంచేసుకొనిపరీక్షల్లోమంచిఫలితాలు సాధించడమే కాకుండా, దేశకాల పరిస్థితులపై సరైన అవగాహన కలిగిసమాజంలో బాధ్యతగలపౌరులుగాఎదుగుతారని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంలో విద్యార్థుల హాజరు ముఖ్య పాత్ర పోషిస్తుందని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని అలాగే 2026-2027 విద్యా సంవత్సరంలో మన కళాశాలలో ఎక్కువ అడ్మిషన్లు జరిగేందుకు తల్లిదండ్రులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు అనంతరం పూర్వ విద్యార్థులతో కళాశాల పరిస్థితులపై చర్చించారు, కళాశాల అడ్మిషన్లు పెంచేందుకు సహకరించాలని ఈ కళాశాలను 10 కాలాలపాటు కాపాడుకోవాల్సిన అవసరంఎంతో ఉందని తెలియజేశారు,ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు,కళాశాలఅధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జిల్లా కలెక్టర్‌ని కలిసిన మాజీ ఎంపి అజ్మీరా సీతారాం నాయక్



ములుగు జిల్లా మే 14 న్యూస్: ములుగు జిల్లాకి నూతనంగా విచ్చేసినటువంటి కలెక్టర్ భోర్కడే హేమంత్ వాసుదేవరావు ని మాజీ మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతం అయినటువంటి ములుగు జిల్లాలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాబోయే రోజుల్లో ములుగు జిల్లాని ఉన్నత స్థాయిలో అభివృద్ధి చేయడానికి కలిసి పనిచెయ్యాలని వారు కోరడం జరిగింది. కలెక్టర్ తప్పకుండా ములుగు జిల్లాలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీర సీతారాం నాయక్ చెప్పడం జరిగింది.

# బడిబాట ప్రారంభం




మహాదేవపూర్, మే14మనం న్యూస్: తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలలో భాగంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్కుమార్తల్లిదండ్రులసమావేశం నిర్వహించి ప్రొ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ బడిబాట ర్యాలీ తీశారు.ఈర్యాలీలో ప్రైవేట్ వద్దు సర్కార్ బడి ముద్దు అని నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ శ్రీ కోట రాజబాపు పాల్గొని ప్రభుత్వ బడి యొక్క గొప్పతనం గ్రామస్తులకు వివరించారు.అందరు తమ తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని అన్నారు.ఈ విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థులకు 21 వస్తువులతో స్కూల్ కిట్ అందించనున్నారు.మా బడిలో చేరిన విద్యార్థులను పట్టుదలతో చదివించి అత్యుత్తమ ఫలితాలు తెస్తామని ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకరెడ్డి,తిరుపతిరెడ్డి,రాజయ్యసిరంగి రమేష్,లచ్చయ్య, అనిల్ కుమార్ షాజహా,వెంకటేశ్వర్లు,ప్రాథమికపాఠశాలప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు మల్లేశం,సీఆర్పీ మహేష్, గ్రామస్తులు ప్రజలు నాయకులు పాల్గొన్నారు.




# ఆ రెండు ఖరారైనట్టే

## మిగిలిన రెండు స్థానాల్లో ఎవరికో ఆ ఛాన్స్ ?

పది జట్లు తలపడుతున్న ఐపీఎల్ పందొమ్మిదో ఎడిషన్ లీగ్ స్టేజ్ మ్యాచులు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. ఇప్పటికే 57 మ్యాచులు అయిపోయాయి. ఇక మిగిలినవి కేవలం 13 లీగ్ మ్యాచులే. ఇవే ప్లేఆఫ్స్ లో ఉండే టాప్-4 జట్లను డిసైడ్ చేసేవి. నాకౌట్ కు చేరుకుందామనుకొనే టీమ్ లకు గండి పడేదీ ఇక్కడే. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (16), గుజరాత్ టైటాన్స్ (16), సన్ రైజర్స్ హైదరాబాద్ (14), పంజాబ్ కింగ్స్ (13) తొలి నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నాయి. చెన్నై సూపర్ కింగ్స్ (12), రాజస్థాన్ రాయల్స్ (12) కూడా ప్లేఆఫ్స్ రేసులో మేమున్నామంటూ హెచ్చరించాయి. దిల్లీ క్యాపిటల్స్ (10), కోల్ కతా నైట్ రైడర్స్ (9) సాంకేతికంగా మాత్రమే బరిలో ఉన్నాయి. ముంబయి, లఖ్ నవూ ఎప్పుడో దుకాణం సర్దేశాయి.



● బెంగళూరు (16): 12 మ్యాచుల్లో 8 విజయాలు, నాలుగు ఓటములతో 16 పాయింట్లను తన ఖాతాలో వేసుకుంది. పట్టికలో అగ్రస్థానం ఈ జట్టుదే. ఈ జట్టుకు నాకౌట్ బెర్తు దాదాపు ఖరారు అయినట్లే. మిగిలిన రెండింట్లో ఒక్కటి గెలిచినా.. ప్లేఆఫ్స్ ఫిక్స్ అయిపోతుంది. రెండూ గెలిస్తే టాప్ -2లో స్థానం ఖరారవుతుంది. పంజాబ్ తో మే 17న, సన్ రైజర్స్ తో మే 22న తలపడనుంది.

● గుజరాత్ (16): ఆర్సీబీ పరిస్థితే గుజరాత్ కూ ఉంది. నెట్ రన్ రేట్ లో బెంగళూరు (+1.053) కంటే గుజరాత్ (+0.551) తక్కువగా ఉంది. జీటీ కూడా 12లో 8 మ్యాచుల్లో గెలిచి.. మరో నాలుగింట్లో ఓడింది. తదుపరి రెండు మ్యాచుల్లో గెలిస్తే టాప్-2లో ఉండటం ఖాయం. ఒక్కదాంట్లో విజయం సాధిస్తే ప్లేఆఫ్స్ బెర్తు ఖరారు. కోల్ కతాతో మే 16న, సీఎస్ కేతో మే 21న ఢీకొట్టనుంది.

● సన్‌రైజర్స్ (14): గత మ్యాచ్ లో ఓడిపోవడంతో మూడో స్థానానికి పడిపోయింది. 12 మ్యాచుల్లో ఏడు గెలిచి.. మరో ఐదింట్లో ఓడింది. మిగిలిన రెండింట్లోనూ గెలిస్తే ప్లేఆఫ్స్ కు చేరుకుంటుంది. అలా కాకుండా.. ఒక్క మ్యాచ్ లోనే విజయం సాధిస్తే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. సీఎస్కేతో మే 18న, ఆర్సీబీతో మే 22న తలపడనుంది.

● పంజాబ్ కింగ్స్ (13): వరుసగా నాలుగు మ్యాచుల్లో ఓడి అగ్రస్థానం నుంచి కిందికి పడిపోయిన టీమ్ పంజాబ్. 11 మ్యాచుల్లో ఆరింట్లో గెలిచింది. ప్రస్తుతం ఆ జట్టు ఖాతాలో 13 పాయింట్లు మాత్రమే ఉన్నాయి. మిగతా మూడు గెలిస్తే ఎలాంటి సమస్య లేకుండా ప్లేఆఫ్స్ కు చేరుకుంటుంది. ఒకవేళ ఒక్కటి తగ్గినా కాస్త ఇబ్బందుల్లో పడినట్లే. ముంబయితో మే 14న, ఆర్సీబీతో మే 17న, ఎల్ఎస్ జీతో మే 23న తలపడనుంది.

● సీఎస్కే - రాజస్థాన్ (12): మిగతా మూడు మ్యాచుల్లో గెలిస్తేనే ప్లేఆఫ్స్ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒక్క దాంట్లో ఓడినా కష్టాలు తప్పవు. సీఎస్కే (+0.185) కంటే రాజస్థాన్ (+0.082) నెట్ రన్ రేట్ కాస్త తక్కువగా ఉంది. ప్రస్తుతం 11 మ్యాచుల్లో ఆరేసి విజయాలు నమోదుచేసిన సీఎస్కే, ఆర్ఆర్.. 12 పాయింట్లతో కొనసాగుతున్నాయి. ఎల్ఎస్ జీతో మే 15న, సన్ రైజర్స్ తో మే 18న, జీటీతో మే 21న సీఎస్కే.. డీసీతో మే 17న, ఎల్ఎస్ జీతో మే 19న, ముంబయితో మే 24న రాజస్థాన్ తలపడతాయి.

● దిల్లీ క్యాపిటల్స్ (10): ఈ జట్టుకు ప్లేఆఫ్స్ అవకాశాలు చాలా కష్టమే. ఇప్పటికే 12 మ్యాచులు ఆడిన డీసీ ఐదు విజయాలను మాత్రమే నమోదు చేసింది. మిగిలిన రెండింట్లో గెలిచినా నాకౌట్కు చేరుకుంటుందనే భరోసా లేదు. ఇక నెట్రన్రేట్ (-0.993) కూడా బాగోలేదు. ఆర్ఆర్ తో మే 17న, కేకేఆర్ తో మే 24న ఢీకొట్టనుంది.

● కేకేఆర్ (9): ఇది కూడా దిల్లీలా సాంకేతికంగా మాత్రమే ప్లేఆఫ్స్ రేసులో ఉంది. అయితే, ఆ జట్టు కంటే ఒక్క మ్యాచ్ తక్కువ ఆడింది. ప్రస్తుతం కోల్ కతా 11 మ్యాచుల్లో 4 విజయాలు, 6 ఓటములు, ఒక మ్యాచ్ రద్దుతో 9 పాయింట్లను తన ఖాతాలో వేసుకుంది. మిగతా మూడింట్లో గెలిచినా.. ఇతర జట్ల సమీకరణాలపై ఆధారపడాల్సిందే. ఇక ఒక్కటి ఓడినా.. ఇంటిముఖం పట్టినట్లే. జీటీతో మే 16న, ముంబయితో మే 20న, డీసీతో మే 24న తలపడనుంది.

## భారత జట్టు ప్రకటన.. వైభవ్ సూర్యవంశీకి ఛాన్స్



ఈ ఏడాది జూన్ లో శ్రీలంకలో జరగనున్న వన్డే ట్రై-సిరీస్ కోసం 15 మంది సభ్యులతో కూడిన భారత 'ఎ' జట్టును బీసీసీఐ ప్రకటించింది. ఈ జట్టు కెప్టెన్ గా హైదరాబాదీ తిలక్ వర్మ ఎంపికయ్యాడు. అతడి డిప్యూటీగా అస్సాం ఆటగాడు రియాన్ పరాగ్ వ్యవహరించనున్నాడు. ఇక ఈ జట్టులో రాజస్తాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కింది. వైభవ్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్ లో ఉన్నాడు. ఐపీఎల్-2026లో ఈ చిచ్చర పిడుగు దుమ్ములేపుతున్నాడు. ఇప్పటివరకు 11 ఇన్నింగ్స్ లలో 236.56 స్ట్రైక్-రేట్ తో 440 పరుగులు సాధించాడు.

ఇందులో ఏకంగా 40 సిక్సర్లే ఉన్నాయి. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన అండర్-19 ప్రపంచకప్ లో కూడా వైభవ్ అదరగొట్టాడు. ఇంగ్లండ్ తో జరిగిన ఫైనల్లో 175 పరుగులు సాధించి భారత్ ను ఛాంపియన్ గా నిలిపాడు. ఈ క్రమంలోనే అతడికి ఇండియా-ఎ జట్టులో చోటు లభించింది. అదేవిధంగా ఐపీఎల్ లో రాణిస్తున్న ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్ సిమ్రన్ సింగ్, అన్షుల్ కంబోజ్, సూర్యాంశ్ షెడ్గే వంటి ఆటగాళ్లు కూడా ఈ జట్టులో ఉన్నారు. ఈ టోర్నమెంట్ లో శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్ 'ఎ' జట్లతో ఇండియా-ఎ జట్టు తలపడనుంది. ఈ ట్రై-సిరీస్ జూన్ 9 నుంచి ప్రారంభం కానుంది. ఈ టోర్నీ డబుల్ రౌండ్-రాబిన్ ఫార్మాట్ లో జరగనుంది. , జూన్ 21న జరిగే ఫైనల్ లో అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు తలపడనున్నాయి. ఆ తర్వాత ఇండియా 'ఎ' జట్టు శ్రీలంక 'ఎ'తో రెండు మల్టీ-డే మ్యాచ్ లు కూడా ఆడనుంది. వైట్-బాల్ సిరీస్ దంబుల్లాలో, రెడ్-బాల్ మ్యాచ్ లు గాలే వేదికగా జరగనున్నాయి.

భారత-ఎ జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), ప్రియాంష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్ (వైస్ కెప్టెన్), ఆయుష్ బదోని, నిశాంత్ సింధు, హర్ష్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, ప్రభ్ సిమ్రాన్ సింగ్, కుమార్ కుషాగ్రా (వికెట్ కీపర్), విప్రజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్వీర్ సింగ్, అన్షుల్ కాంబోజ్, అర్షద్ ఖాన్

## ఇష్టపడకపోతే.. మరింత కష్టపడతా!



నాతో మంచి స్నేహం కుదరాలంటే కనీసం నాలుగుసార్లు అయినా కలిసి మాట్లాడాలి అంటోంది బాలీవుడ్ హీరోయిన్ సారా అలీఖాన్. అంతేకాదు కెరీర్ లో నెగిటివిటీని పట్టించుకోకుండా.. ప్రేక్షకులు ఆదరించే వరకు కష్టపడతానని చెప్పుకొచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సారా మాట్లాడుతూ.. ''మీరు నన్ను రెండు, మూడు సార్లు కలిసినపుడు నేను మీకు నచ్చకపోవచ్చు. కానీ, మనం నాలుగోసారి కలిస్తే కచ్చితంగా స్నేహితులవుతాం. నా జీవితంలోనే ఒక ఫిల్టర్ సిస్టమ్ ఉన్నట్లుంది. అందుకేనేమో నేను మీకు నచ్చాలంటే నాలుగుసార్లు అయినా కలవాలి. నా కెరీర్ ప్రారంభంలోనే ప్రేక్షకుల నుంచి చాలా ప్రేమ లభించింది. 'కేదార్ నాథ్', 'సింబా' విడుదల తర్వాత రాత్రికి రాత్రే ఫేమ్ సాధించడంతో తొలినాళ్లలోనే అమ్మ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. నేను కూడా నిజాయతీతో పనిచేస్తే ప్రేక్షకులు ప్రేమతో ఆదరిస్తారని అప్పుడే తెలుసుకున్నా. అంతా మంచే జరగాలని ఆశిస్తూ ముందుకు సాగిపోవాలనుకున్నా. నెగిటివిటీని అస్సలు పట్టించుకోను. నా దృష్టిలో ఎలాంటి నెగిటివిటీ ఎదురైనా చివరికి పనే మాట్లాడుతుందని భావిస్తాను. ఒకవేళ ప్రేక్షకులు నన్ను ఇష్టపడకపోతే మరింత కష్టపడతాన''ని అంది. 'పతి పత్నీ ఔర్ వో దో' చిత్రంతో ఈ నెల 15 నుంచి థియేటర్లలో సందడి చేయనుంది సారా.

## వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారు.. 'పెద్ది'తో మాకు సంబంధం లేదు: టీఎస్ఎఫ్సీసీ




సింగిల్ స్క్రీన్లలో పూర్తిస్థాయి పర్సంటేజీ విధానాన్ని తెలంగాణ ఎగ్జిబిటర్లు కోరుతుండగా.. అది కష్టమంటున్నారు నిర్మాతలు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారాయి. ఈ పరిమాణాల నేపథ్యంలో తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎస్ఎఫ్సీసీ) గురువారం ప్రెస్ మీట్ నిర్వహించింది. తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి శ్రీధర్, నిర్మాత సి. కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్ మాట్లాడుతూ.. ''తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ లో భాగంగానే మొన్న ఎగ్జిబిటర్ల ప్రెస్ మీట్ జరిగింది. పర్సంటేజీ విధానం కోసం మేం 2008 నుంచి పోరాడుతున్నాం. గతేడాది కూడా అడగ్గా.. పెద్ద సినిమా 'హరిహర వీరమల్లు' విడుదల సమయంలో ఇలా చేయొద్దని చెప్పారు. రెండు నెలల్లో చర్చిద్దామన్నారు. నెలలు గడుస్తున్నా స్పందనలేదు. అందుకే మళ్లీ అడుగుతున్నాం. అటు తిప్పి ఇటు తిప్పి 'పెద్ది' సినిమా ప్రస్తావన తీసుకొచ్చారు. ఈ చిత్రంతో మాకు ఎలాంటి సంబంధం లేదు. కొందరు నిర్మాతలు వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారు. చర్చలకు వారు ఎప్పుడూ పిలిచినా మేం సిద్ధమే. రేపు (మే 15) ఫిల్మ్ ఛాంబర్ లో జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకుంటాం'' అని తెలిపారు.



## క్రిస్టల్ గౌనులో దేవ కన్యలా ఊర్వశి..

ఫ్రాన్స్‌లో జరుగుతోన్న కేన్స్ చిత్రోత్సవంలో భారత్ తో పాటు పలు దేశాలకు చెందిన సినీ తారలు పాల్గొని, తమ అందచందాలతో అదరగొడుతున్నారు. మంగళవారం ఆరంభమైన ఈ ఫెస్టివల్ ఈ నెల 23తో ముగుస్తుంది. ఇప్పటికే భారత్ నుంచి బాలీవుడ్ నటి అలియా భట్ రెడ్ కార్పెట్ పై మెరిసింది. మరో నటి ఊర్వశీ రౌతేలా కూడా క్రిస్టల్ గౌను ధరించి ఈ ఫిల్మ్ ఫెస్టివల్ లో తళుక్కున మెరిసింది. ప్రస్తుతం ఊర్వశీ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.

వియత్నాంకు చెందిన ఫ్యాషల్ లేబుల్ జోలీ పోలీ కోచర్ ఈ గౌనుని డిజైన్ చేసినట్లు ఊర్వశీ రౌతేలా వెల్లడించింది. గౌనుతో పాటు ఆమె ధరించిన వెండి ఎంబ్రాయిడరీతో, క్రిస్టల్స్, పూసల వర్క్ తో డిజైన్ చేసిన సిల్వర్ కలర్ ఫ్రాక్ అందర్నీ ఆకట్టుకుంది. అలాగే చోకర్ నెక్లెస్, భారీ ఇయర్ రింగ్స్, బ్రేస్ లెట్, కేశాలంకరణలో పక్షి ఆకారంలో ఉన్న ఆభరణం, చేత్తో పట్టుకున్న అద్దాలు, రంగుల రాళ్లు పొదిగిన క్లచ్... వంటివన్నీ కూడా చాలా ఆకర్షణీయంగా ఉన్నాయనే అభినందనలు దక్కించుకున్నాయి.

ఊర్వశి దేవ కన్యలా ఉందని పలువురు అభినందించారు. ఊర్వశి గౌను, ఆభరణాలు, బ్యాగు విలువ ఫ్యాషన్ నిపుణుల అంచనా ప్రకారం దాదాపు 155.87 మిలియన్ డాలర్లు అట. భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ. 1500 కోట్లు. వీటిని తయారు చేయడానికి 8 నెలలు పట్టిందట. ఇప్పటివరకూ ఊర్వశి పాల్గొన్న కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లోనే అత్యంత ఖరీదైనది ఇదే అని ఫ్యాషన్ నిపుణులు అంటున్నారు.



## కొచ్చిలో ఆ భయాన్ని జయించా : రష్మిక పోస్ట్

ప్రముఖ నటి రష్మిక తనలో ఉన్న అతిపెద్ద భయాన్ని అధిగమించినట్లు పేర్కొన్నారు. షూటింగ్ కోసం కొచ్చిలో ఉన్న ఆమె, ఎత్తులను చూసి భయపడే తన బలహీనతను ధైర్యంగా ఎదుర్కొన్నట్లు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా 'మైసా' షూటింగ్ అనుభవాలను పంచుకున్నారు. ''కొచ్చిలో ఉన్న రోజులు ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చాయి. అడవులు, కీటకాలు, జలపాతాలు, ట్రెక్కింగ్ లు, వర్కౌట్లు, వర్షాలు.. ఇలా ప్రతిదీ ఒక అనుభవం. ముఖ్యంగా ఎత్తులంటే నాకు చాలా భయం. ఇక్కడ ఆ భయాన్ని జయించాను. యాక్షన్ సీక్వెన్స్ ల కోసం శిక్షణ తీసుకోవడం, మోకాళ్లకు గాయాలైనా పట్టువదలకుండా పోరాడటం కొత్త శక్తిని ఇచ్చాయి. ఉదయాన్నే అలారం మోగగానే నిద్ర లేవడం నుంచి, ఎంతో ఇష్టమైన పళం పూరీలు కడుపునిండా తినడం వరకు ప్రతి క్షణాన్ని ఆస్వాదించాను'' అని పేర్కొన్నారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో 'మైసా' తెరకెక్కుతోంది. ఈ చిత్రం కోసం రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారని దర్శకుడు గతంలో తెలిపారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయని.. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్ చేశారని చెప్పారు.

**గ్లోబల్ ట్రెండింగ్ లో విరోష్ జోడీ..**

ఒకవైపు రష్మిక పోస్ట్ వైరల్ అవుతుండగా తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి చేసిన ఓ యాడ్ ఇప్పుడు గ్లోబల్ స్థాయిలో ట్రెండ్ అవుతోంది. విరోష్ జోడీకి ఏ రేంజ్ లో అభిమానులు ఉన్నారో తెలిసిందే. వీరిద్దరూ పెళ్లి తర్వాత చేసిన ఓ వాణిజ్య ప్రకటనను ఇన్ స్టాలో గతంలో అప్ లోడ్ చేయగా.. అది తాజాగా సరికొత్త రికార్డు సృష్టించింది. ఇప్పటివరకూ దీనికి ఏకంగా 9.1 మిలియన్లకు పైగా లైక్స్ వచ్చాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇన్ స్టాలో అత్యధిక లైక్స్ సాధించిన రెండో ప్రకటనగా రికార్డును సొంతం చేసుకుంది. ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నది కూడా ఈ జోడీనే.. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన ఓ యాడ్ 11.5 మిలియన్లకు పైగా లైక్స్తో గ్లోబల్ రికార్డు నెలకొల్పింది. దానికి 104 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ప్రస్తుతం వీరిద్దరూ కలిసి 'రణబాలి'లో నటిస్తోన్న విషయం తెలిసిందే.


Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.